


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



ఆర్‌ఎస్‌ఎస్‌లో లైంగిక వేధింపులపై దర్యాప్తు 05

శాంతియుత ప్రపంచం కోసం అణ్వాయుధాలను నిర్మూలించాలి 06

పుతిన్‌తో మరోసారి చర్చలు : ట్రంప్ 02



సంపుటి 08, సంచిక: 317 | శనివారం | 18-10-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ మద్దతు

- బిజెపికి బిఆర్‌ఎస్ అనుబంధంగా మారే ప్రమాదం ఉన్నందున కాంగ్రెస్ గెలవాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రమాదకర శక్తిగా మారిన బిజెపికి బిఆర్‌ఎస్ అనుబంధంగా మారే ప్రమాదం ఉన్నందున జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, అందుకే ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తరువాయి 2లో





## తారస్థాయికి దళితుల అణచివేతలు

- రాయ్‌బరేలిలో హరిఓం దారుణ హత్య యావత్ దేశ ప్రజల హృదయాలను కలచివేసింది
- బాధితులను బెదిరించడంలో బిజిగా అధికార యంత్రాంగం
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ధ్వజం
- హరిఓం కుటుంబంతో భేటీ

**కాన్పూర్ :** ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలిలో దళిత గ్రామస్తుడు హరిఓమ్ వాల్మీకి దారుణ హత్య దేశ ప్రజల హృదయాలను కలవరపరిచిందని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి కుటుంబాన్ని బెదిరించడానికి యంత్రాంగం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గురువారం ఆయన ఫతేపూర్ జిల్లాలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని తనను కలవనీయండా ఆపేందుకు అధికారులు ప్రయత్నించారని మండిపడ్డారు. అనంతరం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. హరి ఓమ్ వాల్మీకి దారుణ హత్య మొత్తం దేశ ప్రజలను కలవరపరిచిందన్నారు. అతని కుటుంబం దృష్టిలో బాధతో పాటు ఈ దేశంలో దళితుడిగా ఉండటం ఇప్పటికీ ఘోరమైన నేరమా? అనే ప్రశ్న కూడా మెదులుతోందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అధికార యంత్రాంగం బాధితుడి కుటుంబాన్ని బెదిరించడంలో బిజీగా ఉందని, ఆ కుటుంబాన్ని తనను కలవకుండా నిరోధించడానికి చాలా యత్నించిందన్నారు. బాధితులకు నాయ్యం చేయడంలో వ్యవస్థ పదే పదే వైఫల్యం చెందుతుందని, ఏదైనా ఘటన జరిగిన ప్రతిసారీ నేరస్థులను రక్షించి, బాధితుడిని దోషిగా నిలబెట్టిందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. న్యాయాన్ని గృహ నిర్బంధంలో ఉంచలేమన్నారు. బిజెపి ప్రభుత్వం బాధితుడి కుటుంబంపై ఒత్తిడిని ముగించి, దోషులకు కఠినమైన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. తాను హరి ఓం కుటుంబంతో పాటు దేశంలో దోపిడీకి గురైన, అణగారిన, దుర్బల పౌరుడికి అండగా నిలుస్తానన్నారు. ఈ పోరాటం హరిఓం కోసం మాత్రమే కాదు ? అన్యాయానికి తలొగ్గడానికి నిరాకరించే ప్రతి గొంతు కోసం అని తరువాయి 2లో

## బిసి రిజర్వేషన్ల అమలుకు
# నేడు రాష్ట్ర బంద్



బిసి సంఘాలు ఇచ్చిన పిలుపునకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు

బంద్‌కు సంఘీభావంగా అఖిలపక్ష, బిసి సంఘాల ముందస్తు ర్యాలీలు

బషీర్‌బాగ్ కూడలి నుంచి ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ

03

## బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది బిజెపినే

**నేటి బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు**

సింగరేణి కార్మికులకు బోనస్ : డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/ ఖమ్మం

తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది ముమ్మాటికీ బిజెపినేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ఇప్పటికీ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడలేనివిధంగా ఆర్థిక సామాజిక విద్య రాజకీయ సర్వే తరువాయి 2లో



## రేపు శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌ల పంపిణీ

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- సులువుగా భూ సేవలు అందడానికి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో ఈ నెల 19వ తేదీన సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లైసెన్సులను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని క్షేత్రస్థాయి ప్రజలకు సులభంగా భూ సేవలు అందే విధంగా ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. గత పది సంవత్సరాలుగా సర్వే విభాగం నిర్లక్ష్యానికి గురైందని, క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలకు తగిన సేవలు అందలేదని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి తరువాయి 2లో





## 'డిజిటల్ అరెస్టు' మోసాలపై సుప్రీం ఆందోళన

**స్పందన తెలపాలని కేంద్రం, సిబిఐలకు ఆదేశం**

**న్యూఢిల్లీ :** డిజిటల్ అరెస్టులు... ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకొన్న కొత్త పంథా. దీని పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయాందోళనకు గురిచేస్తూ.. పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సిబిఐలకు వారి స్పందన తెలపాలని తరువాయి 2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్




ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నవీన్ యాదవ్ నామినేషన్ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మేయర్ గద్వాల విజయలక్ష్మి , రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంపి అసదుద్దీన్ ఓవైసీ నవీన్ యాదవ్‌ను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. పదేండ్ల పాటు రాష్ట్ర పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. నువ్వు గెలవాలని నవీన్ యాదవ్‌ను అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని పోవాలంటూ ఆయనకు సూచించారు. నామినేషన్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నవంబర్ 11న జరిగే ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరువాయి 2లో

## ఆశన్నసహా 210 మంది లొంగుబాటు

**153 ఆయుధాలను అప్పగించిన మావోయిస్టులు**



**జగ్‌దల్‌పూర్ :** మావోయిస్టు అగ్రనేత, కేంద్రకమిటీ సభ్యుడు ఆశన్న అలియాస్ రూపేశ్ సహా దాదాపు 210 మంది నక్సలైట్లు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ బస్తర్ జిల్లాలోని జగ్‌దల్‌పూర్‌లో శుక్రవారం నిర్వహించిన నక్సలైట్ల లొంగుబాటు కార్యక్రమంలో వారంతా జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. మావోయిస్టు చరిత్రలోనే ఇది అతిపెద్ద లొంగుబాటుగా నిలిచింది. లొంగిపోయిన సీనియర్ మావోయిస్టు నాయకులలో కేంద్ర కమిటీ సభ్యుడు రూపేష్‌తో పాటు నలుగురు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి) సభ్యులు భాస్కర్ అలియాస్ రాజ్‌మ్‌న్ మాండవి, తరువాయి 2లో






# ప్రపంచం WORLD NEWS

## అమెరికా–చైనా వాణిజ్య యుద్ధంతో కనిష్ఠస్థాయికి చమురు ధరలు

**న్యూయార్క్:** అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ముడిచమురు ధరలు ఐదు నెలల కనిష్ఠస్థాయికి తగ్గాయి. 2026 లో చమురు సరఫరాల్లో మిగులు ఉంటుందని అంతర్జాతీయ ఎనర్జీ ఏజన్సీ ప్రకటించింది. బ్రెంట్ క్రూడ్ 48 సెంట్లు (0.8 శాతం) ధర క్షీణించింది. దీంతో ఒక బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 61.91 డాలర్లు వద్ద స్థిరంగా ఉంది. అదేవిధంగా డబ్ల్యుటిఐ కూడా 43సెంట్లు ధర తగ్గడంతో ముడి డబ్ల్యుటిఐ చమురు ధర బ్యారల్‌కు 58.27 డాలర్లు వద్ద స్థిరంగా ఉంది. అమెరికా–చైనా మధ్య ఉద్రిక్తతలు గనుక మరింతగా పెరిగితే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు ఒక బ్యారెల్‌కు 50డాలర్ల స్థాయికి పడిపోయే అవకాశాలు ఉన్నాయని బ్యాంక్ ఆఫ్ అమెరికా గురువారం ప్రకటించింది. రెండు ప్రపంచ అగ్ర దేశాలమధ్యా గడచినవారంలో తిరిగి వాణిజ్య యుద్ధం ప్రారంభమైంది. చైనాపై నూరుశాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అత్యంత విలువైన ఖనిజాల ఎగుమతులపై చైనా నియంత్రణలను పెంచడంతో ఆగ్రహించిన ట్రంప్ చైనాపై సుంకాల భారం వేశారు.

## పాకిస్తాన్–అఫ్ఘనిస్థాన్ మధ్య
# కొనసాగుతున్న కాల్పుల విరమణ



**ఇస్లామాబాద్/ కాబూల్:** పాకిసాస్తాన్–అఫ్ఘనిస్థాన్ మధ్య మొదలైన యుద్ధానికి తాత్కాలికంగా తెరపడింది. ఇరు దేశాల అంగీకారంతో, 48 గంటల కాల్పుల విరమణ కొనసాగుతున్నది. పాకిస్తాన్ కాబూల్ నగరంపై డ్రోన్ దాడులు జరిపిందని అఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. కాబూల్ పోలీసు చీఫ్ అధికార ప్రతినిధి ఖాలిద్ జద్రాన్, ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ప్రకటనలో ఈ దాడులు బుధవారం మధ్యాహ్నంలో నగరాన్ని విరుచుకుపడ్డాయని చెప్పారు. డ్రోన్ దాడుల్లో ఒక నివాస గృహం, ఒక మార్కెట్ ప్రభావితమయ్యాయని వివరించారు. మృతుల వివరాలు ఇవ్వలేదుగానీ ఆసుపత్రి డాక్టర్లు ఐదుగురు మరణించారని, వందల్లో మందికి గాయాలయ్యాయని పేర్కొన్నారు. అందుకు సమాధానంగా తాము కూడా ప్రతీకార దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఈనెల 10 తర్వాత ఇరు దేశాల మధ్య ఘర్షణలు తీవ్రస్థాయికి చేరిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ వెనుక ఎంత పెద్ద దేశం ఉన్నా వెనక్కు తగ్గేది లేదని తాలిబన్లు ప్రకటించగా, అఫ్ఘాన్ దాడుల వెనుక భారత్ హస్తం ఉందని పాక్ అనుమానం వ్యక్తం చేసింది. ఆ ఆరోపణలను భారత్ ఖండించింది. కాగా, యుద్ధాన్ని కోరుకోవడం లేదని కాబూల్ నుంచి వచ్చిన ప్రకటనకు పాక్ కూడా సానుకూలంగా స్పందించడంతో, ఎంతో మంది మరణాలకు, గాయాలకు కారణమైన ఘర్షణలకు ముగింపు పలకాలని ఇరు దేశాలు ఒప్పందానికి వచ్చాయి. ఒకటి రెండు ఘటనలు మినహా, ప్రస్తుతానికి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉందని తెలుస్తోంది. రెండు దేశాల్లో ఎవరూ కాల్పుల ఉల్లంఘనపై తాజా ప్రకటనలు చేయలేదు. 2021 తర్వాత రెండు దేశాల మధ్య పదుల సంఖ్యలో మరణాలు సంభవించడం ఇదే మొదటిసారి. ఈ యుద్ధానికి పూర్తిగా తెరపడితే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

## స్వాగతించిన చైనా



**బీజింగ్:** పాకిస్తాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య జరిగిన తీవ్రమైన యుద్ధానికి అనంతరం 48 గంటల కాల్పుల విరమణను చైనా గురువారం స్వాగతించింది. ఇరుదేశాలు తమ భేదాలను పరిష్కరించుకోవడానికి సమగ్ర, శాశ్వత ఒప్పందానికి చేరుకోవాలని పిలుపునిచ్చింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పాకిస్తాన్–అఫ్ఘానిస్థాన్ తాత్కాలిక కాల్పుల విరమణ అమలు చేయాలని, నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కారం కోరాలని నిర్ణయించిన విషయాన్ని గమనిస్తున్నట్టు చెప్పారు. ఇది రెండు దేశాల పరస్పర ప్రయోజనాలకు, అలాగే ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి తోడ్పడుతుందని అన్నారు. చైనా ఈ ప్రయత్నాన్ని స్వాగతిస్తూ మద్దతునిస్తుంది అని తెలిపారు. ఇరుదేశాలు శాంతమైన దృక్పథంతో, ఆత్మనిగ్రహంతో వ్యవహరించి, సంపూర్ణమైన, శాశ్వత కాల్పుల విరమణ సాధించే దిశగా కృషి చేస్తారని ఆశిస్తున్నట్టు చెప్పారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా అభిప్రాయభేదాలను పరిష్కరించుకోవాలని రెండు దేశాలకు హితవు పలికారు. అమెరికా కూడా కాల్పుల విరమణ ఒప్పందంపై హర్షం వ్యక్తం చేసింది. రెండు దేశాల మధ్య శాశ్వత యుద్ధ విరమణను కోరుకుంటున్నట్టు వైట్‌హౌస్ ప్రకటనలో తెలిపింది.

# ‘నెస్లే’లో 16 వేలమంది ఉద్యోగులపై వేటు




**జ్యూరిచ్:** ఎస్‌ప్రెస్సో కాఫీ, పెర్రియర్ వాటర్ వంటి ప్రముఖ ఫుడ్ ప్రోడక్ట్స్‌కు ప్రసిద్ధి చెందిన బ్రాండెడ్ కంపెనీ ‘నెస్లే’ రాబోయే రెండు సంవత్సరాలలో ప్ర పంచ వ్యాప్తంగా 16,000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నది. కొత్తగా బాధ్యతలు తీసుకున్న నెస్లే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఫిలిప్ నవ్రాతిల్ గురువారం ఈ విషయం చెప్పారు. ప్రపంచం శరవేగంగా మార్పు లు చెందుతోంది, నెస్లే కూడా అందుకు అనుగుణంగా వేగంగా మార్పులు చెందాలి, కొత్త సాకేతికతను అందిపుచ్చుకోవాలి’’ అన్నారు. సెప్టెంబరు మొదటివారంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ గా నవ్రాతిల్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే 4,000 మంది ఉద్యోగులను తొలగించే ప్రక్రియ ప్రారంభమైందని, 12,000 మంది వైట్ కాలర్డ్ ఉద్యోగస్తులను తొలగించడం ద్వారా కంపెనీకి 100 కోట్ల స్విస్ ఫ్రాంక్స్ ఆదా అవుతాయన్నారు. 2027 నాటికి 300 కోట్ల స్విస్ ఫ్రాంక్స్‌ను ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి మార్కెట్ నుండీ ‘నెస్లే’లో ఈఉపసంహరణలు జరుగుతాయని, ప్రస్తుత దశలో ఏ మార్కెట్ నుండి ఎంతమందిని తొలగించాలనే విషయం చెప్పలేమని, మార్కెట్‌కు అనుగుణంగా ఎవరి ప్రణాళిక వారే రూ పొందించుకోవాల్సి ఉంటుందన్నారు. బాధాకరమే ఐనప్పటికీ, సంఖ్య తగ్గిం చుకోవాల్సిన నిర్ణయం అనివార్యమన్నారు. గడచిన తొమ్మిది నెలలుగా కంపెనీ లావాదేవీలను ఆయన ప్రస్తావిస్తూ 1.9 శాతం మేరకు విక్రయాలు క్షీణించిపోయాయని చెప్పారు. దాదా పు 83 బిలియన్ డాలర్ల మేరకు విక్రయాలు క్షీణించాయని చెప్పారు.

# పుతిన్‌తో మరోసారి చర్చలు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో మరోసాని చర్చిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. బుధవారం పుతిన్‌తో ఫోన్‌లో సంభాషించిన ఆయన, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశాన్ని ఖరారు చేశారు. ఈ సమావేశం అనంతరం పుతిన్‌తో మరోసారి చర్చిస్తానని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ చర్చలు ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయన్న విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఒకటి రెండు వారాల్లో వీరి చర్చలు ఉండవచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, పుతిన్‌తో జరిగిన ఫోన్ సంభాషణతో ఎంతో మంచి పురోగతి సాధ్యమైందని ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టులో రాశారు. ఇదివరకు ఇరువురు నాయకులు ఆగస్టులో అలాస్కాలో కలుసుకుని సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినా, ఆశించిన పురోగతి లేదు. అందుకే, మరోసారి భేటీ అయ్యే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. పుతిన్ విదేశాంగ సలహాదారు యూరీ ఉషకోవ్ ప్రకారం, ఈ కాల్‌ను రష్యా అధ్యక్షుడే ప్రారంభించారు. ఉక్రేన్‌కు టోమాహాక్ క్షిపణులు అమ్మితే, అది ఇరు దేశాల మధ్య సంబంధాలపై తీవ్రమైన ప్రభావాలు కలుగజేస్తుందని ట్రంప్‌కు పుతిన్ స్పష్టం చేశారు.

# రాజీనామా ప్రసక్తే లేదు

### స్పష్టం చేసిన పెరూ అధ్యక్షుడు



**లిమా:** పెరూలో ‘జెన్ జెడ్’ నిరసనలు ఉవ్వెత్తును ఎగిసిపడుతుండగా, గురువారం నాటి నిరసనలో పాల్గొన్న ప్రదర్శనకారుడు మరణించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొత్తగా పదవీ బాధ్యలు చేపట్టిన జొస్ జెరి రాజీనామా చేయాలన్న డిమాండ్ వినిపిస్తున్నది. అయితే, ఆయన రాజీనామాకు ససేమిరా అంటున్నారు. జెన్ జెడ్ ప్రదర్శనల్లో 80 మంది పోలీసులు, 10 మంది జర్నలిస్టులుసహా కనీసం 100 మంది గాయపడినట్టు తెలుస్తోంది. ఉద్యమం తీవ్రతరం అవుతున్నప్పటికీ తాను రాజీనామా చేయబోనని జెరి పేర్కొన్నారు. శుక్రవారం పార్లమెంట్‌ను సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశ స్థిరత్వాన్ని కాపాడటం తన బాధ్యతగా పేర్కొన్నారు. లిమాలో జెన్ జెడ్ ఆందోళనలు సుమారు నెల రోజుల క్రితం మొదలయ్యాయి. ఉద్యోగ కల్పన, వృద్ధులకు పెన్షన్లు, ఉద్యోగులులకు మెరుగైన జీతాలు డిమాండ్ చేస్తూ ఈ ఉద్యమం మొదలైంది. లిమాలో నిరంతరం చోటు చేసుకుంటున్న అస్థిరతకు ఈ నిరసనలు అద్దం పడుతున్నాయి. దశాబ్దకాలంలో ఏడో అధ్యక్షుడిగా జెరి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, ఆయనతోపాటు పార్లమెంటు సభ్యులు కూడా వెంటనే రాజీనామా చేయాలని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు.

## ‘వంట బిల్లులు, వేతనాలను’ విడుదలచేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాఠశాల వంట కార్మికుల పెండింగ్ ‘వంట బిల్లులు, వేతనాలను’ వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల మేరకు కార్మికులకు రూ. 10వేల వేతనాలను వెంటనే అమలు చేయాలన్నారు. హైదరాబాద్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ‘మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం’ జరిగింది. యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి తోపునూరి చక్రపాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్ బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అల్పాహారంకు సంబంధించిన పాత బకాయిలు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని, మళ్లీ అల్పాహారం పథకాన్ని ప్రవేశ పెడితే ,దీనిని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 31వ తేదీన, నవంబర్ 12న ‘టోకెన్ సమ్మె’నునిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యధర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపెల్లి విజయలక్ష్మి ,తోపునూరి చక్రపాణి, ఆధి రంగారెడ్డి, మీస లక్ష్మ ణ్, ధర్ముల రామ్మూర్తి, నిమ్మటూరి రామకృష్ణ, సంఘెం పద్మ తదితరులు పాల్గొన్నారు.



## సుప్రీం ఆందోళన (మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం ఆదేశించింది. హర్యానాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌కి ఫిర్యాదు పత్రం రాశారు. అందులో.. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారన్నారు. రూ.కోటి ఇస్తే ఈ అరెస్టు నుంచి బయటపడొచ్చని వారు బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె తెలిపారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి నేరగాళ్ల సొమ్ములు కాజేయడాన్ని సిజెఐతో సహా సీనియర్ న్యాయమూర్తులు తీవ్రంగా పరిగణించారు. అంబాలా కేసును న్యాయస్థానం సుమోటోగా తీసుకోగా.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది.ఈ సందర్భంగా న్యాయమూర్తులకు సంబంధించి నకిలీ సంతకాలు, సుప్రీం, హైకోర్టులు ఆదేశాలు జారీ చేసినట్లు పత్రాలు చూపించి ఇలాంటి నేరాలకు పాల్పడటం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని ధర్మాసనం పేర్కొంది. వీటిని సాధారణమైన మోసాలుగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. ఇలాంటి నేరాలను బయటపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసుల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయపడింది. ఇక, అంబాలా కేసుకు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని అటార్నీ జనరల్‌ను, స్థానిక సైబర్ క్రైమ్ విభాగానికి సూచించింది. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి స్పందన తెలియజేయాలని కేంద్రం, సిబిఐలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## యాదవ్ నామినేషన్
(మొదటి పేజీ తరువాయి)

నవీన్ యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ప్రజాస్వామిక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస పరాజయాలు ఎదుర్కొన్న బిఆర్‌ఎస్ పార్టీ ఇప్పుడు కంటోన్మెంట్ ఎన్నికల్లో కూడా ఓటమిని చవిచూసిందన్నారు. ప్రజలు వారి తప్పుడు వాగ్దానాలను గుర్తించి తిరస్కరించారన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే బిఆర్‌ఎస్ ఓట్ చోరీ అంశాన్ని ముందరేసుకుందన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్, బిజెపి ప్రజలకు ఏం చేశాయో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము రెండేండ్లలో ఏం చేశామో చెప్తామన్నారు. జూబ్లీహిల్స్ ను రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతామని హామీనిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మాట్లాడుతూ తనకుకు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధితో జూబ్లీహిల్స్‌లో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించబోతున్నారని అన్నారు.

## 210 మంది లొంగుబాటు (మొదటి పేజీ తరువాయి)

రాణిత, రాజు సలాం, ధన్ను వెట్టి అలియాస్ సంతు, ప్రాంతీయ కమిటీ సభ్యుడు రతన్ ఎలామ్ ఉన్నారు. వీరంతా 153 ఆయుధాలను అప్పగించగా వాటిలో 19 ఎకె47 రైఫిల్స్, 17 సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్స్, 23 ఇన్సాస్ రైఫిల్స్, ఒక ఇన్సాస్ ఎల్‌ఎంజి (లైట్ మెషిన్ గన్), 36 .303 రైఫిల్, నాలుగు కార్బైన్, 11 బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్ (బిజిఎల్) ఉన్నాయి. అక్టోబర్ 2న బస్తర్ ప్రాంతంలోని బిజాపూర్ జిల్లాలో 103 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారిలో 49 మందిపై సమష్టిగా రూ. 1.06 కోట్లకు పైగా రివార్డును కలిగి ఉన్నారు. తాజా లొంగుబాటుతో గత మూడు రోజుల్లో మొత్తం 238 మంది నక్సలైట్లు హింస మార్గాన్ని విడిచిపెట్టి రాష్ట్రంలో ప్రధాన స్రవంతిలోకి చేరారని, బుధవారం మరో 28 మంది లొంగిపోయారని అధికారులు తెలిపారు. మావోయిస్టుల లొంగుబాటుపై ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి మాట్లాడుతూ ఈ పరిణామం బస్తర్‌కు మాత్రమే కాకుండా ఛత్తీస్‌గఢ్‌కు, మొత్తం దేశానికి ఇది చారిత్రక రోజు అని అభివర్ణించారు. తప్పుదారి పట్టి సమాజం నుండి వేరు చేయబడిన 210 మంది సోదరసోదరీమణులు రాజ్యాంగం, మహాత్మా గాంధీ చూపిన అహింస మార్గం మరియు రాష్ట్ర పునరావాస విధానంపై విశ్వాసం చూపిస్తూ ప్రధాన స్రవంతిలోకి తిరిగి చేరారని అన్నారు.

లొంగిపోయిన కార్యకర్తలలో అగ్రశ్రేణి నాయకులు, దిగువ స్థాయి సభ్యులు ఉన్నారని, వారిని అభినందిస్తూ, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సరెండర్ అండ్ రిహాబిలిటేషన్ పాలసీలో ఆర్థిక సహాయం, భూమి ప్రయోజనాలు, కొత్త పారిశ్రామిక విధానంలోని ప్రయోజనాలు, వాటిని ఉపాధితో అనుసంధానించడం వంటి బహుళ నిబంధనలు ఉన్నాయని ఆయన అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమగ్ర నక్సల్ వ్యతిరేక వ్యూహం ఫలితంగా ఈ చారిత్రాత్మక ఘటనను చూస్తున్నామని, దీనికి పోలీసులు, భద్రతా దళాలు, స్థానిక యంత్రాగం నుండి నిరంతర ప్రయత్నాలు, అవగాహన, అప్రమత్తమైన వర్గాల చురుకైన భాగస్వామ్యం మద్దతు ఇస్తున్నాయని ఆయన అన్నారు. బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయం జగదల్‌పూర్‌లో పోలీసులు, పారామిలిటరీ అధికారుల ముందు లొంగిపోయిన వారందరినీ గిరిజన నాయకులు, పూజారులు ప్రధాన స్రవంతిలోకి అధికారికంగా స్వాగతించారు. ప్రేమ, శాంతి, కొత్త ప్రారంభానికి ప్రతీకగా వారిని ఎర్ర గులాబీలతో స్వాగతించారు.

## కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ మద్దతు (మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరుతూ టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి.నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, కలవేణ శంకర్, ఎం.బాల నరసింహ, బాగం హేమంత రావు, వి.ఎస్.బోస్, సిపిఐ ఎంఎల్‌సి సభ్యులు నెల్లికంటి సత్యంతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బిసి జెఎసి రాష్ట్ర బంద్, జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల, తాజా రాజకీయ పరిస్థితులు తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. సమావేశం అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ 2018, 2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహనతో ఉన్నామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ రెండు సంవత్సరాల కాలంలో వివిధ సందర్భాలలో క్రిటికల్‌గానే ఉంటూ, రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో నిర్మాణాత్మకమైన సూచనలు చేశామని కూనంనేని గుర్తు చేశారు. మారిన ప్రస్తుత రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భవిష్యత్‌లో మంచి పరిణామంగా మారుతందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో బిసి జెఎసి చేపట్టిన రాష్ట్ర బంద్‌లో సిపిఐ పూర్తి మద్దతును ఇస్తూ, ప్రత్యక్షంగా బంద్‌లో పాల్గొంటామని కూనంనేని సాంబశివరావు చెప్పారు.

**మిత్రపక్షాల ఐక్యతతో జూబ్లీహిల్స్‌లో గెలుస్తాం : మహేష్ కుమార్ గౌడ్**

సిపిఐ, కాంగ్రెస్ మిత్రపక్షాల ఐక్యతతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ మంచి మెజార్టీతో గెలుస్తుందని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో ఉప ఎన్నికల్లో సత్ఫలితాలు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక మంచి కార్యక్రమాలకు మిత్రపక్షమైన సిపిఐ మద్దతును ఇస్తున్నదని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు కోరేందుకు తాము చారిత్రాత్మకమైన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు వచ్చానని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

## అణచివేతలు (మొదటి పేజీ తరువాయి)

ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, హరి ఓం కుటుంబంతో రాహుల్‌గాంధీ దాదాపు 25 నిమిషాలు గడిపారు. హరిఓం తండ్రి గంగాదీన్, సోదరుడు శివం, సోదరి కుసుమ్‌తో మాట్లాడారు. వారికి సానుభూతి తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడాతు ఈ ప్రభుత్వంలో దళిత అణచివేత గరిష్ట స్థాయికి చేరుకుందని ఆరోపించారు. కొన్ని రోజుల క్రితం ఒక దళిత అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. బాధితురాలి కుటుంబానికి ముఖ్యమంత్రి న్యాయం చేయాలని, వారిని గౌరవించి నేరస్థులపై త్వరిత చర్య తీసుకోవాలి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఇంట్లోనే బంధించిందంటూ వ్యాఖ్యానించారు. హరి ఓం వాల్మీకి కుటుంబసభ్యుల్లోకి ఒకరికి వైద్య చికిత్స అవసరం ఉన్నా, అధికారుల చర్యల కారణంగా దానిని పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ‘ఆ కుటుంబం నేరం చేయలేదు. వారిపై నేరం జరిగింది. కానీ వారిని నేరస్థులుగా చూస్తున్నారు. వారిని ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదు. వారిని బెదిరిస్తున్నారు. వారు అడుగుతున్నదల్లా న్యాయం మాత్రమే. ఆ ఇంట్లో ఓ అమ్మాయికి ఆపరేషన్ చేయవలసి ఉంది, కానీ ప్రభుత్వం వారిని నిర్బంధించడం వల్ల అది జరగలేదు‘ అని రాహుల్ గాంధీ తెలిపారు. కాగా, ప్రతిపక్ష నేత సందర్శనకు కొన్ని గంటల ముందు బాధితుడి సోదరుడు శివం వాల్మీకి కుటుంబంతో ఒక వీడియోను విడుదల చేసి, రాహుల్‌గాంధీ తన సందర్శనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోకూడదని పేర్కొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ వీడియో ఒత్తిడిని సృష్టించడానికి, పరిస్థితిని మార్చటానికి బిజెపి చేసిన ప్రయత్నం అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఇదిలా ఉండగా, దళితుల వేధింపుల కేసుల్లో ఉత్తరప్రదేశ్ దేశంలోనే ముందుందని చూపించే తాజా జాతీయ నేర రికార్డు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలను కూడా గాంధీ ఉదహరించారు. ఈనెల 2వ తేదీ తెల్లవారుజామున 1 గంటలకు రాత్రి జాగరణ సమయంలో గ్రామస్తులు వాల్మీకి (40)ని దొంగగా భావించి కొట్టి చంపారని ఆరోపణలు వచ్చాయి. దొంగతనాల కోసం ఇళ్లను గుర్తించడానికి ఒక ముఠా డ్రోన్‌లను నిఘా కోసం ఉపయోగిస్తున్నట్లు పుకార్లు వచ్చాయి. ఈ హత్యాకాండ ఘటన విస్తృత ఆగ్రహాన్ని రేకెత్తించింది, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వం దళితులను రక్షించడంలో, మూక హింసను అరికట్టడంలో విఫలమైందని ఆరోపించాయి. దాడి తర్వాత, పోలీసులు కేసు నమోదు చేసి, 10న జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత అరెస్టు చేయబడిన ప్రధాన నిందితుడితో సహా ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. కేసును నిర్వహించడంలో వైఫల్యం కారణంగా ఇద్దరు సబ్‌ఇన్‌స్పెక్టర్లు సహా ఐదుగురు పోలీసులను సస్పెండ చేశారు.

## అడ్డుకుంటున్నది బిజెపినే
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించామని సర్వే వివరాల ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. గతంలో బిఆర్‌ఎస్ తీసుకు వచ్చిన చట్టాన్ని సవరించామని తెలిపిన భట్టి బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల కల్పనకు సంబంధించి గవర్నర్‌కు బిల్లు పంపిన ఇంత వరకు ఆమోదించ లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొన్ని నెలలుగా బిసి చట్టం అమల్లోకి రాకుండా అడ్డుకుంటుందని ఆయన తెలిపారు. బిజెపి నైజాన్ని తెలంగాణ ప్రజలతో పాటు యావత్ దేశ ప్రజలు గుర్తిస్తున్నారని అఖిలపక్షం కలిసేందుకు కూడా ప్రధాన మంత్రి అంగీకరించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షంతో కలిసేందుకు ప్రధాన మంత్రికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసి ఆహ్వానించినా బిజెపికి పాల్గొనలేదని ఆయన తెలిపారు. రాష్ట్రానికి చెందిన బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వం వద్ద బిసి బిల్లు ఆమోదం పొందేవిధంగా కోరాలని ఆయన సూచించారు. సుప్రీం కోర్టు తీర్పు కాపీ రాగానే రిజర్వేషన్ల అంశంపై చర్చిస్తామని ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు రూ. 400 కోట్ల బోనస్ ప్రకటించిందని ఆయన తెలిపారు. దేశంలో వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికులకు బోనస్ అందించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ దీపావళి తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఏ కొండబాల కోటేశ్వరరావు, నగర అధ్యక్షులు జావిద్, కొత్తా సీతారాములు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## లైసెన్స్‌ల పంపిణీ
(మొదటి పేజీ తరువాయి)

డిఎస్ లోకేష్ కుమార్, సర్వే విభాగం కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంలో భాగంగా రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్‌ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. భూభారతి చట్టంలో పొందుపర్చిన విధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 350 మంది సర్వేయర్లు సరిపోరని, మరి కొంత మంది సర్వేయర్లు అవసరమవుతారని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఒక వైపు లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ల పోస్టులు భర్తీ చేయడం, అలాగే భూముల సర్వేకు అవసరమైన అత్యాధునికి పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

సర్వేయర్లను నియామకానికి దరఖాస్తులను ఆహ్వానించగా పది వేల మంది దరఖాస్తు చేసుకోగా, తొలివిడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని, ఇందులో 3,465 మంది అర్హత సాధించారని వివరించారు. రెండవ విడతలో మరో మూడు వేల మందికి ఆగస్టు 18వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించామని ఈనెల 26వ తేదీన జెఎన్‌టియు ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి 40 రోజుల పాటు అప్రంటిస్ శిక్షణ ఉంటుందని, వీరి సేవలు కూడా డిసెంబర్ రెండవ వారం నాటికి అందుబాటులోకి వస్తాయని వివరించారు. రెవెన్యూ శాఖకు సర్వే విభాగానికి అవినాభావ సంబంధం ఉంటుందని, భూముల కొలతలు, రికార్డులు స్పష్టంగా ఉన్నప్పుడే వివాదాలు తగ్గుతాయని, సర్వే వ్యవస్థ బలపడితేనే ప్రజలకు భద్రత, న్యాయం లభిస్తుందని అన్నారు.

ప్రతి రెవెన్యూ గ్రామంలో జిపిఒలు, ఇప్పుడు ప్రతి మండలంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లతో ప్రజలకు అవసరమైన భూ సంబంధిత సేవలు అందేలా వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూమి రికార్డులు స్పష్టంగా ఉండేలా, ప్రజలకు ఇబ్బంది లేకుండా, అవినీతి లేని సేవలు అందించడమే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## డిపిఒ, డిఎల్‌పిఒల అద్దె వాహనాల వసతి మరో ఏడాది పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పని చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు (డిపిఒ), డివిజన్ లెవల్ పంచాయతీ అధికారులు (డిఎల్‌పిఒ) వినియోగిస్తున్న అద్దె వాహనాల వసతిని మరో సంవత్సరం పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అద్దె వాహనాల దస్త్రానికి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క శుక్రవారం ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 31 మంది జిల్లా పంచాయతీ అధికారులు, 68 మంది డివిజన్ లెవల్ పంచాయతీ అధికారులకు వాహనాల సదుపాయం కొనసాగుతుంది. వారి వాహన అద్దె చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.3.96 కోట్లు మంజూరు చేసింది.



తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా ఇటీవల నియమితులైన డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డిని తెలంగాణ అరసం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి, ఉపాధ్యక్షుడు బొమ్మగాని నాగభూషణం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుకు 'ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసిత రైతులు ప్లాట్ల' యజమానులు హైదరాబాద్‌లో మఖ్దూంభవన్‌లో శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు చింతల దామోదర్ రెడ్డి, నడికుడి అంజయ్య, గుజ్జుల సురేందర్ రెడ్డి, పల్లె శేఖర్‌రెడ్డి, జాల వెంకటేష్ యాదవ్, జాల శ్రీశైలం యాదవ్, సందగల మల్లేష్ గౌడ్, నాగవల్లి దశరథ గౌడ్, నెల్లికండి నాగార్జున యాదవ్, గాజుల భగత్, రావికంటి శ్రీనివాస్, బద్రుద్దీన్, తాటికొండ నవీన్ పాల్గొన్నారు.

## 1.15 కోట్ల విలువైన హ్యాష్ ఆయిల్ స్వాధీనం

**హైదరాబాద్ :** హ్యాష్ ఆయిల్ తరలిస్తున్న బాలుడిని రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 17 ఏళ్ల బాలుడు రూ. 1.15 కోట్ల విలువైన 5.1 కిలోల హషీష్ ఆయిల్‌ను రవాణా చేస్తుండగా పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. మల్కాజ్‌గిరిలోని స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్ఒటి), ఘట్‌కేసర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న బాలుడిని అడ్డుకుని సోదాలు చేయగా, ఒకే బ్యాక్‌ప్యాక్‌లో రెండు పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసిన హషీష్ ఆయిల్ బయటపడిందని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. హషీష్ ఆయిల్‌ను సేకరించిన ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. బాలుడు అతన్ని పరిచయం చేసుకుని త్వరిత ఆర్థిక లాభం కోసం హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో గంజాయి, హషీష్ ఆయిల్‌ను సరఫరా చేయడానికి పథకం పన్నారని సిపి వివరించారు. పోలీసుల ప్రకారం, ప్రధాన నిందితుడు 5.1 కిలోల హషీష్ ఆయిల్‌ను సేకరించి, దానిని రవాణా చేయడానికి బాలుడిని ఉపయోగించుకున్నాడు. ఈనెల 15న, ఆ బాలుడు అక్రమంగా రవాణా చేసిన వస్తువులను సేకరించి హైదరాబాద్‌కు వెళ్లాడు, అక్కడ శుక్రవారం అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



### మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముద్రణాలయం (చంచల్‌గూడ) యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ముద్రణాలయం (చంచల్‌గూడ) ఎఐటియుసి యూనియన్ సెంట్రల్ కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అజీజ్‌పాషాతో పాటు తెలంగాణ రాష్ట్ర ముద్రణాలయం (చంచలగూడ) యూనియన్ (ఎఐటియుసి) వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ఎస్.బోస్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, మాజీ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో కొత్త పెన్షన్ తీసుకొచ్చి ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. పిఎఫ్ విధానంలో కూడా ఉద్యోగులకు వ్యతిరేక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్‌ను చంచల్‌గూడ నుండి తొలగించి, ఈ స్థలాన్ని నాంపల్లి క్రిమినల్ కోర్టుకు ఇవ్వాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని యూనియన్ తీవ్రంగా వ్యతిరేకించిందని, ఈ ప్రెస్‌ను కాపాడుకున్నామని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్ (జిసిపి)ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నించొద్దని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**యూనియన్ అధ్యక్షుడిగా అజీజ్ పాషా..**

తెలంగాణ రాష్ట్ర ముద్రణాలయం (చంచలగూడ) యూనియన్ (ఎఐటియుసి)సెంట్రల్ కమిటీ జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ అధ్యక్షునిగా సయ్యద్ అజీజ్‌పాషాను, ప్రధాన కార్యదర్శిగా వేణు, ఉపాధ్యక్షులుగా వి.ఎస్.బోస్, బ్రాంచి సెక్రెటరీగా యూనస్ అహ్మద్‌ను ఎన్నుకున్నారు. అలాగే బ్రాంచ్ ప్రెసిడెంట్‌గా టి.సురేష్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా టి.శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. సెక్రెటేరియట్ ప్రెస్ అధ్యక్షునిగా మహ్మద్ సయీద్ ఉద్దీన్, కార్యదర్శిగా వి.బాల్‌రాజ్, అసెంబ్లీ ప్రెస్ అధ్యక్షునిగా ఉమానాథ్ ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. నూతనంగా ఎన్నికైన వారికి అజీజ్ పాషా శుభాకాంక్షలు తెలిపారు. గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్ (జిసిపి)లో అందరు కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేడు బిసి కోటాపై రాష్ట్ర బంద్



### రాజకీయ పార్టీలు, అన్ని బిసి సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలు కోసం 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో శనివారం రాష్ట్ర బంద్ జరగనుంది. బిసి జెఎసి పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌కు సబ్బండ వర్గాలు, రాజకీయ పార్టీలు, అన్ని బిసి సంఘాలు, కూల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు తమ సంపూర్ణ మద్దతు తెలిపాయి. బిసి రిజర్వేషన్‌లు అమలు చేయాలని, బంద్‌కు సంఘీభావంగా సిపిఐ ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడ వైఎంసిఏ చౌరస్తా నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. బిసి జెఎసి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం చేపట్టే ర్యాలీలో వివిధ రాజకీయ పార్టీలు పాల్గొనున్నాయి.

**అఖిల పక్ష సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ..**

ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం అఖిల పక్ష బిసి సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు సంఘీభావ ర్యాలీని నిర్వహించాయి. బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి బిసి జెఎసి చైర్మన్ ఆర్. కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ జన సమితి (టిజెఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగా, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆప్ నాయకులు డాక్టర్ డి.సుధాకర్, బిసి జెఎసి నాయకులు రాజారామ్ యాదవ్, గుజ్జ కృష్ణ ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని, రిజర్వేషన్‌ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి, చట్ట సవరణ చేయాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలకు తప్పకుండా రిజర్వేషన్‌లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. శనివారం జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్‌లో పార్టీలు, సంఘాలకు అతీతంగా సబ్బండ వర్గాలు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి : మహేశ్ కుమార్ గౌడ్**

బిసి జెఎసి బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. బిసి జెఎసి బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తాను కూడా బంద్‌లో పాల్గొంటానని చెప్పారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు పాల్గొంటారన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని చెప్పారు. బిజెపి నేతలు ఎన్ని మాటలు చెప్పినా బిసిల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

**బిసి బంద్‌కు మద్దతు ప్రకటించిన కల్వకుంట్ల కవిత**

బిసి జెఎసి బంద్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు తెలిపారు. బిసి బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బిసిల రిజర్వేషన్‌ల కోసం తాను పోరాడతానని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టిన బిజెపి ఇప్పుడు బంద్‌లో పాల్గొంటోందని, అంటే బిసి రిజర్వేషన్‌ల బిల్లు పాస్ చేసినట్లు భావించాలా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడకుండా బిసి రిజర్వేషన్‌లపై ఉత్తుత్తి జి.ఓ ఇచ్చిన కాంగ్రెస్ తామే ముందుండి బంద్ చేయిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని కవిత విమర్శించారు.

**బంద్‌కు మద్దతు తెలిపిన ఆటో జెఎసి**

బిసి జెఎసి బంద్‌కు ఆటో జెఎసి మద్దతు తెలిపింది. శుక్రవారం విద్యానగర్‌లోని బిసి భవన్ వద్ద బిసి యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌లు రాజ్ కుమార్ నేతృత్వంలో ఆటో జెఎసి ప్రతినిధులు, ఆర్.కృష్ణయ్యను కలిసి మద్దతు ప్రకటించారు. అనంతరం నేటి బంద్‌కు మద్దతుగా జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన ఆటో ర్యాలీని ఆర్. కృష్ణయ్య ప్రారంభించారు. బంద్‌కు గ్రామస్థాయి నుండి ఎక్కడికక్కడ బిసిలు నేతృత్వం వహించి విజయవంతం చేయాలని కృష్ణయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఒయు జెఎసి నాయకులు రాజు, మణికంఠ నేత, ఆటో జెఎసి నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ, జాంగిర్, మల్లేష్, మహేష్, వెంకటేశ్ గౌడ్, రాజేష్, రాము, సంతు, రామస్వామి, నిఖిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



**ఒయులో బైక్ ర్యాలీ..**

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వామపక్ష, దళిత, బహుజన, బిసి, స్వతంత్ర, జెఎసిల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 42 శాతం బిసి రిజర్వేషన్‌లు అమలు చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతుగా శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించాయి. బంద్ విజయవంతం చేయాలని ఒయు ఆర్ట్స్ కళాశాల నుండి లా కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించి, మహాత్మ జ్యోతిబా పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి వినతి పత్రాలు సమర్పించారు.

**బిసి బంద్ విజయవంతం చేయాలి : సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్**

బిసి జెఎసి పిలుపునిచ్చిన బంద్‌ను విజయవంతం చేయాలని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో నేడు లాలపేట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు.

**విద్య, వ్యాపార సంస్థలు బంద్‌లో పాల్గొనాలి : ఒయు బిసి జెఎసి**

బిసి జెఎసి బంద్‌లో ప్రజలు, విద్య, వ్యాపార సంస్థలు పాల్గొనాలని ఒయు బిసి జెఎసి నాయకులు డాక్టర్ సాంబశివ గౌడ్, డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఒయులో బంద్ విజయవంతం కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ రావు, నాయకులు వట్టికూర రామారావు గౌడ్, చెన్నయ్య, ముదిరాజ్, లోకేష్ యాదవ్, చరణ్ యాదవ్, బొమ్మ హనుమంతు పాల్గొన్నారు.

## బంద్ సందర్భంగా భారీ బందోబస్తు

### ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోలీసు పికెట్లు

### అప్రమత్తమైన నిఘా అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం కల్పించాలని డిమాండ్‌తో బిసి సంఘాలు, ఆయా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బంద్‌కు సిపిఐ (మావోయిస్టు) పార్టీ కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మరింత కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్‌టిసి బస్‌స్టేషన్‌లు, రైల్వే స్టేషన్‌ల వద్ద పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. అన్ని జిల్లా కేంద్రాలలో శుక్రవారం రాత్రి నుంచే పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని డిజిపి శివధర్‌రెడ్డి అన్ని జిల్లాల ఎస్‌పిలు, కమిషనరేట్ల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని తెలిపారు. ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిస్తే అదుపులోకి తీసుకుని శాంతియుత పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇక పెట్రోలింగ్‌ను కూడా పెంచడంతో పాటు నిఘా అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని అధికారులకు తెలియజేయాలని డిజిపి వారికి తెలిపారు. బిసి సంఘాలు తలపెట్టిన బంద్‌కు 50 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బంద్ సందర్భంగా అసాంఘీక శక్తులు రెచ్చిపోయే ప్రమాదం ఉందని డిజిపి సూచించారు.

**శాంతి యుతంగా నిర్వహించుకోండి..**

బిసి సంఘాలు తలపెట్టిన బిసి బంద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి సూచించారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం బిసి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో డిజిపి పలు సూచనలు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డిజిపి పేర్కొన్నారు.

## స్వచ్ఛందంగా బంద్ పాటించండి

### ప్రజలకు, వ్యాపార సంస్థలకు ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

### శాంతియుతంగా కొనసాగించాలని బిసి నేతలకు పిలుపు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అన్ని వర్గాల ప్రజలు, వ్యాపార సంస్థలు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌లో పాల్గొనాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనకు 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట ఈ నెల 18న తెల్లవారుజాము 4.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే బంద్ శాంతియుతంగానే కొనసాగుతుందన్నారు. ఇప్పటికే 135 బిసి కుల సంఘాలు, 35 బిసి సంఘాలు, సిపిఐ, కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, సిపిఎం, ఆప్ పార్టీలు బంద్‌కు మద్దతిచ్చాయని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి వైస్‌చైర్మన్ విజిఆర్ నారగోని, కో– ఆర్డినేటర్ గుజ్జకృష్ణ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా బిజెపి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం దేశ చరిత్రలోనే మొదటిసారి అని పేర్కొన్నారు. అగ్రకులాల పేదల ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఎన్నడూ తాము వ్యతిరేకించలేదన్నారు. కానీ, బిసిలు రాజకీయంగా ఎదగవద్దని కుట్రతో రెడ్డి జాగృతివారు హైకోర్టులో, సుప్రీంకోర్టులో పిటిషన్లు వేసి, తమ నోటికాడి ముద్దను లాక్కోవడం అన్యాయమన్నారు. బిసి జెఎసి ఉద్యమం బంద్‌తో ఆగదని, బిసిల హక్కులు సాధన ధ్యేయంగా దూసుకెళ్తున్నదని కృష్ణయ్య స్పష్టంచేశారు. అంతకుముందు బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం బిసి నేతల సంఘీభావ ర్యాలీ జరిగింది. సమావేశంలో బిసి సంఘం నేతలు ఎ.రామకోటి, కొండా దేవయ్య, హరిసింగ్, మోదీ రాందేవ్, రవి యాదవ్, వీరన్న, బాలయ్య, మహేశ్, పుష్పలత, లక్ష్మి , మంజుల తదితరులు హాజరయ్యారు.

## బంధాలు బలహీనపడొద్దు..

### త్వరలోనే ప్రతి జిల్లాకు 'వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాలు'

### 'యువజంటల'కు పరస్పర అవగాహన

### రూ.5 కోట్లతో 33 సెంటర్ల ఏర్పాటుకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు

### ఇదొక సంస్కరణాత్మక ప్రయత్నం : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంధాలు బలహీనపడకుండా వివాహానికి ముందే బంధాల బాధ్యతలను తెలిజేయాలని, తద్వారా ఆ బంధాలు సాధ్యమైనంత విడిపోకుండా చూడాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్ణయించింది. చిన్న చిన్న మనస్పర్థలతో కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుస్తుగానే ఆ వ్యవస్థ విచ్ఛినం కాకుండా చూసేందుకు ఒక ప్రత్యేక ప్రయత్నం చేయాలని ఆ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క నిర్ణయించారు. ఇందులో భాగంగానే రూ.5 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 33 'నూతన వివాహ పూర్వ కౌన్సెలింగ్' కేంద్రాలను ఏర్పాటును ఆమోదించాలని ఆర్థిక శాఖకు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతి పాదనలు పంపింది. ఆర్థిక శాఖ ఆమోదం లభించకగానే కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సఖీ వన్ స్టాప్ సెంటర్లకు ఇటీవల పెరుగుతున్న వివాహ సంబంధ ఫిర్యాదులు ఒక గంభీరమైన సామాజిక వాస్తవాన్ని సూచిస్తున్నాయి. వివాహ బంధంలో భిన్నాభిప్రాయాలు, పరస్పర అవగాహన లోపం, తల్లిదండ్రుల జోక్యం, న్యాయపోరాటాలు, విడాకులు, పిల్లల మానసిక వేదన వంటి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిని మహిళా శిశు సంక్షేమ శాఖ లోతుగా పరిశీలించింది. కాగా పూర్వకాలంలో పెద్దలు, బంధువులు, యువ దంపతులకు వివాహానికి ముందు, ఆ తరువాత కూడా మార్గదర్శకత్వం ఇచ్చేవారు. కానీ ఆధునిక జీవన శైలిలో చిన్న కుటుంబాల పెరుగుదల, పట్టణీకరణ నేపథ్యంలో తరాల మధ్య బంధం బలహీనపడుతోంది. కొన్ని కేసుల్లో తల్లిదండ్రులే వివాహ వివాదాల్లో పక్షాలుగా మారి సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో, దంపతులు వివాహ బంధంలో అడుగుపెట్టే ముందు ఆ బంధం బాధ్యతలను, భావోద్వేగ గాఢతను, పరస్పర గౌరవాన్ని అర్థం చేసుకునేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ అవసరమని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. దీనికి సమర్థమైన పరిష్కారంగా వివాహ పూర్వ కౌన్సెలింగ్ సెంటర్లు (ప్రీ మెరిటీయల్ కౌన్సిలింగ్ సెంటర్స్ (పిఎంసిసి) రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. దీంతో వివాహ పూర్వ కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ సిద్ధం చేసిన దస్త్రంపై మంత్రి సీతక్క శుక్రవారం సంతకం చేశారు.

**యువ జంటలకు పరస్పర అవగాహన**

వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాలు వివాహ బంధానికి సిద్ధమవుతున్న యువ జంటలకు పరస్పర అవగాహన, వివాద పరిష్కారం, భావోద్వేగ అనుకూలత వంటి అంశాలపై శిక్షణ ఇస్తాయి. అలాగే వారికి చట్టపరమైన హక్కులు, లింగస్పందన, కుటుంబ బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయి. ఈ కౌన్సెలింగ్ వల్ల వివాహం ప్రారంభ దశలోనే తలెత్తే విభేదాలు తగ్గి, గృహహింస, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రతి జిల్లాలో కేంద్రం....**

ప్రతి జిల్లాలో ఒక వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ప్రారంభ దశలో ఈ కేంద్రాలను సఖీ లేదా వన్ స్టాప్ సెంటర్లలో ఏర్పాటు చేసి, అవసరమైతే ఆ తరువాత సొంత భవనాలను ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందిన సైకాలజిస్టులు, న్యాయ నిపుణులు, సోషల్ వర్కర్లు, మ్యారేజ్ కౌన్సెలర్లు వంటి నిపుణులను నియమిస్తారు. వివాహ పూర్వ కౌన్సెలింగ్ సేవలను వీరు అందిస్తారు. ఇందుకు వీరికి ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ.30 వేల వేతనం ఇచ్చేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. సిబ్బంది జీతాలు, నిర్వాహణ తదితర అవసరాల కోసం ఏడాదికి రూ. ఐదు కోట్ల వరకు ఖర్చు అవుతున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అంచనా వేసింది.



**సమాజ నిర్మాణానికి దోహదం : మంత్రి సీతక్క**

వివాహన కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా యువ దంపతులు తమ బాధ్యతను, పరస్పర గౌరవం వంటి విలువలను అర్థం చేసుకుని, సుస్థిరమైన కుటుంబ జీవితాన్ని నిర్మిస్తారని, ఇది కేవలం ఒక వివాహ సమస్యల నివారణకు మాత్రమే కాదని, సమాజ నిర్మాణానికి దోహదపడే సంస్కరణాత్మక ప్రయత్నమని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటుతో కుటుంబ విభేదాలు, గృహహింస, విడాకులు గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నదని, యువ దంపతుల భావోద్వేగ, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రతి వివాహం అవగాహనతో, గౌరవంతో, బాధ్యతతో ప్రారంభమయ్యే సమాజాన్ని నిర్మించాలన్నదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని మంత్రి సీతక్క అన్నారు.

**తెలంగాణ ప్రభుత్వం, పంచాయత్‌రాజ్ ఇంజినీరింగ్ విభాగం, జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పెద్దపల్లి.**

టెండర్ నోటీసు నం. T3/04/DPRE/PDPL/2025-26, తేదీ: 14.10.2025

పనుల సంఖ్య (90), మొత్తం అంచనా వ్యయం రూ. 809.75 లక్షలు.
**పనుల పేరు: 1)** సిసి రోడ్ & డ్రెయిన్ పనులు మొదలైనవి, (32 సంఖ్యలు), **అంచనా వ్యయం:** రూ. 301.00 లక్షలు. **2)** భవనాలు మరమ్మతులు & ఇతరాలు (58 సంఖ్యలు), **అంచనా వ్యయం:** రూ. 508.75 లక్షలు. పెద్దపల్లి జిల్లా పనులు టెండర్ షెడ్యూల్ జారీకి దరఖాస్తు చేసుకోవడానికి **చివరి తేదీ** 22.10.2025న టెండర్ జారీ చేయడానికి షెడ్యూల్ చేయబడింది. **టెండర్ల స్వీకరణకు చివరి తేదీ:** 25.10.2025న మధ్యాహ్నం 3.00 గంటల వరకు. **టెండర్ల ప్రారంభం:** 25.10.2025న 3.30 గంటలకు.
సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, పెద్దపల్లి.
DIPR R.O. No. : 9399-PP/CL/ADVT/1/2025-26, Date: 17-10-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మల్కాజ్‌గిరి సర్కిల్-28
NIT No. 40/EE-28/SBZ/GHMC/2025-2026

**పని పేరు:** నిర్వహణ పనులు ఇతరములు-06, **అంచనా మొత్తం:** రూ. 50.50 లక్షలు, **బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం:** 18.10.2025న మ.2.00గం.ల నుండి, 25.10.2025న మ.02.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154796465, 7331189186. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో పంపవచ్చు @ http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 9414-PP/CL/ADVT/1/2025-26, Date: 17-10-2025

**కోదాడ మున్సిపాలిటీ :: సూర్యాపేట జిల్లా.**
ఇమెయిల్ : kodad.mc@gmail.com
నెం. E1/77/MGF/2025-26 'ఇ'-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేదీ: 17.10.2025
కోదాడ మున్సిపాలిటీలో మున్సిపాలిటీ జనరల్ ఫండ్ కింద గ్యాంగ్ మ్యాన్లను నిమగ్నం చేయడం కోసం కింద సంతకం చేసిన వారి ద్వారా 'ఇ'-ప్రొక్యూర్మెంట్ ద్వారా రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది.
పనుల సంఖ్య: 1, అంచనా వ్యయం: రూ. 7.20 లక్షలు:

| | | |
|---|---|---|
| 1) బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ | : | 18.10.2025 సాయంత్రం 04.00 |
| 2) బిడ్ సమర్పణ చివరి తేదీ | : | 22.10.2025 సాయంత్రం 04.00 |
| 3) టెక్నికల్ బిడ్ ప్రారంభ తేదీ | : | 22.10.2025 సాయంత్రం 04.10 |

ఈ సైట్‌ను 18.10.2025 నుండి వెబ్‌లో యాక్సెస్ చేయవచ్చు. పని వివరాలను @ ఇ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు. మరిన్ని వివరాలు మరియు స్పష్టీకరణలను అన్ని పని దినాలలో కార్యాలయ వేళల్లో కోదాడ మున్సిపాలిటీ కమిషనర్ లేదా మున్సిపల్ ఇంజనీర్ నుండి పొందవచ్చు.
**కమిషనర్: 8374450356, ME: 8374450357.**
సం/- కమిషనర్ కోదాడ మున్సిపాలిటీ
DIPR R.O. No. : 9407-PP/CL/ADVT/1/2025-26, Date: 17-10-2025

## వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ఇండ్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం తీసుకవచ్చిందని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరి చేసిన ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని 38వ వార్డులో తాటి కృష్ణవేణి అనే లబ్ధిదారురాలు ఇంటి నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తుందని త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఎస్‌సి సెల్ వైస్ చైర్మన్ చింతమళ్ళ రమేష్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు గండూరి రమేష్, బైరు శైలేందర్, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ పాల్గొన్నారు.



## బంద్‌కు ఎఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/యాదాద్రి** : బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి ఐక్య కార్యాచరణ కమిటీ (బిసి జెఎసి) బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటామని అఖిల భారత యువ జన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు అనంతుల నరసింహ, కంబాల వెంకటేష్, దండేబోయిన సురేష్, మల్లేష్ పాల్గొన్నారు.





## నేడు సాగర్‌లో ఎపి గవర్నర్ పర్యటన

### ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నందికొండ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నేడు నాగార్జునసాగర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ పర్యటన సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ పర్యటన సందర్భంగా శుక్రవారం ఆమె స్థానిక మహాత్మ జ్యోతిబా౹పూలే గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసి న హెలిప్యాడ్ ను పరిశీలించారు. అదేవిధంగా గవర్నర్ నాగార్జున కొండను సందర్శిస్తున్న సందర్భంగా లాంచి స్టేషన్ లోని ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం ఆమె జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎపి గవర్నర్ పర్యటన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు ప్రోటోకాల్ ప్రకారం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. వీరి వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,అదనపు ఎస్ పి రమేష్, పర్యాటకశాఖ అధికారులు, రెవెన్యూ ,పోలీస్, ఫైర్ శాఖల అధికారులు ఉన్నారు.

## ఓటు చోరీపై సంతకాల సేకరణ




**ప్రజాపక్షం/దేవరకొండ:** బిజెపి చేసిన ఓటు చోరీలపై ప్రజలకు అవగాహన కల్పించేలా సంతకాల సేకరణ చేపట్టాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలంలోని కొ౹ర౹తండాలో ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్‌నాయకులు నిర్వహించిన ఓట్ చోర్ సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓట్ చోరీ పద్ధతిలోనే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిందని ప్రజలందరూ బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. ఓటు చోరీపై జరుగుతున్న అవకతవకలు ఓట్ల తొలగింపు మొదలైన అంశాలను స్థానిక ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపిటిసి బిక్కు, జీవన్‌రెడ్డి, రాంసింగ్, లక్ష్మ ణ్, రాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు చోటు ఇవ్వొద్దు

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/అర్వపల్లి** : ధాన్యం కొనుగోలులో రైతులు దళారులకు చోటు ఇవ్వకూడదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం, తిమ్మాపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందన్నారు. దళారుల బారిన పడి నష్టపోకుండా ఉండేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి మద్ధతు ధర ఇస్తుందన్నారు. రైతుల సంతోషమే ప్రభుత్వ సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ గోపి, ఏఓ గణేష్, పిఏసిఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, ఏపిఓ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు సామ అభిషేక్ రెడ్డి, ఇందూర్తి వెంకట్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు వాసుదేవరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై ఉద్యమం



**ప్రజాపక్షం/చింతపల్లి :** విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థి లోకమంతా ఉద్యమించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏఐఎస్‌ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎర్ర రవి పదకొండవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్మారక స్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి విద్యార్థులు హక్కులకోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేశారన్నారు. సమసమాజ స్థాపన కోసం, శాస్త్రీయ విద్యా విధానం కోసం, పాఠశాలలు, హాస్టల్స్ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. రవి ఆశయసాధన కోసం విద్యార్థి లోకం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంశొద్ధిన్, నాయకులు కోటేష్, ఆరెకంటి మురళీ, భవ్య, మనీషా పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు సాధిద్దాం

**ప్రజాపక్షం/మోటకొండూరు** : తెలంగాణా రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం నేటి బంద్‌లో బిసి బిడ్డలు అందరు స్వచ్ఛందంగా పాల్గొనాలని, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన ప్రజాపక్షం విలేకరితో మాట్లాడుతూ బిసి బిడ్డల కోసం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కృతనిశ్చయంతో ఉన్నదని, కేంద్రంలో బిజెపి సర్కార్ వేనుకడుగు వేస్తుందని, కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో బిఆర్‌ఎస్‌లు రెండు ఒకటేనని అన్నారు. నేడు రాష్ట్రంలో జరిగే బంద్‌లో బిసి బిడ్డలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రైతులను దోచుకోవడం ఆగేదెప్పుడు?

### అక్రమాలకు తావులేకుండా ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేనా...!

**రైతుల సంక్షేమం కోసం వారు పండించిన పంటను దళారులకు అమ్ముకొని నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వారి ముగింటే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. కానీ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అధికారులు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులను దోచుకుంటున్న పరిస్థితి. ధాన్యం కొనుగోలు నిర్వాహకుల నుండి మొదలుకొని మిల్లర్ల వరకు రైతులను దోచుకుంటున్నారన్నది అక్షర సత్యం. ఈ దోపిడీపై రైతులు ప్రతి సీజన్‌లో గగ్గోలు పెడుతూ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం మాత్రం శూన్యం. ఈ యాసంగి సీజన్‌లోనైనా కొనుగోలు కేంద్రాలలో అక్రమాలకు తావు లేకుండా జరిగేనా? లేదా? అన్న దానిపై రైతుల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది.**



**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రైతులు 4.82 లక్షల ఎకరాలలో వరి సాగును చేశారు. దీని ద్వారా 10.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు నివేధిక ఇవ్వగా దానికి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 298 కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో ఐకెపి కేంద్రాలు 158, పిఏసిఎస్ 112, మెప్మా 13, ఎఫ్‌పిఓ 15 కేంద్రాలు ఉన్నాయి. ఈ 298 కొనుగోలు కేంద్రాలలో 195 కేంద్రాలు సన్న ధాన్యం, 103 దొడ్డు ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేశారు. రైతులు పండించిన వరి ధాన్యంలో 4.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. వర్షాభావ పరిస్థితులతో పాటు కొనుగోళ్ళలో ఒత్తిడి తగ్గించేందుకు గతం కంటే ముందుగానే అధికారులు ఈ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, ధాన్యం తరలింపుకు వాహనాల ఏర్పాటు చెకచెక చేశారు. జిల్లాలో క్లీన్‌చిట్‌గా ఉన్నా 50 మిల్లర్లకు ధాన్యం కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పర్యవేక్షణలో పౌర సరఫరాల అధికారులు పలుమార్లు చర్చలు జరిపారు. రెండు, మూడు రోజుల్లో మిల్లర్లకు ధాన్యం కేటాయింపు ఓ కొలిక్కి రానున్నదని అధికారులు చెబుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా కొనుగోలు కేంద్రాలలో రైతులను దోచుకోవడం మాత్రం ఆగడం లేదన్నది రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటి నుండి సూర్యాపేట జిల్లాలో రైతులను దోచుకోవడం ఆగడం లేదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు,మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై దోచుకుంటున్నారని రైతులు రోడ్డెక్కిన సందర్భాలు కూడా లేకపోలేదు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకెళ్ళగా తేమ, చెత్త, పెళ్ళ పేరుతో నిర్వాహకులు బస్తాకు 2, 3 కిలోలు కోత పెడుతున్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే తేమ, చెత్త, చెదారం పేరుతో మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా కొర్రీలు పెడుతూ రోజుల తరబడి తమ మిల్లుల వద్దనే రైతులను పడిగాపులు కాయిస్తున్న పరిస్థితులు ప్రతి సీజన్‌లో జరుగుతుంది. వారు పెట్టే ఇబ్బందులు తాళలేక చివరకు రైతులు మిల్లర్ల నిర్ణయానికే వదిలిపెట్టి తెగనమ్ముకుంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రతి సీజన్‌లో రైతులను దోచుకుంటున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లను ఈ సారైనా సంబంధిత అధికారులు కట్టడి చేసి కొనుగోళ్ళు సజావుగా జరిగేలా చూడాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మద్ధతు ధర ఇస్తుందన్నది వాస్తవమేనైనా రైతులు మాత్రం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మి క్వింటాకు రూ.200 నుండి రూ.500 వరకు నష్టపోతున్నారు. ఇదేమని నిర్వాహకులను, మిల్లర్లను ప్రశ్నిస్తే రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి, శుద్ధి చేసి తీసుకరావడం లేదని దీనివల్ల తాము కోతలు పెడుతున్నామని బహిరంగంగా చెబుతున్నారు. వీరి వాదన ఇలా ఉంటే రైతులు మాత్రం తేమ శాతం పేరుతో తమ ధాన్యాన్ని కాంటాలు వేయకుండా ఉంటే రోజుల తరబడి అక్కడే ఆరబెట్టుకొని తేమ శాతం 17 లోపు వచ్చిన తరువాతే కాంటాలు వేస్తున్నారని వాపోతున్నారు. ఇందులో నిర్వాహకులు, మిల్లర్లు చెప్పేది వాస్తవమా లేక రైతులు చెప్పేది వాస్తవమన్నది అధికారులపై తేల్చాల్సిన బాధ్యత ఉంది. గతంలా కాకుండా ఈసారైనా దోపకాన్ని అరికట్టి కొనుగోలు సాజావుగా జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

## 72 గంటల్లో రైతుల ఖాతాలలో డబ్బులు జమ

### రాష్ట్రంలో అత్యధిక ధాన్యం పండించే జిల్లాలలో నల్లగొండకు 2వ స్థానం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి):** రైతులు ధాన్యం అమ్మిన డబ్బుల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదని, 72 గంటల్లో వారి ఖాతాలలో జమ చేస్తామని, ఒకవేళ డబ్బులు జమ కాకుంటే తనకు నేరుగా ఫోన్ చేయవచ్చు అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ధనవంతుల మాదిరిగానే సన్నబియ్యం తినాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పెదలందరికీ రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నదని, అందువల్ల సన్నబియాని ఎక్కువగా పండించాలన్నారు. నిజామాబాద్ జిల్లాలో 75సన్నబియ్యం పండిస్తున్నారని, అందువల్ల నల్లగొండ జిల్లాలో సైతం సన్నబియ్యనికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం అయన తిప్పర్తి మండలం,కంకణాలపల్లి,అంతాయ గూడెం, మామిడాలపల్లి గ్రామాలలో ఐకెపి ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలసి ప్రారంభించారు. అంతేగాక కంకణాలపల్లి లో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.మండల కేంద్రంలో దాన్యాన్ని తరలించే లారీలను జండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మాట్లాడుతూ రైతుల కళ్ళల్లో సంతోషాన్ని చూడడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకే ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు చెల్లించేందుకుగాను రూ. 25వేల కోట్లు క్యాబినెట్ కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోనే జిల్లా అత్యధికంగా ధాన్యం పండించే రెండవ జిల్లాగా నిలిచిందని, అయితే రైతులు సన్న ధాన్యాన్ని ఎక్కువగా పండించాలన్నారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా 6600 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామని,4500 కోట్ల రూపాయలకు ఇటీవలే క్యాబినెట్ అనుమతి తీసుకున్నామన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి జనవరిలో రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లు,గ్రామాల నుండి మండలాలకు సింగిల్ రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ధాన్యం లారీలకు జండా ఊపి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డిఎస్‌ఓ వెంకటేష్,పౌర సరఫరాల డిఎం గోపికృష్ణ ,డి సిఓ పత్యానాయక్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి, పాశం రాంరెడ్డి పాల్గొన్నారు.



## సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి** : సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసి రైతులకు మేలు జరిగేలా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కొనుగోలు జరిగిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన పోచంపల్లి పిఎసిఎస్, రేవణపల్లి, గోసుకొండ గ్రామాలలో మెప్మ ఐకెపి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్థి చేయాలని తెలిపారు. రైతులు వర్షాలకు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకుని కాపాడుకోవాలని కోరారు. గతంలో ఎన్నడు లేని విదంగా అధికారులతో రివ్యూ మీటింగ్‌లు పెట్టి వడ్ల కోనుగోళ్లు వేగవంతం చేయడంలో ప్రభుత్వం ముందుందని అన్నారు. భారతదేశంలోనే ధాన్యం కొనుగోలు తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నదని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడు కూడా రికార్డు స్థాయిలో ఎలాంటి అవకతవకలు లేకుండా ధాన్యం సేకరణ పూర్తి చేసి రైతులకు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వారందరికీ ప్రయోజనం చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కందడి భూపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

# విద్య ద్వారానే సమాజంలో మార్పు



### అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఆకాశమే హద్దుగా కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని చెప్పిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో మహిళ, శిశు, వికలాంగులు, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలిక దినోత్సవం 2025 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటకు కొత్తగా వచ్చినప్పుడు ఆబర్షన్ చేయడం ద్వారా ఒక మహిళ మృతి చెందినట్లు తెలియడంతో తనకు బాధ కలిగిందని చైతన్యవంతమైన జిల్లాలో కూడా ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. సమాజంలో ఉన్న మహిళా సమస్యలను పరిష్కరించేందుకు ఒక వ్యవస్థ రూపంలో ధృఢ సంకల్పంతో ముందుకెళ్ళాలని ఒక నిర్ణయం తీసుకొని బాలికా చైతన్యం పేరిట ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ, విద్యా శాఖల ద్వారా నెలకు 4 వారాలలో ఏదో ఒక వారం సమాజంలో ఉన్న సమస్యలపై, పోషణ, భద్రత, సైబర్ నేరాలు, మహిళా సాధికారత, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్య ద్వారా ఏది తప్పు, ఏది ఒప్పు అనేది తెలుస్తుందని, విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు పొందవచ్చని చెప్పారు. జీవితంలో సామాజికంగా, ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. విద్యార్థులు కలాం స్ఫూర్తితో కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ లింగ వివక్ష సమస్యను మొగ్గ దశలోనే నిర్మూలించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీస్ బృందం వారు మహిళలు, బాలికల రక్షణ, చదువు గొప్పతనంపై పాడిన పాటలను తిలకించారు. ఈ కార్యక్రమంలో డిడబ్లుఓ నరసింహారావు, సిడబ్లుసి చైర్మన్ రమణారావు, డిఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, షీ టీం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నీలిమ, జిసిడిఓ పూలన్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య రీతిలో జిల్లా అధ్యక్షుడి నియమాకం

### ఎఐసిసి పరిశీలకుడు శరత్ రౌత్



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** అఖిలభారత కాంగ్రెస్ పార్టీ నాయకులు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సూచన మేరకు ప్రజాస్వామ్య రీతిలో భారతదేశ వ్యాప్తంగా జిల్లా అధ్యక్షులు నియమాకం ఉంటుందని ఏఐసీసీ పరిశీలికలు ఒరిస్సా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శరత్ రౌత్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ ఆదేశాలతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంపిక సంబంధించి ఏఐసీసీ పరిశీలికలు ఒరిస్సా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శరత్ రౌత్ పిసిసి అబ్జర్వర్ రఘునాథ్ హాజరైయారు. ఈ సమావేశం కార్యక్రమం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐసీసీ పరిశీలికలు శరత్ రౌత్ మాట్లాడుతూ గ్రామస్థాయి కాంగ్రెస్ కార్యకర్త నుండి ప్రజాసంఘాల నుంచి ప్రజల్లో మమేకమైన కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయత పార్టీ పట్ల క్రమశిక్షణగా ఉన్న వ్యక్తులను నియమించడం కోసం ప్రజాస్వామ్య రీతిలో ఈ ఒక్క ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శామ్యూల్, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్టు



**ప్రజాపక్షం/బీబీనగర్** : మండలంలోని కొండమడుగు మోట్టు సర్వీసు రోడ్డు వద్ద స్థానిక పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులపై అనుమానాస్పందంగా విచారించగా వారి వద్ద గంజాయి లభించినట్లు స్థానిక ఎస్‌హెచ్‌ఓ ఎం.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. టిఎస్11టి1817 నెంబర్ గల ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సికింద్రాబాద్ బోడుప్పల్‌కు చెందిన భూక్య ఆజాద్ నాయక్, హయత్ నగర్ కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీకి చెందిన వల్లపు వంశీ, మేకల స్టాలిన్, బుడ్డ సునీల్ అనే నలుగురు వ్యక్తులను విచారించగా ఛత్తీస్‌ఘడ్ నుంచి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి ప్రాంత యువకులకు అమ్ముతున్నట్లుగా వారు తెలిపారు. వారి వద్ద నుండి 1.394 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై చట్టరిత్య కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సిఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. వారి వెంట ఎస్సై రమేష్, అమర్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ అరవింద్ కుమార్, బి.అంజయ్య, పి.శ్రీనివాస్, ఏ.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


## ఉద్యోగ మేళాకు పటిష్ఠ భద్రత



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** : హుజూర్‌నగర్ పట్టణంలో పెరల్ ఇన్ఫినిటి ఇంటర్నేషనల్ ప్రాంగణంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాకు పటిష్ట పోలీస్ భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించే ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ ఉమ్మడి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుండి 20వేల మంది నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. బందోబస్తు విషయంలో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు తీసుకుంటున్నామని చెప్పారు. సింగరేణి గ్యాలరీస్, రాష్ట్ర డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఆథారిటి ఆధ్వర్యంలో 150 కంపెనీలు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని చెప్పారు. దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ చలమందరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐ మోహన్‌బాబు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 21వ వార్డులో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరి చేరవన్నారు. తమ పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు మురుగు కాలువలలో చెత్తా చెదారం పోయవద్దన్నారు. అనంతరం దోమల నివారణ కోసం కాల్వల్లో టెమోఫోస్ మందును పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, ఇన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, టిఎంసి శ్వేత పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## శబరిమల ఆలయ బంగారం కేసు...
# ప్రధాన నిందితుడు అరెస్ట్

**తిరువనంతపురం :** శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారం తాపడం బరువు తగ్గిన ఉదంతంలో కీలక పరిణామం జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త పొట్టిని తన నివాసమైన పులిమత్ నుంచి అదుపులోకి తీసుకున్నట్లు (సిట్) అధికారులు పేర్కొన్నారు. అనంతరం తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలో విచారించారని సిట్ వర్గాలు తెలిపాయి. గురువారం రాత్రి తిరువనంతపురం జనరల్ హాస్పిటల్‌లో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం కోర్టు ముందు ఆయన్ను హాజరుపరచనున్నారు. తదుపరి విచారణ కోసం సిట్ ఆయన్ను కస్టడీకి కోరే అవకాశం ఉంది.ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ఇంజనీర్ కె.సునీల్ కుమార్‌ను, ట్రావెన్‌కోర్ దేవస్థానంబోర్డు అధ్యక్షుడు పిఎస్ ప్రశాంత్ గతంలో సస్పెండ్ చేశారు. కాగా ఈ వివాదంలో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న రిటైర్డ్ అధికారులకు షో కాజ్ నోటీసులు పంపనున్నట్లు తెలిపారు.

## విద్యను విజయసాధనకు మాత్రమే కాకుండా..
# సేవకు కూడా ఉపయోగించుకోండి

పూర్వ విద్యార్థినిగా హిందూ కళాశాల 126 ఏళ్ల వేడుకలలో శ్రీలంక ప్రధాని కీలక ప్రసంగం

కళాశాలలో తన పాత తరగతి గదిని సందర్శించి జ్ఞాపకాలు నెమరేసుకున్న అమరసూరియా

### శ్రీలంక ప్రధానమంత్రి అమరసూరియా ఉద్బోధ



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ప్రఖ్యాత హిందూకళాశాలలో గురువారం ఒక అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ కళాశాల పూర్వ విద్యార్థిని ఒక దేశానికి ప్రధానమంత్రిగా ఉం డి ఒకప్పుడు తాను చదువుకున్న డిగ్రీకళాశాలను ముఖ్యఅతిథిగా సందర్శించింది. 90'ల ప్రారంభంలో భారతదేశంలో సరళీకరణ అనంతర యుగం ప్రారంభమై, స్మార్ట్ ఫోన్‌లు చాలా సంవత్సరాల దూరంలో ఉన్నప్పుడు ఒక యువ శ్రీలంక విద్యార్థిని ఢిల్లీలోని హిందూ కళాశాలకు వచ్చింది. అక్కడ విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకున్న ఆమె కలలు, ఆశలు కొంచెం భయాన్ని కూడా వెంట తీసుకెళ్లింది. ఆ విషయం అంతటితో ముగిస్తే.. .శ్రీలంక దేశానికి ప్రస్తుతం 16వ ప్రధానమంత్రిగా ఉన్నటువంటి హరిణి అమరసూరియా ఒకప్పటి హిందూ కళాశాల పూర్వ విద్యార్థిగా చదువు పూర్తి చేసుకుని స్వదేశానికి వెళ్లింది. ఆమె అక్కడ సామాజికవేత్తగా, విద్యావేత్తగా, ఉద్యమకారిణిగా, రాజకీయనేతగా ఎదిగి శ్రీలంకలో అత్యున్నత హోదాలో ప్రధానమంత్రిపదవిని కైవసం చేసుకుని భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక హిందూ కళాశాలకు గురువారం ఉత్సవ కాన్వాయ్‌లో చేరుకుంది. హిందూ కళాశాల పాలనా యంత్రాంగం దీనిని ఒక అపూర్వ ఘట్టంగా అభివర్ణించింది. విశిష్ట పూర్వ విద్యార్థిగా అమరసూరియా రాక 'అద్భుతమైనరీతిలో స్వదేశానికి తిరిగి రావడం' అని వ్యాఖ్యానించింది. ఢిల్లీ యూనివర్సిటీ కళాశాలలోని విశాలమైన క్యాంపస్‌లో అమరసూర్య రెండు గంటల పాటు గడిపింది. ఆమె తన క్లాస్ రూమ్ నెంబర్ 27 వద్దకు తిరిగి వచ్చి ఒక డెస్క్ వద్ద కూర్చుంది. అక్కడ ఆమె మూడు దశాబ్దాల క్రితం తన జీవితంలోని నిర్మాణాత్మక సంవత్సరాలు గడిపిన మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ ఆనందపరవశురాలైంది. అమరసూరియా1991సంవత్సరం నుండి 1994వరకు ఢిల్లీ హిందూకళాశాలలో సోషియాలజీలో బ్యాచిలర్స్ డిగ్రీని అభ్యసించింది. ఈ సందర్శన అంతటికీ స్వాగతం పలికి ఆమెతోపాటు తోడుగా ఉన్న హిందూ కళాశాల ప్రిన్సిపల్ అంజు శ్రీవాత్సవ హరిణి అమరసూరియా సందర్శన సందర్భంపై వ్యాఖ్యానిస్తూ 126 ఏళ్ల ఘనచరిత్రను కలిగిన హిందూ కళాశాలకు 'ఒక గర్వకారణమైన క్షణం'గా 'ఒక మైలురాయి సందర్భం'గా అభివర్ణించారు. భారత్‌శ్రీలంక రెండు దేశాల మధ్య విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది ఒక పునాదిగా ఉపయోగపడుతుందనిఅనుభూతిచెందారు.పర్యటన తర్వాత కొద్ది సేపటికి 'పిటిఐ'తో ఆమె సంభాషించారు. హిందూ కళాశాల శ్రీలంకతో మార్పిడి కార్యక్రమంతో పాటు పరిశోధనా సహకారాన్ని కోరుతోందని అన్నారు. ఈ సందర్శన సందర్భంగా తాను శ్రీలంక ప్రధానమంత్రి అమరసూరియాతో జరిపిన ఇష్టాగోష్ఠి భేటీలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చిందని హిందూ కళాశాల ప్రిన్సిపల్ అంజు శ్రీవాత్సవ చెప్పారు. 'మేం అమరసూరియాతో ఈ విషయాన్ని మాట్లాడాం. దీనికి సంబంధించిన వివరాలు తర్వాత మాత్రమే వస్తాయి. కానీ మేం ఆమెతో మార్పిడి కార్యక్రమం పరిశోధన కోసం సహకారం రెండింటి విషయమై ఆమెతో కొంత సంభాషణలోకి వెళ్లాం. ఇంతకుముందు కూడా మేం ఆమెకు ఒక ప్రతిపాదన పంపాం. ఆమె దానిని చాలా చాలా తీవ్రంగా పరిగణనలోనికి తీసుకుంటామని భరోసా ఇచ్చారు' అని ప్రిన్సిపల్ శ్రీవాత్సవ 'పిటిఐ'కి వెల్లడించారు. సంగనేరియా ఆడిటోరియం వద్ద విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన తర్వాత, ఎన్‌సిసి క్యాడెట్ల గౌరవవందనం స్వీకరించిన అనంతరం ఆమెకు రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. అమరసూర్య తన పాత తరగతి గదిని సందర్శించి ఉపాధ్యాయులతో, ప్రస్తుత విద్యార్థులతో సంభాషించింది. ఆమె సాధించిన విజయాలకు గుర్తింపుగా అమరసూరియా పేరును సోషియాలజీ విభా గం యొక్క సామాజిక, జాతి శాస్త్ర పరిశోధన ప్రయోగశాలకు అతికించారు. ఆమె దానిని సందర్శించి అక్కడ ఒక ఫలకాన్ని ఆవిష్కరించారు. సోషియాలజీ విభాగంలో తృతీయ సంవత్సరం విద్యార్థిని ఆకృతి కోరి శ్రీలంక ప్రధానమంత్రి హరిణి అమరసూరియాకు తన నలుపు, తెలుపు స్కెచ్ చిత్రపటాన్ని బహుమతిగా ఇచ్చి ఉత్సాహంతో, గర్వంతో పొంగిపోయింది. అమరసూర్య మాట్లాడుతూ 1990లలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్) స్కాలర్‌షిప్ ద్వారా తాను ఢిల్లీకి వచ్చానని, అక్కడ కలలు, అనిశ్చితులు, ఆశలు, ప్రశ్నలు, కొంచెం భయాందోళనలను నావెంట తీసుకెళ్లాను. ఈరోజు నేను అదే గేట్ ద్వారా హిందూ కళాశాలలోకి ప్రవేశించినప్పుడు సొంతదేశ భ్రాంతి, ప్రశంసలతో నేను నిండిపోయాను' అని భావోద్వేగంతో చెప్పారు. హిం దూ కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుత శ్రీలంక ప్రధానమంత్రి అయిన హరిణి అమరసూర్య20 నిమిషాలపాటు విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో తాను విద్యార్థినిగా ఉన్నప్పుడుజైసింగ్ టీ స్టాల్‌ను సందర్శించిన సందర్భాన్ని, అసమానత,స్త్రీవాదం, మానవతావాదం, సినిమాలు, రాజకీయాలు, నాటకరంగంపై కళాశాల పచ్చిక బయళ్లలో ఇతర విద్యార్థులతో జరిగిన లెక్కలేనన్ని సమావేశాలను గుర్తు చేసుకుంటూ, ఆమె హిందూకళాశాలలో పూర్వ విద్యార్థినిగా తన జ్ఞాపకాలను పంచుకున్నారు. 2020లో తాను రాజకీయాలలోకి రావడాన్ని కొందరు ఒక ఎత్తుగడగా అభివర్ణించలేదని, అది విద్యావిస్తరణను వదిలి వేయడం కాదని అన్నారు. ది హిందూ నాలో నాటబడిన విద్యాపరమైన అభిప్రాయాలు నాకు ఎప్పుడూ దూరంగా లేవు అని గర్వంగా చెప్పిన ఆ పూర్వ విద్యార్థినిని ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో ముంచెత్తారు. ఆమె జ్ఞాపకాలను మరింత పెంచేందుకు హిందూ కళాశాల పాలకవర్గం ఆమె కోసం విందు ఏర్పాటు చేసింది.విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులు, ప్రిన్సిపల్, 1990లలో ఆమె విద్యార్థిగా ఉన్నప్పుడు బోధించిన కొం తమంది ఉపాధ్యాయులు, కళాశాల పార్లమెంట్ ప్రధానమంత్రి కూడా పాల్గొన్నారు. 'హిందూ కళాశాలలో విద్య ఒక బహుమతి. కానీ అది ఒక బాధ్యత. దానిని తెలివిగా ఉపయోగించుకోండి. గోడలు కాదు, వంతెనలను నిర్మించడానికి విద్యను ఉపయోగించండి.విభజనలను మరింతగా పెంచడానికి కాకుండావాటిని నయం చేయడానికి విద్యను ఉపయోగించండి. విద్యను విజయం సాధించడానికి మాత్రమే కాకుండా దానిని సేవ చేయడానికి కూడా ఉపయోగించుకోండి' అని ప్రధాని అమరసూరియా ఉద్బోధించారు.

# ఆర్‌ఎస్‌ఎస్‌లో లైంగిక వేధింపులపై దర్యాప్తు

### ఎన్‌హెచ్‌ఆర్‌సికి రాసిన లేఖలో సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ డిమాండ్



**న్యూఢిల్లీ:** కేరళలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త మరణం, ఆ సంస్థలో లైంగిక వేధింపుల ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ శుక్రవారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ వి.రామసుబ్రమణ్యంకు లేఖ రాశారు. ఆనందు అజి మరణానికి దారితీసిన పరిస్థితులను ప్రస్తావించారు. అజి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారని, అయితే ఇక్కడ 'తీవ్రమైన' మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని రాజ్యసభ ఎంపి సందోష్‌కుమార్ ఆ లేఖలో ఆరోపించారు. కమిషన్ పర్యవేక్షణలో 'తక్షణ, స్వతంత్ర, పారదర్శక విచారణ' కు ఆయన డిమాండ్ చేశారు. కొట్టాయం జిల్లాలోని తంపలక్కాడ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అజి అక్టోబరు 9న తంపనూర్‌లోని ఒక లాడ్జిలో చనిపోయాడు. ఒకరోజు తర్వాత అతని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక పోస్ట్ కనిపించింది. అందులో అతను తన మరణానికి ఆర్‌ఎస్‌ఎస్‌ను బాధ్యులుగా పేర్కొన్నాడు. అతని కుటుంబానికి దగ్గరగా ఉన్న వ్యక్తి చిన్నప్పటి నుంచి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపించాడు. అజి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్త. ఆ సంస్థతో చాలాకాలంగాఅనుబంధం ఉన్న కుటుంబానికి చెందినవాడు. 'ఆనందు అజీ మరణం విషాదకరం. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోని అనేక మంది సభ్యులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అజి తన చివరి సోషల్ మీడియా పోస్ట్‌లో చేసిన తీవ్రమైన విషయాలు, జాతీయ మానవ హక్కుల కమిషన్ తక్షణ జోక్యాన్ని కోరుతున్నాయి' అని సిపిఐ ఎంపి పేర్కొన్నారు. 'నిర్దిష్ట ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను పేర్కొంటూ ... ఆర్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో తరచూ జరిగే దుర్వినియోగ ఘటనలను ప్రస్తావిస్తూ బాధితుడు అజి చేసిన బహిరంగ ప్రకటన కేరళ, వెలుపల దిగ్భ్రాంతిని కలిగించింది. అజి పోస్ట్‌లోని విషయాలు కేవలం ఒక వ్యక్తిగత విషాదాన్ని వెల్లడి చేయడమే కాకుండా, సంస్థలోని కొన్ని విభాగాలలో పని చేస్తున్న పెద్ద, వ్యవస్థీకత, లోతుగా దోపిడీ సంస్కతి ఉనికిని సూచిస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఒక ప్రత్యేక దర్యాప్తు బందాన్ని ఏర్పాటు చేయాలని లేదా అజి మృతికి సంబంధించి తక్షణ పరిస్థితులపై, ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆరోపించబడిన లైంగిక దోపిడీ, బలవంతానికి చెందిన విస్తత వ్యవస్థ రెండింటిపై కాలానుగుణంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడానికి తగిన సంస్థను ఆదేశించాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. మరణించిన వ్యక్తి తన పోస్ట్‌లో పేర్కొన్న వ్యక్తులందరినీ దర్యాప్తు పరిధిలోకి తీసుకురావాలని, సాక్షుల రక్షణ, గోప్యత, బాధితులకు మానసిక సహాయం అందించడానికి ప్రతి ప్రయత్నం చేయాలని సంతోశ్ కుమార్ కోరారు. 'విచారణ కేవలం నేరపూరిత నేరాన్ని నిర్ధారించడంపై మాత్రమే దష్టి పెట్టకూడదు. సంస్థ, దాని అనుబంధ నిర్మాణాలలో నేరస్థుల బెదిరింపు, సంస్థాగత రక్షణ క్రమబద్ధమైన నమూనా ఉందా అని కూడా పరిశీలించండి' అని విజ్ఞప్తి చేశారు. ప్రజల పరిశీలనకు మించి తరచుగా పని చేసే అటువంటి సంస్థల పనితీరు, అంతర్గత సంస్కతిపై జాతీయ శ్రద్ధ అవసరమని తీవ్ర బాధ కలిగించే ఈ కేసు నొక్కి చెబుతుందన్నారు. 'ఎన్‌హెచ్‌ఆర్‌సీ ద్వారా నిర్భయమైన, సున్నితమైన విచారణ భారతదేశం మానవ హక్కులు, న్యాయం పట్ల నిబద్ధతకు బలమైన ధ్రువీకరణగా ఉపయోగపడుతుంది. ప్రభావవంతమైన స్థానాల్లో ఉన్నవారు లైంగిక హింస, దోపిడీ చర్యలకు జవాబుదారీతనం నుంచి తప్పించుకోకుండా చూసుకోవాలి' అన్నారు. కమిషన్ వెంటనే గ్రహించి ఆలస్యం లేకుండా స్వతంత్ర విచారణను ప్రారంభించాలని కోరారు.

## విజయ్ పార్టీకి గుర్తింపు లేదు..

చెన్నై: తమిళనాడు నటుడు విజయ్ రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కజగం (టీవీకే)కు గుర్తింపు లేదని ఎన్నికల కమిషన్ (ఇసి) స్పష్టం చేసింది. కరూర్ ర్యాలీ తొక్కిసలాట కేసు విచారణ సందర్భంగా మద్రాసు హైకోర్టుకు ఈ విషయాన్ని తెలియజేసింది. నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా టీవీకే అర్హత సాధించేందుకు అవసరమైన ప్రమాణాలను అందుకోలేదని ఇసి తరుపు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ కోర్టుకు వెల్లడించారు. ఒక రాజకీయ పార్టీ గుర్తింపు పొందాలంటే పోలైన చెల్లుబాటు ఓట్లలో కనీసం ఆరు శాతం ఓట్లు, అసెంబ్లీలో రెండు సీట్లు లేదా లోక్‌సభలో ఒక సీటు సాధించడం వంటి ఇసి నిర్దేశించిన ప్రమాణాలను అందుకోవాలని వివరించారు.

## నగదు, మద్యం, డ్రగ్స్‌పై నివారణ చర్యలు తీసుకోండి

### బిహార్‌లో భద్రతా దళాలకు ఎన్నికల సంఘం విజ్ఞప్తి




**న్యూఢిల్లీ :** బిహార్ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడానికి మాదకద్రవ్యాలు, మద్యం, నగదు ఉపయోగించకుండా చూసుకోవడానికి ముం దస్తు, నివారణ చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, భద్రతా దళాలను కోరిం ది. ఎన్నికలలో నగదు, ఇతర ప్రలోభాల హానికరమైన ప్రభావాలను ఎదుర్కోవడానికి సమగ్ర రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి భద్రతా దళాలతలో సమావేశమైనట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ప్రలోభాల రహిత ఎన్నికల నిర్వహణకు గానూ తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన ప్రతిపాదనల గురించి వివిధ సంస్థలు కమిషన్‌కు వివరించాయి. ఎన్నికలను దెబ్బతీసేందుకు డబ్బు, ఇతర ప్రలోభాల వినియోగాన్ని అరికట్టడానికి సంబంధించిన విస్తృత శ్రేణి అంశాలపై వివరించాయని ఇసి తెలిపింది. సమర్థవంతమైన చర్య కోసం చట్ట అమలు సంస్థల మధ్య ఆర్థిక నేరాల నిఘా సహకారం, భాగస్వామ్యం ఉండాలని కమిషన్ సూచించింది. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ స్థాయిలలో ప్రతి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలో అంతర్గత ఏజెన్సీ సమన్వయాన్ని గుర్తుచేసింది. నకిలీ కరెన్సీ, అంతర్‌రాష్ట్ర సరిహద్దులు, అంతర్జాతీయ సరిహద్దులతో సహా అక్రమ రవాణా వస్తువులు, మాదకద్రవ్యాలు, మద్యం, నగదు రవాణాను తనిఖీ చేయడానికి సంబంధిత ఏజెన్సీలు నియోజకవర్గాలను మ్యాప్ చేయాలని కూడా కమిషన్ ఆదేశించింది. బిహార్‌లో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా 'జీరోటాలరెన్స్' విధానాన్ని నిర్ధారించాలని ఏజెన్సీలను కోరారు. ఎన్నికల సమయంలో ప్రతి చట్ట అమలు సంస్థ ద్వారా చురుకైన, నివారణ చర్యలను నిర్ధారించడం లక్ష్యంగా, అభ్యర్థులు, రాజకీయ పార్టీల రహస్య ఖర్చులను అరికట్టే వ్యూహా న్ని ఇసి చర్చించింది. సమర్థవంతమైన చర్య కోసం చట్ట అమలు సంస్థల మధ్య ఆర్థిక నేరాల నిఘా సహకారం, భాగస్వామ్యాన్ని కూడా ఇది మెరుగుపరిచింది.

## అస్సాం ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడి..

### ముగ్గురు సైనికులకు గాయాలు



**గువహటి :** ఈశాన్య రాష్ట్రం అసోంలో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. తిన్సుకియా జిల్లాలోని కాకోపథర్‌లో గల భారత ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గ్రెనేడ్‌లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ దాడిలో ముగ్గురు సైనికులు గాయపడ్డారు. ఈ దాడి వెనుక యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం–ఇండిపెండెంట్ (ఉల్ఫాఐ) హస్తం ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ దాడితో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది.. గాయపడిన సైనికులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలం చుట్టూ 2 నుంచి 3 కి.మీ మేర పరిధిని మూసివేసి పౌరుల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. దాడికి పాల్పడిన వ్యక్తులు దూమ్‌దూమా దిశ నుండి ట్రక్కులో వచ్చి ఆటోమేటిక్ ఆయుధాలను ఉపయోగించి కాల్పులు జరిపినట్లు గుర్తించారు. అనంతరం వారు అరుణాచల్ ప్రదేశ్ వైపు పారిపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. వారి కోసం భద్రతా సిబ్బంది గాలింపు చేపట్టింది. దాడికి ఉపయోగించినట్లు భావిస్తున్న ఓ ట్రక్కును పొరుగున ఉన్న అరుణాచల్ ప్రదేశ్‌లోని టెంగపాని ప్రాంతంలో దుండగులు విడిచి పెట్టినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఆ ట్రక్‌ను ఫోరెన్సిక్ బృందాలు పరిశీలిస్తున్నాయి. గురువారం అరుణాచల్ ప్రదేశ్‌లోని మన్‌మావ్‌లో అసోం రైఫిల్స్ దళాలపై ఉల్ఫాఐ తిరుగుబాటుదారులు మెరుపుదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆ ఘటన జరిగిన 24 గంటలు కూడా గడవకముందే మరో దాడి జరగడం గమనార్హం.

# సర్వేపై ఇన్ఫోసిస్ మూర్తిలో అపోహలు

### కులగణనతో కేంద్రం చేసే సర్వేపై ఏం సమాధానం చెబుతారు? కర్నాటక సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు:** ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తి, రచయిత్రి సుధా మూర్తి రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక, విద్యా సర్వేపై కొన్ని అపోహలు కలిగి ఉన్నారని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధా రామయ్య అన్నారు. ఇది వెనుకబడిన కులాల కోసం చేస్తున్న సర్వే అనే భావలో ఉన్నారన్నారు. శుక్రవారం సిఎం మీడియాతో మాట్లాడారు. 'ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదు. వారు ఏమి రాయాలనుకుంటున్నారో రాసుకోనివ్వండి. ఈ సర్వే దేని గురించి అని ప్రజలు అర్థం చేసుకోవాలి. వారు అర్థం చేసుకోలేకపోతే నేను ఏమి చేయగలను?' అని ఆయన అన్నారు. మూర్తిలు సర్వేలో పాల్గొనడానికి నిరాకరిచండంతో ముఖ్యమంత్రి స్పందించారు. వారు వెనుకబడిన వర్గాలకు చెందినవారు కాదని ప్రో ఫార్మాపై పేర్కొన్నారు. 'ఇన్ఫోసిస్ (వ్యవస్థాపకుడు) అంటే 'బృహస్పతి' (తెలివిగలవాడు) అని అర్థం కావాలా? ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదు, అందరికీ ఒక సర్వే అని మేము 20 సార్లు చెప్పాము' అని సిద్ధరామయ్య అన్నారు. ప్రభుత్వం 'శక్తి' వంటి సంక్షేమ పథకాలను ప్రారంభించిందని, ఇది ల గ్జరీయేతర ప్రభుత్వ బస్సు ల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలను అందిస్తుంది. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబ పెద్దలకు నెలకు రూ. 2,000 అందించే గృహ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందని ఆయన అన్నారు. శక్తి పథకాన్ని ఉన్నత కులాల మహిళలు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారు ఉపయోగించుకుంటున్నారా? గృహ లక్ష్మి లబ్ధిదారులలో ఉన్నత కులాల వారు లేరా?' అని ఆయన ప్రశ్నించారు. సర్వేపై మంత్రులు పదే పదే వివరణలు ఇస్తున్నప్పటికీ ఈ ప్రక్రియ గురించి ఇప్పటికీ అపోహలు ఉన్నాయని ముఖ్యమంత్రిఅన్నారు. 'ఇప్పుడు కేంద్రం కూడా కుల గణనతో వస్తోంది. అప్పుడు వారు (మూర్తిలు) ఏమి సమాధానం ఇస్తారు? వారికి తప్పుడు సమాచారం అందిందని భావిస్తున్నానన్నారు. ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదని మళ్లీ స్పష్టంగా చెబుతున్నానని, కర్ణాటకలోని ఏడు కోట్ల మంది ప్రజల సామాజిక, ఆర్థిక విద్యా సర్వే అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 'నవంబర్ క్రాం తి'గా పిలువబడే నాయకత్వ మార్పు గురించి ఊహాగానాలపై సిద్ధరామయ్య మాట్లాడుతూ'ఇది క్రాంతి కాదు. క్రాంతి అంటే ఏమిటి? క్రాంతి అంటే విప్లవం. మార్పు విప్లవం కాదు' అని అన్నారు. ప్రభుత్వ భూమి, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కార్యకలాపాలను నిషేధిస్తూ ఇటీవలి కేబినెట్ నిర్ణయాన్ని వివరిస్తూ ఈ చర్య ఒక్క ఆర్‌ఎస్‌ఎస్ గురించే కాదు, ప్రభుత్వ అనుమతి లేకుండా కార్యకలాపాలు నిర్వహించే ఏ సంస్థను అంగీకరించేదిలేదన్నారు. ఈ నియమాన్ని వాస్తవానికి ముఖ్యమంత్రి జగదీష్ షెట్టార్ నేతృత్వంలోని బిజెపి తీసుకువచ్చిందని గుర్తుచేశారు.

# గుజరాత్ క్యాబినేట్ పునర్వ్యవస్థీకరణ





### జడేజా భార్యకు మంత్రిపదవి

**గాంధీనగర్ :** గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ శుక్రవారం తన మంత్రి వర్గాలన్ని పునర్ వ్యవస్థీకరించారు. కొత్తగా 19 మంది ఎమ్మెల్యేను మంత్రులుగా చేర్చుకున్నారు. అంతేకాదు ఇప్పటి వరకు హోం శాఖ సహాయమంత్రిగా ఉన్న హర్ష సంఘవికి ఉపముఖ్యమంత్రి పదవిని అప్పగించారు. దీంతో ఆయన మంత్రి మండలి సంఖ్య 26కి పెరిగింది. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ కొత్త మంత్రులతో పాటు క్యాబినెట్ హోదా పొందిన సహాయ మంత్రులు, ఇండిపెండెంట్ ఛార్జ్ పొందిన మంత్రులతో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు.

### పదవులు ఎవరెవరికి వచ్చాయంటే?

గురువారం 16 మంది మంత్రులు రాజీనామా చేసినప్పటికీ, ఓ ఆరుగురు మంత్రుల రాజీనామాలను ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆమోదించలేదు. వారిలో సూరత్ నగరంలోని మంజూరా అసెంబ్లీ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘవి ఒకరు. ఆయన ఇంతకు ముందు వరకు హోంశాఖ సహాయ మంత్రిగా ఉండగా, తాజాగా ఆయనను డిప్యూటీ సిఎంను చేశారు. గత క్యాబినెట్‌లో ఉన్న మరో ఐదుగురు ఎమ్మెల్యేలను కూడా భూపేంద్ర తన కొత్త మంత్రి మండలిలోకి తీసుకున్నారు. వారిలో కనుభాయ్ పటేల్, రుషికేశ్ పటేల్, కున్వర్జీ బవాలియా గతంలో క్యాబినెట్ మంత్రులుగా ఉండగా, సంఘవి, ప్రఫుల్ పన్షేరియా, పురుషోత్తం సోలంకి సహాయ మంత్రులుగా పనిచేశారు. వీరిలో డిప్యూటీ సిఎంగా పదోన్నతి పొందిన సంఘవి, స్వతంత్ర మంత్రిగా ప్రమోట్ చేయబడిన పన్షేరియా మాత్రమే శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. మరోవైపు కొత్త మంత్రి మండలిలో చేరిన 19 మంది ఎమ్మెల్యేలలో జితు వాఘాని, అర్జున్ మోద్వాడియా, మనీషా వకీల్ ఉన్నారు.

### సర్‌ప్రైజ్ ఎంట్రీ

చాలా ఆశ్చర్యకరంగా, ఈసారి భారత క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజా (34)ను ఈసారి సహాయ మంత్రిగా తీసుకున్నారు. జామ్‌నగర్ ఎమ్మెల్యేగా ఉన్న ఆమె ప్రమాణ స్వీకారానికి భర్త రవీంద్ర జడేజా, కుమార్తె నిధ్యాన హాజరయ్యారు. రవాబా తన తల్లిదండ్రులకు ఏకైక సంతానం. ఆమె రాజ్‌కోట్‌లో ఇంజినీరింగ్ డిగ్రీ చేశారు. ఆమె 2016లో రవీంద్ర జడేజాను వివాహం చేసుకున్నారు.

# 'బిహార్'లో ఇండియా కూటమి భాగస్వాముల మధ్య 'స్నేహపూర్వక' పోటీ

### బచ్వారా అసెంబ్లీ స్థానం నుండి ఎన్నికల బరిలో కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులు

### కాంగ్రెస్ యువజన నేత గరీబ్‌దాస్, సిపిఐ మాజీ ఎమ్మెల్యే అవదేశ్ రాయ్ నామినేషన్‌పత్రాలు దాఖలు




**పాట్నా :** త్వరలో జరగనున్న బిహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సీట్ల సర్దుబాటు విషయం విపక్ష ఇండియా కూటమిలో ప్రతిష్ఠంభనకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండియా కూటమికి చెందిన భాగస్వామ్య పార్టీలు తమ తమ అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపేందుకుసిద్ధమై నామినేషన్లు వేయిస్తుండటంతో బిహార్ అసెంబ్లీ నియోజకవర్గాలలో స్నేహపూర్వక పోటీకే ఎక్కువ అవకాశం కనిపిస్తోంది.బిహార్ రాష్ట్రం బెగుసరాయ్ జిల్లాలోని బచ్వారా అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ, సిపిఐ తమ అభ్యర్థులను బరిలోకి దించాయి. కాంగ్రెస్ పార్టీ బచ్వారా శాసనసభ నియోజకవర్గం నుండి తన అభ్యర్థిగా యువజన విభాగం నాయకుడు ప్రకాశ్ గరీబ్‌దాస్‌తో, సిపిఐ తన మాజీ ఎమ్మెల్యే అవదేశ్ రాయ్‌తో శుక్రవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేయించాయి. కాంగ్రెస్ వర్గాలు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీనాయకత్వం ఆర్‌జెడి, వామపక్షాలు సహా కూటమిభాగస్వాములతోచర్చలుజరుపుతోంది.సిపిఐ అభ్యర్థి బచ్వారా నియోజకవర్గం నుండి తన నామినేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఉంది అని వెల్లడించాయి. గురువారం రాత్రి బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన తన మొదటి జాబితాలో 48మంది అభ్యర్థులను ప్రకటించింది. కుటంబ నియోజకవర్గం నుంచి బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ రామ్‌ను, కాద్వా అసెంబ్లీ స్థానం నుంచి సిఎల్‌పి నాయకుడు షకీల్ అహ్మద్‌ఖాన్‌ను, కొంత మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను కూడా బరిలోకి దించింది. ఆర్‌జెడి సహా 'మహాఘట్‌బంధన్' భాగస్వాములతో సీట్ల షేరింగ్ ఏర్పాట్లు పూర్తికాకముందే కాంగ్రెస్ తన అభ్యర్థులను ప్రకటించింది. బిహార్‌లో మొదటి దశ ఎన్నికలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు తుదిగడువు అక్టోబరు 17 కాగా, రెండవ దశ ఎన్నికలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేసే తుది గడువు అక్టోబరు 20గా ఎన్నికల సం ఘం నిర్ణయించింది. ఇండియా కూటమి వర్గాలు తెలిపిన ప్రకారం...కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిన 61 అసెంబ్లీ స్థానాల కేటాయింపునకు ఆర్‌జెడి ఆ మోదం తెలిపిందని, అయితే కొన్ని కీలకమైన అసెంబ్లీ స్థానాల కోసం చర్చలు జరుగుతున్నాయని వెల్లడించాయి. 'కాంగ్రెస్‌తోపాటు ఇతర మహాఘట్‌బంధన్ నియోజకవర్గాలలో మిగిలిన సీట్ల అభ్యర్థుల జాబితాలను విడుదల చేసిన తర్వాత విషయాలు మరింత స్పష్టంగా తెలుస్తాయి' అని ఇండియా కూటమి వర్గాలు తెలిపాయి.2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మొత్తం 70స్థానాలకు పోటీ చేయగా, కేవలం 19స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 6నుంచి 11వరకు జరుగనున్నాయి. నవంబరు 14న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

### జాలే అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ టికెట్‌పై పోటీచేస్తున్న ఆర్‌జెడి నేత...

మూడేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీని వీడి ఆర్‌జెడిలో చేరిన పూర్వ ఎమ్మెల్యే రిషి మిశ్రాను జాలే అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా శుక్రవారం కాంగ్రెస్ ప్రకటించింది. 48మంది అభ్యర్థులతె కూడిన మొదటి జాబితాను ప్రకటించిన కాంగ్రెస్‌పార్టీ రిషి మిశ్రాకు జాలే అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా చోటు కల్పించింది. మొదటి దశలో 121 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి రిషి మిశ్రా జాలే స్థానం నుంచి తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఇందిరాగాంధీ కేబినెట్‌లోని అత్యంత ప్రభావితం చేయగలిగే మంత్రులలో ఆయన తాత లలిత్ నారాయణ్ మిశ్రా ఒకరు. బిజెపిలో ఉన్న రిషి మిశ్రా కజిన్ నితీశ్ మిశ్రా నితీశ్ కుమార్ ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన జాంజార్‌పూర్ స్థానాన్ని కోరుతున్నారు. కాంగ్రెస్ టికెట్‌పై జాలే అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆర్‌జెడి నాయకుడు రిషి మిత్రాను పోటీలో నిలిపే విషయంలో ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచీ రెండు భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రజాపక్షం
శనివారం, 18 అక్టోబరు

# ‘డిజిటల్’ మోసాలకు కళ్లెం ఏది?

మెరుపువేగంతో పెరుగుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మంచినేకాదు.. చెడును కూడా మోసుకొస్తున్నది. డిజిటల్ యుగంలో మోసాల పర్వం కలవరపెడుతున్నది. ఆన్‌లైన్ అక్రమాలపై సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. కోర్టు ఉత్తర్వులను సైతం మారుస్తూ, ప్రజలను మోసగిస్తున్న సంఘటనలు న్యాయవ్యవస్థలపై నమ్మకాన్ని పునాదులతో పెకళించి వేస్తుందని ఆందోళన వ్యక్తం కావడం కేంద్ర నిఘా వర్గాల వైఫల్యాలకు నిదర్శనం. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ అధికారుల పేరుతో 72 ఏళ్ల ముంబయి వ్యాపారి నుంచి సైబర్ మోసగాళ్లు 58కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. హర్యానా రాష్ట్రం అంబాలా జిల్లాలో వృద్ధ దంపతులను కోర్టు ఆదేశాల పేరుతో డిజిటల్ అరెస్టుచేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. ఈ ఘటనలు పెరుగుతున్న డిజిటల్ మోసాలకు ఉదాహరణలు. దేశంలో ఆన్‌లైన్ మోసాలు గణనీయంగా పెరుగుతున్నాయని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. ప్రతిరోజూ పతాక శీర్షికల్లో వార్తలు వస్తున్నాయి. డిజిటల్ అరెస్టు, నకిలీ ఉత్తర్వుల మోసాలు ఏడాదికాలంలో 12 శాతం పెరగడం భయాందోళనలు రేకెత్తిస్తున్నది. సైబర్ మోసాల్లో 34 శాతం డిజిటల్ అరెస్టులే. బాధితులు అధికంగా వృద్ధులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులే. ప్రజల్లో అవగాహనా రాహిత్యం.. కేంద్ర రక్షణ సంస్థలు, రాష్ట్ర పోలీస్ శాఖల వైఫల్యాలే కేసుల సంఖ్య పెరగడానికి కారణం. భయం.. అత్యాశలు జతకలుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో, వివిధ కేసులను సుమోటోగా తీసుకొని సుప్రీం కోర్టు స్వయంగా విచారణ చేపట్టడం శుభ పరిణామం. దేశవ్యాప్తంగా ఇలాంటి మోసాలపై దృష్టి కేంద్రీకరించడం హర్షణీయం. కానీ, ప్రజల్లో అవగాహన, అప్రమత్తత లేకుంటే ఎన్ని చట్టాలు.. ఇంకెన్ని నిబంధనలు తెచ్చినా ఫలితం శూన్యం. డిజిటల్ అరెస్టు అనే ప్రక్రియ లేనేలేదనే వాస్తవాన్ని చాలామంది ఇంకా గుర్తించకపోవడం విచారకరం. తమను తాము పోలీస్, సిబిఐ, ఇడి, కోర్టు అధికారులుగా పరిచయం చేసుకొని బెదిరిస్తే, బెంబేలు పడాల్సిన అవసరం లేదు. ఆడియో, వీడియో కాల్స్ ద్వారా ఎవరూ చర్య లు తీసుకోలేరు. డబ్బు డిమాండ్ చేసే అధికారం ఎవరికీ లేదు. తెలియని నెంబర్ల నుంచి కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్న సందేశం దేశమంతా ప్రతిధ్వనించినా, ఇప్పటికీ డిజిటల్ మోసాలు జరుగుతునే ఉన్నాయంటే, ప్రజల్లో నిర్లిప్తత ఏ స్థాయిలో ఉందో తెలుస్తున్నది. మరోవైపు నేరస్థులు కొత్తకొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. అనుసరిస్తున్నారు. ఆ వేగం ప్రభుత్వ వ్యవస్థల్లో మృగ్యం. ఆపై అంతులేని నిర్లక్ష్యం. ప్రజల్లో ఉదాశీనత. ‘తిలా పాపం తలా పిడికెడు’ చందాన, ఈ దుస్థితికి అందరూ బాధ్యులే. అసలు డిజిటల్ అరెస్ట్ అనే పదం భారత చట్టాల్లో లేదు. ఎవరైనా వీడియో, ఆడియో కాల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరిస్తే అది నిశ్చయంగా మోసమే. అవాంఛిత కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు లేదా ఎవరైనా అధికారి, న్యాయస్థాన ప్రతినిధి అంటూ మాట్లాడుతున్నప్పుడు వెంటనే అప్రమత్తం కావాలి. ఖచ్చితమైన అధికారిక గుర్తింపు లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించకూడదు. బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఆధార్ కార్డు సమాచారం ఇతరులతో పంచుకోవడం ప్రమాదకరం. మోసాలకు బహిరంగ ఆహ్వానం. ముందు జాగ్రత్తలు లేకుండా, మోసపోయిన తర్వాత వాపోవడం వల్ల ఏం లాభం? డిజిటల్ అరెస్టు అనగానే భయపడి, పదేపదే మోసపోవడం ప్రజల తప్పు. ఆందోళన చెంది, డబ్బు సమర్పించుకోవడం మరో తప్పు. సులభంగా డబ్బు సంపాదించాలనుకోవడం, అడ్డదారులు వెతుక్కోవడం తప్పుమీద తప్పు. ఈ సంక్లిష్ట సమయంలో, సుప్రీం కోర్టు రంగప్రవేశం ఒక ఊరట మాత్రమే. నిఘా వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల్లో అవగాహన పెరగాలి. మోసగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. భయపెడితే వణికిపోవడం... డబ్బు ఆశ చూపిస్తే గుడ్డిగా నమ్మేయడం... ప్రలోభాలకు లొంగిపోవడం మానుకోవాలి. గోప్యతను పాటించాలి. అన్ని వివరాలు సరిచూసుకున్న తర్వాత వ్యక్తిగత సమాచారం అందించాలి. కొద్దిపాటి అప్రమత్తత మోసాల నుంచి కాపాడుతుంది. చైన్ మార్కెటింగ్ నుంచి బెట్టింగ్ యాప్స్ వరకూ... డిజిటల్ అరెస్ట్ నుంచి క్రిప్టో కరెన్సీ వరకూ.. అంతులేకుండా జరుగుతున్న సైబర్ మోసాలకు తెరదించే బాధ్యతను అంతా సమష్టిగా స్వీకరించాలి. ప్రజలు జాగరూకులై ఉండాలి. ప్రభుత్వ వ్యవస్థలు నిఘా పెంచి, దృష్టి పెట్టి, మోసగాళ్ల భరతం పట్టాలి. సైబర్ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. అష్టదిగ్బంధనం చేస్తే తప్ప, డిజిటల్ మోసాలు ఆగవు. ప్రజల సమస్య తీరదు.

# బిసి రిజర్వేషన్లపై పరిష్కారమేది?



సంపతి రమేష్ మహారాజ్
7989579428

ఇటీవల సామాజిక న్యాయంపైన తెలంగాణ రాష్ట్రంలో చర్చ జరుగుతుంది. ఇప్పుడు ఇదీ బిసి రిజర్వేషన్లతో ముడిపడిన అంశమైనది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ క్రమంలో 42 శాతం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును అసెంబ్లీలో తీర్మానించి గవర్నర్ ఆమోదానికి పంపారు. ఇది రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉండడంతో ప్రత్యేకంగా జిఒ తీసుకువచ్చారు. ఈ జిఒను ఇటీవల కొందరు కోర్టులో సవాల్ చేశారు. 42శాతం బిసి రిజర్వేషన్ జిఒ పై హైకోర్టు స్టే విధించింది. మరోవైపు సుప్రీం కోర్టు కొట్టి వేసింది. రాజ్యాంగం కల్పించిన హక్కులు సంపూర్ణంగా దక్కడం లేదని, బిసిల జనాభాకు అనుగుణంగా వారికి రిజర్వేషన్లు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది.

**పొలిటికల్ మైలేజ్ కోసం...** భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే 75 వసంతాలు పూర్తయినప్పటి కీ అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో వెనకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పనలో పార్టీలకు చిత్త శుద్ధి లేదు. ఇటీవల కోర్టులు బిసి రిజర్వేషన్ పై ఆంక్షలు విధించడంతో తెలంగాణలో అక్టోబర్ 18న బిసి రిజర్వేషన్ సాధనకు బిసి సంఘాల ఐక్య కార్యకరణ సమితి ఆధ్వర్యంలో బంద్ ప్రకటించారు. దీనికి మూడు ప్రధాన రాజకీయ పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ బంద్‌కు మద్దతు పలికాయి. బిసిలకు రిజర్వేషన్ విషయంలో పార్టీల బంద్ ఎవరిపైన? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**శాస్త్రీయ పరిష్కారం కోసం ఉద్యమం...** 1980 సంవత్సరంలో మండల్ కమిషన్ ఒబిసి లకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. వీటి అమలుకై ఢిల్లీ బోట్స్ క్లబ్ ముందు 48 రోజుల ధర్నా చేశాడు. కాన్సిరాం బిసి రిజర్వేషన్ ఉద్యమం దేశంలో విజయవంతమైనది. ఈ క్రమంలో ఉమ్మడి ఎపి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బాల రాజుగౌడ్ బిసి ఎస్సీ ఎస్టీ జెఎసి రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజు నాయకత్వంలో బిసి రిజర్వేషన్ల సాధన సమితి ఏర్పాటు అయ్యింది. ఈ సమితి బిసి కేటగిరీల కు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, తమిళనాడు తరహాలో వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తుంది. తెలంగాణలోని ఇతర బిసి సంఘాలు వీరికి తోడైతే బిసిలకు సామాజిక న్యాయం దక్కుతుంది.

(బిసి రిజర్వేషన్లకు మద్దతుగా నేడు తెలంగాణ బంద్)

## శాంతియుత ప్రపంచం కోసం

# అణ్వాయుధాలను నిర్మూలించాలి

### నాగసాకిలో జరిగిన అంతర్జాతీయ వైద్యుల ప్రపంచ మహాసభ డిక్లరేషన్



డాక్టర్ రజని,
ఐడిపిడి జాతీయ ఉపాధ్యక్షురాలు

అణ్వాయుధాల నిర్మూలనకు అంతర్జాతీయ ఫిజీషియన్స్ (ఐపిపిఎన్‌డబ్ల్యు– ఇంటర్‌నేషనల్ ఫిజీషిన్స్ ఫర్ ప్రివెంటింగ్ న్యూక్లియర్ వెపన్స్) సంస్థ వరల్డ్ కాంగ్రెస్ జపాన్ దేశంలోని నాగాసాకిలో అక్టోబర్ 1 నుండి 5వ తేదీ వరకు జరిగింది. ఈ సదస్సుకు ఐపిపిఎన్‌డబ్ల్యుకు అనుబంధ సంస్థ ఐడిపిడి (ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్) తరఫున భారతదేశంలోని ఏడు రాష్ట్రాల నుంచి 24 మంది డాక్టర్లు హాజరు అయ్యారు. ఐడిపిడి అధ్యక్షులు డాక్టర్ అరుణ్ మిత్ర, ప్రధాన కార్యదర్శి డాక్టర్ షకీల్ ఉర్ రెహమాన్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.రజని, ప్రొఫెసర్ డాక్టర్. మాధవి,ఎం.డి.మహబూబ్‌నగర్ వైద్య కళాశాల, డాక్టర్ సమంత రోషిణి, ఎం.డి.అనాటమి సిద్ధిపేట వైద్య కళాశాల, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, అయిప్సో నాయకులు డాక్టర్ దిడ్డి సుధాకర్ , శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో అనేక వర్క్‌షాపులు జరిగాయి. దక్షిణాసియా నుండి ఐడిపిడి చొరవతో ‘క్వెస్ట్ ఫర్ పీస్ ఇన్ సౌత్ ఏసియా (దక్షిణాసియాలో శాంతి శోధన)’ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించాము. శ్రీలంక, నేపాల్, ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి ప్రతినిధులు హాజరుకాలేకపోయా రు. ఈ సదస్సులో దక్షిణాసియాలో జరుగుతున్న అలజడులు, పరిణామాలు,అణ్వాయుధాలను యుద్ధంలో ఉపయోగించకుండా నివారించడానికి చర్యలు, ప్రజారోగ్యం ప్రాముఖ్యత, దేశాల మధ్య సత్సంబంధాలు గురించి చర్చించడంతో పాటు శాంతి కాముకులు అందరూ కలసి పనిచేయాలని, నేపాల్ లుంబినిలో దక్షిణాసియా సదస్సు నిర్వహించాలని నిర్ణయించబడింది. ఐపిపిఎన్‌డబ్ల్యు లో నాగసాకి డిక్లరేషన్ పేరుతో తీర్మానం చేశారు. అణ్వాయుధాలను రద్దు చేయడానికి, యుద్ధాన్ని నివారించడానికి అంతర్జాతీయ వైద్య ఉద్యమం, అభిప్రాయం అంశాలను అందులో పేర్కొన్నారు.

**ఐపిపిఎన్‌డబ్ల్యు ప్రపంచ కాంగ్రెస్ ప్రకటించిన నాగసాకి డిక్లరేషన్**

హిబాకుషాను స్మరించుకోవడానికి వైద్యులు, వైద్య విద్యార్థులు, కార్యకర్తలుగా మేము నాగసాకిలో సమావేశమయ్యాము. హిబాకుషా, హిరోషిమాల్లో అమెరికా అణు బాంబు దాడుల బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారిని, ఆ భయంకరమైన సంఘటనల తర్వాత 80 సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన 2,000 కంటే ఎక్కువ అణు పరీక్షల నుండి బయటపడిన వారిని ఈ సందర్భంగా స్మరించుకున్నాము. 2024 నోబెల్ శాంతి బహుమతి గ్రహీతలైన హిబాకుషా, నిహన్ హిడాంక్యోలను అణ్వాయుధాల నిర్మూలనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసినందుకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాము. ఈ కాంగ్రెస్‌లో వారి ఉనికి మాకు గౌరవంగా ఉంది. వారి ఉదాహరణ మన ముందు ఉంచి, అణ్వాయుధాలు లేని ప్రపంచాన్ని సాధించడానికి మేము మళ్ళీ కట్టుబడి ఉన్నాము.

ఐపిపిఎన్‌డబ్ల్యు చివరిసారిగా జపాన్‌లో 2012లో హిరోషిమాలో సమావేశమైన తరువాత ఐపిపిఎన్‌డబ్ల్యు త ఆస్ట్రేలియన్ అనుబంధ సంస్థ అయిన మెడికల్ అసోసియేషన్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ వార్‌తో కలిసి స్థాపించిన ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ టు అబాలిష్ న్యూక్లియర్ వెపన్స్ (ఐసిఎఎన్–ఐకెన్) ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించబడింది. ఐసిఎఎన్ నేతృత్వంలో అణ్వాయుధాలను నిషేధించే ఒప్పందం కోసం ఒత్తిడి ఇప్పుడే ప్రారంభమైంది. దీర్ఘకాలంగా వాగ్దానం చేయబడిన నిరాయుధీకరణను కొనసాగించడంలో నిరంతర వైఫల్యం నేపథ్యంలో, అణుయుద్ధం విపత్కర పరిణామాల గురించి వైద్య, పర్యావరణ, మానవతా ఆధారాలు చాలా బలంగా, తిరస్కరించలేనివిగా ఉన్నాయి. అణ్వాయుధాల సంపూర్ణ నిషేధ ఒప్పందం (టిపిఎన్‌డబ్ల్యు) కేవలం ఐదు సంవత్సరాలలో చర్చలు జరిపి ఆమోదించబడింది. ఇప్పటి వరకు 95 దేశాలు సంతకాలు చేశాయి. వాటిలో 74 సభ్య దేశాలు సహా మొదట సంతకం చేయకుండా అంగీకరించిన నాలుగు దేశాలూ ఉన్నాయి. ఆ విధంగా మొత్తం 99 దేశాలు — ప్రపంచవ్యాప్తంగా మెజారిటీ ఇప్పుడు ఒప్పందంలో చేరడానికి చట్టపరమైన చర్య తీసుకున్నాయి. దాని ఘనతకు మూడు విజయవంతమైన సమావేశాలు , 2026 కోసం ఒక సమీక్షా సమావేశం ప్రణాళికతో, ఈ ఒప్పందం అణ్వాయుధ రహిత ప్రపంచానికి స్పష్టమైన మార్గంగా స్థిరపడింది.

ఆరోగ్యం, మానవతావాద, పర్యావరణంపై అణు యుద్ధ ప్రభావాలపై 21వ శతాబ్దపు సమగ్ర నివేదికలను రూపొందించడానికి ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ తీసుకుంటున్న సానుకూల చర్యలను మేము అభినందిస్తున్నాము. ఐపిపిఎన్‌డబ్ల్యు , ప్రపంచ వైద్య సంఘం, అంతర్జాతీయ నర్సుల మండలి, ప్రపంచ ప్రజారోగ్య సంఘాల సమాఖ్యతో సహా ప్రధాన ఆరోగ్య సంస్థల మధ్య చురుకైన సహకారం లేకుండా డబ్ల్యుహెచ్ఒ కొత్త పని జరిగేది కాదు. ఈ ప్రపంచ ఆరోగ్య నాయకులు అణ్వాయుధాల నిర్మూలనను వారి పనికి ప్రాధాన్యతగా చేసుకున్నందుకు మేము కృతజ్ఞులం.

అయితే, విచారకరమైన విషయమేమిటంటే, అణ్వాయుధ దేశాలన్నీ టిపిఎన్‌డబ్ల్యు వాగ్దానాన్ని స్వీకరించడంలో విఫలమవడమే కాకుండా, దానికి వ్యతిరేక మార్గాన్ని తీసుకున్నాయి. అణ్వాయుధాలను పరిమితం చేస్తూ కష్టపడి సాధించిన ఒప్పందాలను రద్దు చేయడం, నిర్లక్ష్య ప్రపంచ ఆయుధ పోటీని ప్రారంభించడం; మధ్య ప్రాచ్యం, యూరప్ , ఆసియాలో పెరుగుతున్న యుద్ధాలలో అణ్వాయుధాల వినియోగిస్తామని బెదిరింపులు; ఇవన్నీ ఆయుధ నియంత్రణ, నిరాయుధీకరణ ప్రయత్నాలను వదిలివేయడం తప్ప ఇంకొకటి కాదు. ఐకెన్ నివేదించినట్లుగా, అణ్వాయుధాలపై ప్రపంచ వ్యయం 2024లో 100 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇది ప్రతి సంవత్సరం పెరుగుతూ పోతోంది. రష్యా–ఉక్రెయిన్ సాయుధ సంఘర్షణ సమయంలో రష్యా, అమెరికా,నాటో నాయకులు అణ్వాయుధాలను ఉపయోగించాలని బెదిరింపులకు పాల్పడ్డాయి. భారతదేశం, పాకిస్తాన్ మధ్య , ఉత్తర కొరియా, దాని పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తత పెరిగిన కాలంలో ఇలాంటి ఉద్రిక్తత హెచ్చరికలు ఇప్పుడు సాధారణంగా వినిపిస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో ఇజ్రాయెల్,అమెరికాలు కలిసి ఇరాన్‌లోని అణు కేంద్రాలపై బాంబు దాడి చేశాయి. ఇజ్రాయెల్ కు డిమోనా అణ్వాయుధ ఉత్పత్తి స్థలంలో కొత్త నిర్మాణాలు జరుగుతున్నపుడు, ఇది ప్రాంతీయ అస్థిరతను మరింత తీవ్రతరం చేస్తుంది. అణ్వాయుధ విస్తరణ సంభావ్యతను పెంచుతుంది. అణ్వాయుధాలను సంపాదించే అవకాశాన్ని అనేక దేశాలు బహిరంగంగా ప్రకటిస్తున్నప్పటికీ, 2010 నుండి జరిగిన అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం యొక్క ప్రతి సమావేశం విఫలమైంది. దౌత్యం, అంతర్జాతీయ చట్ట సంస్థలు దిగజారిపోతున్నాయి, దూకుడు నిరంకుశత్వం, లావాదేవీ రాజకీయాల ద్వారా భర్తీ చేయబడ్డాయి. అమెరికా, రష్యా మధ్య మిగిలి ఉన్న చివరి అణ్వాయుధ ఒప్పందం అయిన కొత్త స్టార్ట్ ఫిబ్రవరి 2026లో ముగుస్తుంది. ఒప్పందం యొక్క పరిమితులను ఒక సంవత్సరం పాటు పొడిగించాలనే రష్యా ప్రతిపాదనను అమెరికా వెంటనే అంగీకరించాలి. రెండు దేశాలూ నిరాయుధీకరణ కోసం తక్షణమే చర్చలు జరపాలి.




అణ్వాయుధాలను కలిగి ఉన్న అన్ని దేశాలు తమ ఆయుధశాలల ప్రమాదకరమైన విస్తరణను, అలాగే నిరోధం ముసుగులో అణు యుద్ధానికి సన్నాహాలు చేయడాన్ని ఆపాలని మేము పిలుపునిస్తున్నాము. అణు యుద్ధం యొక్క వినాశకరమైన మానవతా పరిణామాలు, మానవాళిని నిర్మూలించగల ఏకైక ఆయుధాలను తొలగించే వారి చట్టపరమైన , నైతిక బాధ్యతపై వారు చివరకు చర్య తీసుకోవాలి. ఒప్పందంలో చేరడం, క్రమబద్ధమైన, ధృవీకరించదగిన అణ్వాయుధ నిరాయుధీకరణ ప్రక్రియను చేపట్టడం, పూర్తి చేయడంపై దృష్టి సారించి టిపిఎన్‌డబ్ల్యు సభ్య దేశాలతో కలిసి పనిచేయాలని మేము వారిని కోరుతున్నాము.

21వ శతాబ్దంలో యుద్ధం యొక్క వినాశకరమైన ప్రభావాన్ని మనం విస్మరించలేము. నేడు మరణించిన వారిలో అత్యధికులు మహిళలు, పిల్లలు. వీరిలో ఆరోగ్య, మానవతా సహాయ కార్మికులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు ఉన్నారు. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి పారిపోవాల్సి వచ్చింది. భయంకరమైన మానవ హక్కుల ఉల్లంఘనలను అనుభవించారు. విస్తృతమైన ఆకలి, కరువును ఎదుర్కొన్నారు. ఉక్రెయిన్, గాజాలలో అణ్వాయుధ ఆయుధాలు కలిగిన దేశాలు ఇప్పటికే వినాశకరమైన యుద్ధాలను ఎదుర్కొంటున్నాయి, ఇవి విస్తృత ప్రాంతీయ యుద్ధాలు, అణు ఉద్ధరణ ముప్పును పెంచుతున్నాయి. రెండు యుద్ధాలలో శత్రుత్వాలను వెంటనే నిలిపివేయాలని, మరింత ప్రాణనష్టాన్ని నివారించడానికి సంభాషణలో సాధ్యమయ్యే అన్ని ప్రయత్నాల కోసం మేము మా పిలుపులను పునరుద్ఘాటిస్తున్నాము. టిగ్రే, డార్ఫర్, సూడాన్, దక్షిణ సూడాన్, కాంగో మరియు యుద్ధంతో నాశనమైన ఇతర ప్రాంతాలలో జరుగుతున్న యుద్ధాలను వెంటనే ముగించడానికి ప్రపంచ సమాజం కృషి చేయాలని కూడా మేము పిలుపునిస్తున్నాము. ఈ యుద్ధాలన్నింటిలోనూ, ఆరోగ్య సంరక్షణ కార్మికులు మరియు సౌకర్యాల రక్షణను నిర్ధారించడానికి అత్యవసరంగా అవసరమైన మానవతా సహాయానికి అన్ని అడ్డంకులను తొలగించడం ద్వారా అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా శాశ్వత శాంతికి మార్గం సుగమం చేయాలని మేము పిలుపునిస్తున్నాము. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ప్రాంతాలలోని ప్రజలందరి ఆరోగ్యం, భద్రత, ప్రాథమిక మానవ హక్కులకు హామీ ఇవ్వాలి.

జపాన్‌లో సమావేశమైన మేము, ఫుకుషిమా దైచి అణు విద్యుత్ ప్లాంట్ విపత్తు తర్వాత కొనసాగుతున్న ప్రజారోగ్యం, భద్రతా సమస్యలు, అవసరాలపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత మాకు ఉంది. ఫుకుషిమా అణు విపత్తు గాలి, భూమి, జలాలు, సముద్ర వాతావరణంలోకి పెద్ద మొత్తంలో రేడియోధార్మికత విడుదల కావడానికి కలుషితమైన నేల, నీరు పెద్ద మొత్తంలో పేరుకుపోవడానికి కారణమైంది. రాబోయే తరాల వారితో సహా జపాన్ లోపల, వెలుపల ఉన్న ప్రజలకు నివారించదగిన రేడియేషన్ వెలువడడాన్ని తగ్గించడం అనేది అధిక, నిరంతర ప్రజారోగ్య ప్రాధాన్యత. కలుషిత ప్రాంతాలను నిర్వహించడంలో ఉన్న ఇబ్బందులను అంగీకరిస్తూనే, జపాన్ అధికారులు ప్రజలకు రేడియేషన్ బహిర్గతం కోసం పరిమితులను పెంచారు. ఇప్పటికీ తగ్గించలేదు, నిరాశ్రయులైన నివాసితులను తిరిగి తెరిచిన మినహాయింపు మండలాలకు తిరిగి రావాలని ఒత్తిడి చేశారు. ఇవి ఎక్కువగా కలుషితం గా ఉన్నాయి. కొనసాగుతున్న ఆరోగ్య అవసరాలను, రియాక్టర్ కేంద్రంలో కొనసాగుతున్న ప్రమాదకరమైన పరిస్థితులను తగినంతగా పరిష్కరించడం లేదు. ఫుకుషిమా, చెర్నోబిల్ పాఠాలు నేర్చుకున్నామని, అలాంటి విపత్తులు పునరావృతం కాదనే భావన కోరికతో కూడిన ఆలోచన కంటే దారుణంగా ఉంది. ఉక్రెయిన్, ఇరాన్‌లలో మనం చూసినట్లుగా, సాయుధ యుద్ధాల సమయంలో అణు విద్యుత్ ప్లాంట్లు, ఇతర అణు సౌకర్యాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా సమస్య మరింత జటిలం అవుతుంది. జపాన్, ఈశాన్య ఆసియాలోని ఇతర ప్రాంతాలలో ఉన్న అనేక అణు విద్యుత్ ప్లాంట్లు, ఖర్చు చేసిన ఇంధన చెరువులు, ఇతర అణు సౌకర్యాలు ఫుకుషిమాలో జరిగినట్లుగా, ప్రత్యక్ష దాడి, విద్యుత్ సరఫరా, శీతలీకరణ నీటి అంతరాయం రెండింటికీ గురయ్యే అవకాశం ఉంది. వాతావరణ సంక్షోభం యొక్క చెత్త ప్రభావాలను నివారించడానికి, తదుపరి అణు రియాక్టర్ విపత్తును నివారించడానికి, అణు విస్తరణ ప్రమాదాన్ని పరిష్కరించడానికి పునరుత్పాదక, అణుయేతర ఇంధన ఉత్పత్తికి వేగవంతమైన మార్పు అవసరం.

అణచివేయలేని యుద్ధాలు, అణ్వాయుధాలతో సహా ప్రపంచ సైనిక వ్యయంలో భారీ పెరుగుదల, కృత్రిమ మేధస్సు యొక్క వేగవంతమైన, క్రమబద్ధీకరించని అభివృద్ధి, అణు కమాండ్, నియంత్రణ వ్యవస్థలకు దాని సంభావ్య అనువర్తనం, నిరంకుశత్వం వైపు కలత పెట్టే ధోరణి, ముఖ్యంగా ఒకప్పుడు ప్రజాస్వామ్య దేశాలుగా ఉన్న దేశాలలో, ఇవన్నీ అణు యుద్ధం, వాతావరణ సంక్షోభం యొక్క జంట అస్తిత్వ ముప్పులను సహకారంతో పరిష్కరించడం మరింత కష్టతరం చేశాయి. ఈ క్లిష్ట పరిస్థితులలో ఆశకు ఆధారం ఉంటే, ఐపిపిఎన్‌డబ్ల్యు విద్యార్థి ఉద్యమానికి పునరుజ్జీవనం, ఐకెన్ యువత ఆధారిత ప్రచారంలో మనం దానిని కనుగొంటాము.

ఐపిపిఎన్‌డబ్ల్యు విద్యార్థి నాయకులు ఈ సమస్యలలోని లోపాలను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేస్తున్నారు, కీలకమైన టిపిఎన్ డబ్ల్యు, ఎన్‌పిటి సమావేశాలలో మాత్రమే కాకుండా, కాప్ 29, ఇతర వాతావరణ సమావేశాలలో కూడా సమాఖ్యకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అణ్వాయుధాల రద్దు, వాతావరణాన్ని రక్షించడం, యుద్ధాన్ని ముగించడం, ప్రపంచ న్యాయం, మానవ హక్కుల కోసం వాదించడం అన్నీ మన ఆరోగ్యం, మనుగడకు చాలా ముఖ్యమైనవని వారు సమర్థవంతంగా సందేశాన్ని అందిస్తున్నారు. ప్రస్తుత, మునుపటి తరాల ఐపిపిఎన్‌డబ్ల్యు నాయకులు వారికి జ్యోతిని అందజేయడం గర్వంగా ఉంది.

80 సంవత్సరాల క్రితం హిరోషిమా, నాగసాకిపై అమెరికా చేసిన అణు బాంబు దాడులు అణు యుగంలో మన ప్రపంచ దుర్బలత్వాన్ని బయటపెట్టాయి. 1945 నుండి అణ్వాయుధాల వాడకంపై నిషేధం ఇప్పుడు క్షీణిస్తోంది. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ మాటలను మేము ప్రతిధ్వనిస్తున్నాము. ‘‘మానవత్వం కేవలం ఒక అపార్థం, అణు వినాశనానికి దూరంగా ఉన్న ఒక తప్పుడు లెక్క’’. వైద్యులుగా, మనం నయం చేయలేని వాటిని నిరోధించాలని, అణు యుద్ధం అనేది కోలుకోలేని విపత్తు అని మేము అర్థం చేసుకున్నాము. మరింత శాంతియుత ప్రపంచం కోసం చర్య తీసుకోవాలని, అణ్వాయుధాల నిర్మూలనకు అవసరమైన అణు యుద్ధాన్ని నివారించాలని పిలుపునిస్తూ నాగసాకిలోని హిబాకుషా వారి గొంతులతో మేము మా గొంతులను కలుపుతాము.

# ఉపాధ్యాయుల మెడపై సాంకేతిక కత్తి!




వెంకగారి భూమయ్య
9848559863

తెలంగాణ విద్యా బోధన వ్యవస్థ ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటోంది. రాష్ట్ర విద్యాశాఖలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని పాలనాపరమైన లోపాల నుంచి ఇటీవల తీసుకొచ్చిన సాంకేతిక నిబంధనల వల్ల ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఈ పరిస్థితి ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ఈ విశ్లేషణ స్పష్టం చేస్తోంది. విద్యావ్యవస్థకు పట్టిన పెద్ద శాపం ఉమ్మడి సేవా నియమావళి పెండింగ్ అని చెప్పకతప్పదు. అది పరిష్కారం అయితే జిల్లా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, జూనియర్ అధ్యాపకులు వంటి అన్ని రకాల పదోన్నతులు, పర్యవేక్షణ పదవులు భర్తీ అవుతాయి. కానీ ప్రభుత్వం ఆ సమస్య మీద చిత్తశుద్ధి చూపక, ఆయా పదవుల తాలూకు బడ్జెట్ మిగులుతుందని సంబరపడుతుంది. తాత్కాలిక బాధ్యతలు (నిర్వాహక బాధ్యతలు) పెట్టుకోవడానికే ఏండ్ల సమయం పట్టింది. దానికి తోడు పెద్ద బడుల్లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను పర్యవేక్షణ పేరిట నోడల్ అధికారి, సమూహ అధికారి అంటూ తాత్కాలిక నియామకాలపై తరలిస్తూ, వారి అసలు పని చేయకుండా, వ్యవస్థను పాడు చేస్తున్నారు (డిస్టర్బ్ చేస్తున్నారు).

**సాంకేతికత భారంగా.. ముఖ హాజరు ఒత్తిడిగా?**

విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు విధానం ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో బోధనకు పెద్ద అవరోధంగా తయారైంది. మెజారిటీగా ఇద్దరు ఉపాధ్యాయులతో నడుస్తున్న పాఠశాలల్లో ఈ ముఖ హాజరు తీసుకుంటున్న సమయం రోజు ప్రారంభానికి చెదుశకునంగా మారింది. సరిగా అంతర్జాల సంకేతాలు లేని ప్రదేశాలు, విద్యార్థుల ముఖాలను గుర్తించలేని సమస్యలు, సమూహ నమోదులో ఉండే అవకతవకలు హాజరుకు అధిక సమయం తీసుకుంటున్నాయి. అప్పుడే ఉత్సాహంగా బడికి వెళ్ళిన గురువుకు ఈ సాంకేతిక పద్ధతి, ఆపై చేతిరాత హాజరు, మధ్యాహ్న భోజనం నమోదు, బడికి రాని పిల్లల ఇండ్ల కు చరవాణి పిలుపులు (ఫోన్ కాల్స్) అంతా అయ్యేసరికి గురువుల ఉత్సాహం హరీ అంటుం ది. హాజరు లేని పిల్లలను తదుపరి తరగతికి పంపకుండా ఉండే విధానం మన దగ్గర లేదు. పోనీ హాజరు శాతం తక్కువ ఉన్న పిల్లలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వ్యవస్థ లేదు. ముఖ హాజరు తీసుకుంటున్నా, దాన్ని తుది ప్రామాణికంగా తీసుకునే అవకాశం లేదు. మళ్ళీ నమోదు పుస్తకం (రిజిష్టర్) హాజరే తుది నిర్ణయానికి ఆధారమవుతుంది. పాఠశాలల్లో సమాచారం ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలుస్తూ ఉండాలి. కానీ దానికోసం ప్రతిరోజు నివేదికలు అవసరం లేదు. చివరకు మధ్యాహ్న భోజనం వివరాలు కూడా రోజు తెలియజేయాల్సిన అవసరం లేదు. నెలాఖరున పంపే నెలవారీ నివేదికలు ప్రామాణికంగా ఉండాలి.



**పరిశోధన అవసరం– పెరిగిన ఒత్తిడి**

ఈ అంతులేని ఒత్తిడి కారణంగా గురువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. గత విద్యా సంవత్సరం ప్రారంభం నుండి అనేక ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అనేకమంది గుండెపోటుతో మరణించిన అంశాలను పరిశోధించి ఒక సర్వే చేపట్టాలి. మానసిక నిపుణుల సంఘం వేసి ఏ విధానాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి తెలుసుకోవాలి. ఉదయం 9 నుండి సుమారు 11 వరకు బడి, మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు యంత్రాంగం అంతా ఈ అనవసర నివేదికల వివరాల మీద కేంద్రీకృతమై చరవాణి పిలుపులు, సందేశాలతో ఒక సాంకేతిక క్రీడ నడుస్తున్నది. పెద్ద బడుల్లో గణన యంత్రాలు (కంప్యూటర్లు), చిన్న బడిలో సుమారు 27,000 రూపాయల విలువ చేసే ట్యాబ్‌ల ను ఉపాధ్యాయులకు అందించారు. అయితే, ఆ సామగ్రి వినియోగం, నిర్వహణ పరంగా ఎదురవుతున్న సమస్యలపై తగిన సమీక్ష జరగలేదు. ఈ ట్యాబ్‌ల నిర్వహణ, అంతర్జాల వినియోగం కోసం నెలవారీ డబ్బు ఖర్చు అవుతున్నా, అవి నాణ్యమైన బోధనకు ఎంతవరకు తోడ్పడుతున్నాయి అని లెక్కలు తేలలేదు. తరచుగా అంతర్జాల సంకేతాలు లేకపోవడం, విద్యార్థులను గుర్తించడంలో లోపాలు వంటి సాంకేతిక సమస్యల కారణంగా ఈ ట్యాబ్‌లు ఉపాధ్యాయులకు ఉపయుక్తం కాకపోగా, భారంగా మారాయి.

**తాజా నియామకాలతో మరింత కలవరం:** ఇదిలా ఉండగా, మే 2025 మరియు మొన్నటికి మొన్న పాఠశాలల్లో ‘పాఠశాల తనిఖీ అధికారులు’ అంటూ అరకొరగా ఉన్న ఉపాధ్యాయులలోంచే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1500 పైచిలుకు తనిఖీ బృందాలు త్వరలో నియామకంపై సీనియర్ ఉపాధ్యాయుల్లో కలవరపాటు మొదలైంది. అదేవిధంగా, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో అర్హత (క్వాలిఫై) సాధించాలనే నిబంధన సీనియర్ ఉపాధ్యాయులలో కలవరపాటుకు, తీవ్ర మానసిక ఆరోగ్య ఇబ్బందులకు దారితీస్తోంది.

# ‘త్రిశంకు’ రూపం



కెనడాకు చెందిన డల్హౌస్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఒక కొత్త ప్రాణిని కనుగొన్నారు. రోహరదా నాయకత్వంలోని శాస్త్రవేత్తల బృందం తాజా నివేదికను అనుసరించి ఇది సంపూర్ణమైన ప్రాణి కాదు. అదే సమయంలో, పూర్తి పదార్థం కూడా కాదు. ఈ రెండు దశలకు మధ్య, సరికొత్త రూపంతో దర్శనమిస్తున్న ఈ జీవి పేరును ‘కాండిడాటస్ సుకునారచాయుమ్ మిరాబైల్’ అని నిర్ధారించారు. ఇందులోని జన్యు సంకేతాల ‘జెనోమ్’ చిన్నదే. అయితే, అది సాధారణ ఆర్కియా జీవుల్లో కనిపించే జెన్స్ మొత్తంతో పోలిస్తే మరింత తక్కువ. డిఎన్ఎను మార్చడం, ఆర్ఎన్ఎను తయారు చేయడం, ప్రొటీన్లను సిద్ధం చేసుకోవడం వంటి పనుల కోసం అవసరమైన జెన్స్ ఈ జీవిలో ఉన్నాయి. కాబట్టి దీనిని వైరస్‌గా భావించడానికి వీల్లేదు. ఎందుకంటే, వైరస్‌లలో ఇలాంటి లక్షణాలు కనిపించవు. అదే సమయంలో, ఇది ఎక్కువ సందర్భాల్లో మెటబాలిజం సంబంధిత మార్గాలు చాలా తక్కువగా కలిగి ఉంది. అంటే, ఇది పని చేయడానికి వాతావరణం లేదా హోస్ట్ జీవి అవసరం. మరో రకంగా చెప్పాలంటే, ఇదొక పరాన్న జీవి. సాధారణంగా వైరస్‌లలో ఈ లక్షణాన్ని చూడవచ్చు. మొత్తంగా చూస్తే, ఈ కొత్త రూపానికి కొన్ని వైరస్ లక్షణాలు, మరికొన్ని పదార్థ లక్షణాలు ఉన్నాయి. అందుకే, శాస్త్రవేత్తలు దీనిని ఒక జీవవైరస్ ఉద్భవానికి ముందున్న దశగా భావిస్తున్నారు. జీవం లేదా పదార్థం అని వర్గీకరించడానికి వీల్లేని స్థితిలోని ఈ జీవిపై ఇంకా ప్రయోగశాలలో అధ్యయనం జరుగుతున్నది. ఈ పరిశోధనలు కొత్త జీవ సిద్ధాంతాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

## సెపక్‌తక్రా రాష్ట్ర జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు





**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గోవాలో జరిగే 35వ జాతీయస్థాయి టోర్నమెంట్‌కు తెలంగాణ జట్టుకు జిల్లా నుండి ముగ్గురు క్రీడాకారులు ఎంపిక య్యారు. పురుషుల విభాగంలో ఉదయ్‌కుమార్, మహిళల విభాగంలో పూజిత, లాస్యప్రియ ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాదరి సంజీవ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 21, 22లలో వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన టోర్నీలో జిల్లా జట్టు మహిళల విభాగంలో మొదటిస్థానం కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో జిల్లా జట్టు మూడోస్థానం తీసుకుని రాష్ట్ర జట్టుకు ఉదయ్ కుమార్ ఎంపికయ్యాడు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 27 వరకు గోవాలో జరిగే 35వ సెపక్‌తక్రా సీనియర్ నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. రాష్ట్ర జట్టుకు క్రీడాకారులు ఎంపిక పట్ల జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశ వేణు, సంజీవ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## నిర్మల్ నుండి కాశీ-అయోధ్యకు బస్సు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమం, కాశీ(వారణాసి) అయోధ్యకు 27వ తేదీ సోమవారం బస్సు ప్రారంభిస్తున్నట్లు డిపోమేనేజర్ కె.పండరి తెలిపారు. 27వ తేదీ మధ్యాహ్నం 1గం.లకు నిర్మల్ నుండి బయలుదేరి తెల్లవారు 28వ తేదీన ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించి మధ్యాహ్నం 2గం.లకు కాశీ(వారణాసి) చేరుకుంటుంది. ఆ రోజు రాత్రి కాశీలోనే బస్సు ఉంటుంది. భక్తులు కాశీ విశ్వనాథ టెంపుల్, గంగా హారతి అన్ని ఘాట్‌లు దర్శించుకున్న తర్వాత 29వ తేదీ మధ్యాహ్నం 3గం.లకు అయోధ్యకు చేరుకుంటుంది. అక్కడ బాలరాముని దర్శనం అయోధ్యలో వివిధ దేవాలయాలు దర్శించుకొని రాత్రి అయోధ్య నుండి బయలు దేరి 30వ తేదీ రాత్రి నిర్మల్ చేరుకుంటుంది. ఒకరికి రూ.6400లు ఉంటుందని భోజనం, వసతి ఖర్చులు ప్రయాణికులే భరించాలని, బుకింగ్ కొరకు నిర్మల్ బస్టాండ్ నందు కానీ అధికారిక వైబ్ సైట్ సర్వీస్ నంబర్ 99999లో కాని టికెట్ బుక్ చేసుకోవాలని, వివరాలకు 9959226003, 8328021517, 7382842582లో సంప్రదించాలని ఆయన తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని డిపోమేనేజర్ కె.పండరి తెలిపారు.



## దళారులను నమ్మి మోసపోవద్దు

### జిల్లా సహకార అధికారి శ్రీనివాస రావు

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మోర్తాడ్ గ్రామ పరిధి గ్రామాలు మోర్తాడ్, తిమ్మాపూర్, పాలెం గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, అలాగే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి ఎన్.శ్రీనివాస్ రావు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు పండించిన పంటలను నూర్పిడి చేసిన తరువాత మార్కెట్ కు తీసుకొచ్చి సొసైటీల ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం, మొక్కజొన్న, పంటలను అమ్మి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందుకోవాలని అన్నారు. కానీ దళారులను నమ్మి దళారులకు పంటలను అమ్మి రైతులు నష్టపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి బి.పోశన్న, ఎఎంసి చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చయ్య, ఎఎంసి డైరెక్టర్లు భూతిపురం మహిపాల్, నవీద్, డైరెక్టర్లు మోత్కు భూమన్న, అధికార పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, జిల్లా సెక్రెటరీ గిర్మాజీ గోపి, గ్రామ పార్టీ అధ్యక్షులు నాయకులు మోర్తాడ్ సొసైటీ కార్యదర్శి కాశీరాం, సంఘం సిబ్బంది శంకర్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.




## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### జిజిహెచ్ ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిజిహెచ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ అన్నారు. శుక్రవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. జిల్లా కేంద్ర జిజిహెచ్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచి శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ సిబ్బందిని పెంచటంతో పాటు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని,దీపావళి పండగ సందర్భంగా కార్మికులకు పెండింగ్‌లోని వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా యూనియన్ నాయకులు స్వరూప, భారతి, సాయి కిరణ్, వెంకట్, సానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



## పాత పెన్షన్ హామీని నిలబెట్టుకోండి

### సిపిఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు

**ప్రజాపక్షం/తానూర్ :** ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన మేరకు తెలంగాణలో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ సిపిఎస్ ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని బోసి ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పిడి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన రజిత, స్వరూపరాణి, ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిపిఎస్ విధానం వల్ల రెండు లక్షల పైచిలుకు కుటుంబాలు వేదన అనుభవిస్తున్నాయని సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే పాత పెషన్ హామీని సత్వరమే అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సిపిఎస్ రద్దును తక్షణమే జరపాలని కోరారు. 2011లో తాను సిపిఎస్ ఉద్యమాన్ని ప్రారంభించామని ఈ 14 సంవత్సరాలలో గ్రాటివిటీ, ఫ్యామిటీ పెన్షన్ను సాధించామని త్వరలోనే పూర్తి స్థాయి పాత పెన్షన్ సాధిస్తాం అన్న ధీమాను వ్యక్తం చేశారు.పాత మిషన్ అమలు చేయడం వల్ల ప్రభుత్వంపై భారం ఏమీ పడబోదని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, నాయకులు పండరి,బూసి సుధాకర్,గజానంద్ రావు,తదితరులు పాల్గొన్నారు.



## భీమన్న గుట్ట భూములు కాపాడాలని వినతి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని భీమన్న గుట్ట ప్రాంతం అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ముదిరాజ్లకు కేటాయించిన స్థలాన్ని వారికే అప్పగించి న్యాయం చేయాలని కోరుతూ ముదిరాజ్ కులస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.ఎన్నో ఏళ్లుగా పండ్ల చెట్ల పెంపకం ద్వారా ముదిరాజ్ కులస్తులకు జీవనోపాధి కల్పిస్తున్న భీమన్న గుట్ట ప్రాంతం నేడు ఆక్రమణలకు గురవుతుందని ముదిరాజ్ కుల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు కోరారు.లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ముదిరాజ్ కులస్తులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల నాయకులు పాల్గొన్నారు.

# రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం

### కష్టపడే ప్రతీ కార్యకర్తకూ కాంగ్రెస్ పార్టీలో సముచిత గౌరవం

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు జ్యోతి రౌటేలా



**ప్రజాపక్షం/గజ్వేల్ :** కాంగ్రెస్ పటిష్టత కోసం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసిన ఘన చరిత్ర పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి దక్కుతుండగా, ఆయనను ప్రధాని చేయడమే ప్రతి కార్యకర్త కర్తవ్యమని కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు జ్యోతి రౌటేలా పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్, వర్గల్ మండల కేంద్రాలలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర కోఆర్డినేటర్లు జగదీశ్వర్‌రావు, నజీర్ అహ్మద్, వరలక్ష్మి, సంతోష్ గుప్త, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డిలతో కలిసి ఆమె ప్రసంగించారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకం చేపడుతుండగా, ప్రతి కార్యకర్తతో వ్యక్తిగంతగా మాట్లాడి అభిప్రాయం సేకరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుండగా, బిజెపిని నిలదీస్తూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో దోచుకోవడం, దాచుకోవడానికి పరిమితమైన గత ప్రభుత్వం ఖజానాను దివాలా తీయించిందని, అయినప్పటికీ రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి చక్కటి పాలన చేస్తున్నట్లు స్పష్టం చేశారు. త్యాగాలు కాంగ్రెస్ పార్టీకే సాధ్యపడుతుండగా, దివంగత ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించినట్లు గుర్తుచేశారు. పార్టీ శ్రేణులు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ కుటుంబ సభ్యులేనని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు క్రింది స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, మాజీ ఎంపిపి సలీం, ఉపాధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నేతలు రమేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వేమా రెడ్డి, పోషిరెడ్డి, తమ్మలి శ్రీనివాస్, ప్రభుదాస్ గౌడ్, కొన్యాల బాల్రెడ్డి, నర్సింహ రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** దీపావళి పర్వదినాన్ని పూరస్కరించుకొని ఆదివాసి గూడేలలో గుస్సాడీ నృత్యాలతో కోలాటాల నడుమ రెంగన్వాడీ గ్రామంలో దండారి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ హాజరై మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలని అన్నారు. గిరిజనుల పెద్ద పండగ దీపావళిని కుటుంబ సమేతంగా ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఆయనతో పాటు గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరికలు..** బొందడి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు.



# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలి

### సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజన్నాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ కేంద్రాన్ని సుల్తాన్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాలల విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి చదువు ప్రతిభా స్థాయిని తెలుసుకున్నారు. సెబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి వారిని ప్రొత్సహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వెనకబడిన విద్యార్థులు స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పోషకాహార సమస్యల పరిష్కారం కోసం నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సుల్తాన్పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ, ఇండ్ల నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఇందిరమ్మ, ఇండ్ల నిర్మాణం పనులకు ఇసుక కొరత రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం స్థాయిని బట్టి వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉన్న ఇండ్లు ఏఏ దశలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో స్లాబ్ దశ వరకు పూర్తి అయిన ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ, కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ పాండు అధికారులు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్యకర్తలే జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోవటం సంతోషకరం

### ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** ప్రజాస్వామ్య విధానంలో కార్యకర్తలచే జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకోవటం ఎంతో సంతోషకరమన్నారు. శుక్రవారం రూరల్ నియోజకవర్గంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని ఎన్నికల్లో కార్యకర్తల అభిప్రాయ సేకరణలో భాగంగా డిచ్‌పల్లి, ధర్పల్లిల లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎఐసిసి పర్యవేక్షకులు రిజ్వాన్ అర్షద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన ప్రజాస్వామ్య విధానంలో కార్యకర్తలచే జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోవటం ఎంతో సంతోషకరం. ఇతర పార్టీలాగా అధికారుల నిర్ణయం కాదు, కార్యకర్తలే తామే నాయకుడిని ఎన్నుకోవటం కాంగ్రెస్ ప్రత్యేకత అన్నారు. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాకు అగ్రికల్చర్ కళాశాల కేటాయించినందుకు సిఎంకు, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అగ్రికల్చర్ కళాశాల రూరల్ నియోజకవర్గంలో ఏర్పడేందుకు తాను వర్షాకాల శాసనసభ సమావేశాల్లో చేసిన కృషి ఫలించిందని గుర్తుచేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ కట్టుబడి ఉందని కానీ బిఆర్ఎస్, బిజెపి పార్టీలు దానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయన్నారు.

బిసి సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు నిస్తుందన్నారు. త్వరలో జిల్లాకు వెటర్నరీ కాలేజీ కూడా కేటాయించాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బిజెపి పాలనలో రైతులు, మైనార్టీలు, బలహీన వర్గాలు నష్టపోయారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా పని చేసి పార్టీ విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్లమెంటరీ అబ్జర్వర్ వెంకట్ నర్సింగ్‌రావు, పరిజతం రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయరెడ్డి, నగేష్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, వేణు యాదవ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో శుక్రవారం రోజు బాలికల ప్రాథమిక పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనంలో ప్రతి తరగతిలో టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మోర్తాడ్ బ్రాంచ్ మేనేజర్ సుధారాణి బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. విద్యార్థులు కష్టపడి చదివి, జీవితంలో మంచి ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు, రమణాచారి, ఉపాధ్యాయులు సాగర్, నరసింహమూర్తి, జ్యోతి, బ్యాంక్ సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.



## విద్యార్థుల లైబ్రరీకి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీ పుస్తకాలకు పదివేల రూపాయలను ఆర్థిక సహాయం చేసి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు దాతృత్వం చాటుకున్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోడ్చన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాష అభివృద్ధి పెంపొందించడంలో భాగంగా మాచవరం గ్రామానికి చెందిన విశ్రాంతి ప్రధానో పాధ్యాయులు సాంబశివరావు పాఠశాల విద్యార్థులకు తెలుగు పద్యాలతో పోటీ నిర్వహించి పద్యం చెప్పిన ప్రతి విద్యార్థికి పది రూపాయల చొప్పున 6000 రూపాయలు అందజేశారు. అంతేకాకుండా పాఠశాలలో లైబ్రరీ పుస్తకాల కోసం పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫజిల్ హుస్సేన్, ఉపాధ్యాయులు వనిత, సతీష్ గౌడ్, కనకరెడ్డి, రమేష్, దుర్గయ్య, స్రవంతి, నాగరాజు, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# జాన్కంపేట్‌లో మొరం టిప్పర్లు స్వాధీనం

### పోలీస్ స్టేషన్‌కు తరలింపు

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండలం జాన్కంపేట్ మీదుగా శుక్రవారం ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు నాలుగు మొరం టిప్పర్లను బోధన్ ఎసిపి శ్రీనివాస్, రూరల్ సిఐ విజయ్ బాబులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని టిప్పర్లను పట్టుకోవడం జరిగిందని, అనుమతులు లేకుండా ఎవరైనా మొరం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే జాన్కంపేట్ గ్రామ శివారులో మొరం తవ్వకాలకు నామమాత్రపు అనుమతులతో వందలాది టిప్పర్లలో పెద్ద ఎత్తున మొరం తరలిస్తున్నారని, దీనికి రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. వందల సంఖ్యలో మొరం టిప్పర్ల రవాణా వల్ల రోడ్లు సైతం పాడవుతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.





## సజావుగా ధాన్యం సేకరణ ప్రక్రియ

### కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం సేకరణకు సంబంధించిన పూర్తి వివరాలను రిజిష్టర్లలో నమోదు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన మీద వారికి రసీదులు అందించాలని రైతు వివరాలు క్రాప్ బుకింగ్ డేటాలో నమోదై ఉన్నాయా అని పరిశీలించుకోవాలని సూచించారు. మోస్రా, చందూర్, వర్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి ఆయా కేంద్రాలలో ఇప్పటివరకు ఎంత పరిమాణంలో వరి ధాన్యం సేకరించారు. ఎన్ని లారీల లోడ్ల ధాన్యం రైస్ మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిష్టర్లలో అన్ని వివరాలు సక్రమంగా రాయాలని, ట్రక్ షీట్లు వచ్చిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలు చేయాలని తద్వారా రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, సివిల్ సప్లయిస్ డిఎం శ్రీకాంత్‌రెడ్డి, సహకార శాఖాధికారి అంబర్ సింగ్, వర్నిమార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్, అధికారులున్నారు.



## పిపిసి రోజూ వారీగా డేటా నిర్వహణ చేయాలి

### బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, సొసైటీ సిఇఒలను సమన్వయం చేసుకుంటూ రోజు వారిగా పిపిసి వారిగా డేటా నిర్వహణ చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని సంగెం, భవానిపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సబ్ కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ప్రతి పిపిసిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి ప్యాడి ప్రొక్యూర్మెంట్ సెంటర్‌లో తాగునీరు, గన్నీ బ్యాగులు, లారీలు, మాయిశ్చర్ మీటర్లు, వెయింగ్ మెషీన్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతుల రికార్డుల నిర్వహణ, మాయిశ్చర్ తనిఖీ, హమాలీల లభ్యత, ట్రక్ షీట్ తయారీ, రైస్ మిల్లులతో అను సంధానం, బిల్లుల తయారీ, క్లియరెన్స్ , డెటా నిర్వహణ వంటి వారిని సక్రమంగా సమన్వయంతో నిర్వహించాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఆయన వెంట తహసీల్దార్‌లు, సొసైటీ సిఇఒలు తదితరులు ఉన్నారు.

## సిఎం, పిసిసి అధ్యక్షుడి చిత్రపటాలకు క్షీరాభిషేకం

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేసిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశామన్నారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇప్పుడు మన జిల్లా వాస్తవ్యుడు పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చొరవతో వ్యవసాయ కళాశాల మంజూరు చేయడం జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టమని ఈ సందర్భంగా రాష్ట్ర క్యాబినెట్ మంత్రివర్గంకు సిఎం రేవంత్‌రెడ్డికి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పడిగెల ప్రవీన్, గణేష్, అంజమ్మ, మల్లయ్య, రాజేంద్రప్రసాద్, లింగారెడ్డి, నరేందర్, శైలేందర్, శేఖర్, రవీందర్, నాగరాజు, శేఖర్, ప్రతాప్, రంజిత్, జగదీష్, కిషన్, గంగాధర్, అశోక్ పాల్గొన్నారు.

## మృతి చెందిన వృద్ధుడి నేత్రాలు దానం

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన కంటెడి గంగాధర్ (60) అనే వృద్ధుడు శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబీకులు ఆయన నేత్రాలను దానం చేయాలని ఎడపల్లి లయన్స్ క్లబ్ సభ్యులకు తెలియచేయగా బోధన్ లయన్స్ క్లబ్ ఆస్పత్రి వైద్యులు శుక్రవారం వృద్ధుని నేత్రాలను సేకరించారు. తమ తండ్రి నేత్రాలతో మరోకరికి చూపు కల్పించి, వారి జీవితంలో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో నేత్రాలను దానం చేయడం జరిగిందని మృతుని కుటుంబీకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎడపల్లి లయన్స్ క్లబ్ సభ్యులు సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆదైర్యపడవద్దు..అండగా ఉంటాం: కెటిఆర్

ప్రజాపక్షం/సిద్దిపేట : సిద్దిపేట నియోజక వర్గం చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ,ఎస్టీ కమిషనర్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను శుక్రవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ శుక్రవారం పరామర్శించారు. చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి విజయ్ ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. శుక్రవారం ఎర్రోళ్ల శ్రీనివాస్ నివాసానికి మాజీ మంత్రి కెటిఆర్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదైర్య పడవద్దు అండగాఉంటామని కెటిఆర్ భరోసా నిచ్చారు. ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు పార్టీ పరంగా అన్ని విధాల అండగా ఉంటామని కెటిఆర్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మాణిక్యరెడ్డి, రాష్ట్రకార్యదర్శి రాధకిషన్ శర్మ, నాయకులు కాముని శ్రీనివాస్, పూజల వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు రైతులకు సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, విండో చైర్మన్ బద్దం గోపి, తహసిల్దార్ బిఎస్ఎస్ వరప్రసాద్, మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ మేరకు బోరిగం రాజు మాట్లాడుతూ రైతులు మక్కలను తెమ శాతం 14 కు మించకుండా మక్కలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న 2400 మద్దతు ధరను పొందాలని సూచిస్తూ దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శులు సురేందర్, మంత్రి సతీష్, గంగాధర్, రాములు, ముక్కెర గోపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఆపన్న హస్తంగా సిఎంఆర్‌ఎఫ్: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/బెజ్జంకి: ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఆపన్న హస్తంగా ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పడుతుందని మానకొండూర్ ఎంఎల్ఏ డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి ఒగ్గు దామోదర్, ఏఎంసి చైర్మెన్ పులి కృష్ణ, నాయకులు చెప్యాల శ్రీనివాస్, బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, అలయ చైర్మెన్ జెల్ల ప్రభాకర్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, ఉపాధ్యాయులకు సిపిఆర్, అవగాహన



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: స్థానిక జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం పెద్దపల్లి 108 సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 పెద్దపల్లి జిల్లా ఇన్చార్జ్ కుమార స్వామి 108 సిబ్బంది పడిదం కుమార్ నూనె దేవేందర్ సీపీఆర్ చేసే విధానాన్ని డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది కుమార్ దేవేందర్ మాట్లాడుతూ గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని సిపిఆర్ ఎలా చేయాలనే దానిపై డెమో ద్వారా చేసి చూపించడం జరిగింద. అనంతరం, పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను 108 సిబ్బంది వివరించారు. పొగాకు వల్ల క్యాన్సర్, టీబీ వంటి అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. మానసిక ఆరోగ్య రుగ్మతలు, వాటి నివారణ మార్గాలపై కూడా 108 సిబ్బంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు అర్థమయ్యే రీతిలో వివరణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు...



ప్రజాపక్షం/జమ్మికుంట: కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జమ్మికుంట మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ముఖ్య అతిథిగా డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ చందు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్‌లు హాజరై మాట్లాడారు. సఫాయి కార్మికులు ప్రతి మున్సిపాలిటీకి సిపాయిగా పనిచేస్తారన్నారు. గుండెపోటు, అకస్మాత్తుగా సంభవించే సంఘటనల వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సిపిఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారు సూచించారు. వైద్యుడు తులసీదాస్, మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, పంజాల ప్రతాప్‌గౌడ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, సదానందం, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, పారిశుద్ధ్య జవాన్లు, కార్మికులు పలువురు పాల్గొన్నారు.

## నార్కోటిక్ డ్రగ్స్ తయారు చేస్తే కటిన చర్యలు: రాజు

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట జిల్లాతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏదైనా ప్రాంతాల్లో కానీ, ఇళ్లు, ఫ్యాక్టరీలలో నార్కోటిక్ డ్రగ్స్,సైకోట్రోఫిక్ సబ్ స్టాన్సెస్ వంటి డ్రగ్స్ తయారీ కార్యకలాపాలు ఉంటే వెంటే టోల్ ఫ్రీ నం.18005996969తోపాటు ఆయా డ్రగ్ ఇన్స్పెక్టర్‌లకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఔషధ నియంత్రణశాఖ ఎడి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ పరిసరాలలో అనుమానాస్పదంగా కనిపించినా, ఎవరైనా వ్యక్తులు డ్రగ్ విక్రయాలు చేస్తున్నట్లు తెలిసినా వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రజలు అప్రమత్తగా ఉండాలని, ఎలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను గుర్తిస్తే, నకిలీ, నాణ్యతలేని మందులను మార్కెట్‌లోకి రాకుండా నివారించవచ్చని తెలిపారు.

## ప్రమాదవశాత్తు కింద పడి ఒకరు మృతి



ప్రజాపక్షం/మల్లాపూర్ : మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన చింతలపల్లి లింగారెడ్డి (62)సంవత్సరాల వ్యక్తి ఇంటి వద్ద తనకు తాను కింద పడిపోయి మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మృతుని కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి మెట్ల వద్ద పడిపోయి ఉండడంతో మృతుడి భార్య కోడలు దగ్గరికి వెళ్లి చూడగా తుది శ్వాసతో ఉండడంతో పొరుగింటి వారి సాయంతో సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించగా మృతి చెందాడని ప్రమాదవశత్తు తనకు తాను జారిపడి చనిపోయాడని మృతుడి కొడుకు చింతలపల్లి లక్పతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పిల్లల్లో లోపపోషణ నివారణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/గంగాధర: పిల్లలలో లోప పోషణ నివారణకు ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గంగాధర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో పోషణ మాసం, శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం సభలో భాగంగా ప్రతి శుక్రవారం ప్రభుత్వ పాఠశాల, ఆరోగ్య కేంద్రం అంగన్‌వాడీ సేవలను పర్యవేక్షిస్తామని తెలిపారు. శుక్రవారం సభలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు, ఉచితంగా మందులు అందజేస్తున్నామని అన్నారు. మహిళల్లో రక్తహీనతను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు అందించడం, సరైన పోషకాహారం సూచించడం ద్వారా జిల్లాలో రక్తహీన గుర్తించిన మహిళల్లో 35 శాతం వరకు సాధారణ స్థితికి చేరుకున్నారని తెలిపారు. శుక్రవారం సభలో ప్రభుత్వ పథకాల సద్వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని, ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవల గురించి తెలియజేస్తున్నామని అన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లల చదువుపైనే మాత్రమే కాకుండా వారి పోషణ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ చూపుతారని అన్నారు. పిల్లల బరువు ఎత్తులను పర్యవేక్షిస్తూ పోషణ లోపం లేకుండా చూస్తామన్నారు. అవసరమైన పిల్లలను ఎన్ఆర్‌సి సెంటర్‌కు రిఫర్ చేసి సాధారణ బరువుకు తీసుకుస్తామని తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మహిళలు కుటుంబ సభ్యుల ఆరోగ్యం పోషణమై మాత్రమే శ్రద్ధ పెడుతూ తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదన్నారు. మహిళల సంక్షేమం, ఆరోగ్యం గురించి జిల్లా కలెక్టర్ ఆలోచించి శుక్రవారం సభ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గర్భిణీలకు సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. గంగాధర తహసీల్దార్ అంబటి రజిత, ఎంపిడివో దమ్మని రాము, సిడిపివో నర్సింగరాణి, ఎంఈవో ప్రభాకర్‌రావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ తదితరులున్నారు.

## స్పెషల్ బ్రాంచ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సిపి గౌస్ అలం



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం శుక్రవారం స్పెషల్ బ్రాంచ్ నూతన కార్యాలయం భవనాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇంతకు ముందు పోలీస్ కమిషనర్ నివాసం ఉన్న స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని అమరవీరుల స్మారక భవనంలోకి తరలించారు. ఈ సందర్భంగా సిపి గౌస్ అలం పూజా కార్యక్రమాలు నిర్వహించి, నూతన కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. స్పెషల్ బ్రాంచ్ సేవలు పోలీస్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయని శాంత్రి భద్రతల పరిరక్షణకు వారి సహకారం ఎంతో ముఖ్యమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఏసిపిలు శ్రీనివాస్, వెంకట స్వామి, విజయ కుమార్, మాధవి, యాదగిరి స్వామి, సతీష్, శ్రీనివాస్‌లతో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**రామకృష్ణ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్**

తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి పోలీస్ స్టేషన్ పరిదిలోని రామకృష్ణ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని 124 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 117 బైక్‌లు, 07 ఆటోలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సీపీ గౌస్ ఆలం పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి, సైబర్ నేరానికి గురైనట్లయితే వెంటనే స్పందించి, నేరం జరిగిన గంట లోపే 1930 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్‌చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. స్టేట్ హైవే పక్కనే ఆనుకుని రామకృష్ణ కాలనీ ఉన్నందున తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సిపి తెలిపారు.. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించడంతో ప్రజలు రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏసిపి విజయ కుమార్, ఇన్స్పెక్టర్లు సదన్ కుమార్, బిల్లా కోటేశ్వర్, ప్రదీప్, శ్రీలత, పుల్లయ్య, సరిలాల్, ఎల్ఎండి పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీకాంత్‌లతో పాటు ఇతర అదికారులు ఉన్నారు.

## ఆల్ఫోర్స్ టైనీటాట్స్‌లో క్రియేటివ్ గెలాక్సీని ప్రారంభించిన కలెక్టర్



ప్రజాపక్షం/కరీంనగర్ : విద్యార్థులకు ప్రాథమిక దశ నుండి సృజనాత్మకంగా పోటీ తత్వాన్ని పెంపొందించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డితో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ టైనిటాట్స్ ప్రాంగణంలో నర్సరీ నుండి రెండో తరగతి విద్యార్థులచే అద్భుతంగా ఏర్పాటు చేసినటువంటి క్రియేటివ్ గెలాక్సీ పేరుతో ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గదిలోని విషయాలను చాలా విశ్లేషణాత్మకంగా సమగ్రంగా తెలిపినట్లయితే వారిలో సృజనాత్మకత పెరుగుతుందని, ఆ సృజనాత్మకత ద్వారా నూతన విషయాలను తెలుసుకునేటువంటి అవకాశం ఉంటుందని వారు గుర్తు చేశారు. ఉపాద్యాయులు బోధిస్తున్నటువంటి విషయాలు విద్యార్థులు క్రమం తప్పకుండా సాధన చేసినట్లయితే అన్ని రంగాల్లో విజయం సాధిస్తారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుండే అన్ని విషయాల పట్ల ప్రత్యక్ష పరోక్ష విధానాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిలో నేర్చుకునే ప్రక్రియను పెంపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉపాద్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అల్ఫోర్స్ అధ్యాపకుడు శ్రీనివాస్‌కు అభినందనలు**

రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరిగిన 47వ ఆల్ ఇండియా అకౌంటింగ్ కాన్ఫరెన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెమినార్‌లో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ పీజి కాలేజీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధ్యక్షులు డా.గుండా శ్రీనివాస్ ఆర్థిక నివేదికలలో ఇఎస్ఇటిపై కృత్రిమ మేదస్సు(ఏఐ) ప్రభావం అనే పరిశోధన పత్రాన్ని ప్రదర్శించారు. ఈ సంధర్భంగా అధ్యాపకుడిని కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి , ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

## భూ భారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ బి. సత్యప్రసాద్



ప్రజాపక్షం/ధర్మపురి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు.మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. శ్రీ లక్ష్మి నృసింహా స్వామి దేవస్థానం పునఃనిర్మాణం పనులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు.విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి*ధర్మపురి పట్టణంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులను సమస్యలు ఏమైనా ఉన్నాయాని నేరుగా అడిగి తెలుసుకున్నారు.పిల్లల ఆరోగ్యం, విద్య పట్ల సరైన శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. భోజన నిర్వహణ,బియ్యం,వంట సరకుల నాణ్యతను పరిశీలించి ప్రభుత్వ ఆదేశానుసారం మెనూ ప్రకారం శుభ్రమైన వంటకాలు విద్యార్థులకు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేసి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము,తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న కోడెల పంపిణీలో పాల్గొన్న ఆది



ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో ఉన్న శ్రీరాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు ఉచితంగా కోడెల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై రైతులకు కోడెలను పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజన్న ఆలయాలలో స్వామివారికి కోడెను కట్టే ప్రత్యేక సంప్రదాయం వేములవాడలో ఉందని ఆయన తెలిపారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా కోడె మొక్కు చెల్లింపు వ్యవస్థ కొనసాగుతోందని చెప్పారు. తిప్పాపూర్ గోశాలలో భక్తులు స్వామివారికి అర్పించిన కోడెలను రైతులకు ఉచితంగా అందజేయడం జరుగుతోందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు ఉచిత కోడెల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. రైతులకు నేరుగా కోడెలను అందించడం వలన వారు వ్యవసాయంలో ఉపయోగించుకుంటూ లాభపడుతున్నారని చెప్పారు. రైతులు కోడెలను చక్కగా సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పంపిణీ చేసిన కోడెలను సమయానుసారం చెక్ చేస్తున్నామని, వాటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేములవాడలో 40 ఎకరాల విస్తీర్ణంలో అధునాతన సౌకర్యాలతో గోశాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. రాజన్నకు కోడె మొక్కులు చెల్లించే వారు పాలు మరిచిన తర్వాత కోడెలను అందజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బ్లాక్ అద్యక్షులు సాగరం వెంకటస్వామి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో లాభాల బోనస్ అంటే.. త్యాగాల బోనస్!

రక్త తర్పణతో 40 రోజులు నిరవధిక సమ్మెతో సాధించిన దీపావళి లాభాల బోనస్





ప్రజాపక్షం/పెద్దపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లా తొలి పార్లమెంటు సభ్యులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు కామ్రేడ్ టిబి.విఠల్ రావు, ప్రధాన కార్యదర్శి మనుబోతుల కొమరయ్య ల ఆధ్వర్యంలో ఆనాడు సింగరేణి వ్యాప్తంగా సమ్మె నిర్వహించి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించిన నాటి ఖమ్మం జిల్లా తొలి పార్లమెంటు సభ్యులు విఠల్ రావు ఆయన ఢిల్లీలో పోరాటం నిర్వహిస్తుంటే, సింగరేణిలో కొమరయ్య ఆధ్వర్యంలో 40 రోజులు సమ్మె నిర్వహించి సాధించిన లాభాల బోనసె నేడు సింగరేణి కార్మికులు పొందుతున్న పి ఎల్ ఆర్ బోనస్,అదే దీపావళి బోనస్. రష్యాకు వెళ్లి కార్మిక చట్టాలు మరియు లాభాల్లో వాటాలను తెలుసుకొని వచ్చి సింగరేణిలో కూడా లాభాల బోనస్ కోసం పోరాటం నిర్వహించిన విఠల్ రావు, మనుబోతుల కొమరయ్య, వంగ రాజేశ్వరరావు.. బోనస్ రావాల్సిందిగా డ్రాఫ్టింగ్ నిర్వహించిన చింతల ఎల్లయ్య, ఇమామ్ లు అన్ని విధాలుగా లీగల్ అథారిటీ గా... లాయర్ ఆళ్ల గురు ప్రసాదరావులు వ్యవహరించారు. పార్లమెంటులో లాభాల బోనస్ చట్ట బద్ధమైన రోజే విఠల్ రావుకు, గురు ప్రసాదరావుకు చింతల ఎల్లయ్య లకు ఆడపిల్లలు పు ట్టారు. పోరుబాట ఉన్న నేపథ్యంలో అరుణ... అరుణ ఎరుపు లో బోనస్ జ్ఞాపకార్థంగా ఆ ముగ్గురి ఆడపిల్లలకు అరుణ అని నామకరణంచేశారు. లాభాల బోనస్ విషయములోసింగరేణి అంతా సమ్మెతో అగ్నిజ్వాల గా మారిన తరుణంలో సింగరేణి కార్మికులు.,సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కు వెన్నంటి ఉండి లాభాల బోనస్ హక్కు సాధించే వరకుబావులు లేవు.. బడులు లేవు బజార్ అంతా బందు తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొత్తం విద్యుత్ శక్తి లేక అంధకారంలోసాగడంతో నాటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ముందుకొచ్చిగని కార్మికుల పోరాటాలకు మద్దతు తెలుపుతూరాష్ట్ర ప్రభుత్వం పార్లమెంటుకు సిఫారసు చేస్తూ.. నాటి ఆంధ్రప్రదేశ్ పార్లమెంటు సభ్యులందరూ కామ్రేడ్ విఠల్ రావు వెంట ఉండి చట్టసభల్లో లాభాల బోనస్ అంగీకరిస్తూ గెజిట్ రిలీజ్ చేశారు. ఇది 1964 లో జరిగిన బొగ్గు గని కార్మికుల విరోచిత పోరాటానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి యూనియన్ సాధించిన అపూర్వ లాభాల బోనస్ కానుక.

## ప్రతిమలో పిల్లల గుండె వ్యాధుల ఉచిత శస్త్రచికిత్స శిబిరం




ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్: ప్రతిమ ఫౌండేషన్ హీలింగ్ లిటిల్ హార్ట్స్(లండన్) సంస్థల సహకారంతో ఎనిమిదవ విడత చిన్న పిల్లల గుండె వ్యాధుల ఉచిత శస్త్రచికిత్స శిబిరం నిర్వహించబడుతోంది. ఈ నెల 20 నుంచి 25 వరకు ప్రతిమ ఆసుపత్రి నగునూరులో జరుగుతుంది. ఈ కార్యక్రమానకి ప్రముఖ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ దన్నపనేని రమణ నేతృత్వంలోని నిపుణుల బృందం నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి కార్డియాలజీ విభాగాల వైద్యులు పూర్తి సహకారం అందిస్తున్నారు. గతంలో నిర్వహించిన 7 శిబిరాల్లో 106 మంది చిన్నారులకు విజయవంతమైన గుండె శస్త్రచికిత్సలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన విషయం గర్వకారణమని తెలిపారు. డా.ఎల్.జాన్ ప్రిన్సిపాల్, డా.సిఎన్ ప్రసాద్ మెడికల్ సూపరిండెంట్, డా.కిషన్‌రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ అండ్ హెచ్‌వోడి, అనాటమీ ప్రసాదరావు, రిజిస్ట్రార్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.రామచంద్రరావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కళ్యాణ్ చక్రవర్తి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.ప్రవీణ్ కుమార్, డా.ఎ.విద్యాసాగర్, కార్డియాలజిస్టులు డా.నిఖిల అనస్థీషియాలజీ విభాగం డా.రాజా సుమన్ దత్తా, సిటీ సర్జన్ డా.సిహెచ్ అమిత్ కుమార్‌హెచ్‌వోడీలు పాల్గొంటారని యాజమాన్యం తెలిపింది. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సేవే తమ లక్ష్యమని, ప్రతిమ ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రజలకు అధునాతన వైద్యసేవలను అందించడమే తమ ధ్యేయమని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం ద్వారా గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు నిరుపేద కుటుంబాలకే కాకుండా సమాజానికి కొత్త ఆశను కలిగిస్తుందని పేర్కొన్నారు.

## పల్లెల్లో కరెంట్ తిప్పలు.. పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని కోనాపూర్, పోచంపేట, పెంబట్ల గ్రామాలలో ఐదు, పది నిమిషాలకు ఒకసారి కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. పొలాలలో స్థంభాలు వంగి వైర్లు కిందికి వస్తున్నాయని, లైన్‌మెన్ శ్రీనివాస్‌కు రైతులు ఫోన్ చేస్తే దురుసుగా మాట్లాడుతున్నాడని రైతులు అంటున్నారు. ఇతను వచ్చినప్పటి నుండి కరెంట్ సరిగా లేకపోవడం, కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదని ఆవేదన వ్యక్త చేస్తున్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని పలు గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

# క్రీడ



## అమ్మకానికి ఆర్సీబీ ఫ్రాంచైజీ?

ఐపిఎల్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 18వ సీజన్‌లో ట్రోఫీని ముద్దాడింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. ఒక ఐపిఎల్‌లో ఆర్సీబీ శకం మొదలైందని అభిమానులు సంబరపడుతున్న వేళ.. ఫ్రాంచైజీని అమ్మేయాలని యాజమాన్యం భావిస్తోంది. మంచి ధర పలికితే ఏమాత్రం ఆలోచించకుండా బెంగళూరు జట్టును వదిలించుకోవాలని అనుకుంటోంది డియాగియో గ్రేట్ బ్రిటన్ సంస్థ. ఈ మద్యం కంపెనీకి చెందిన వాటాదారులు ఐపిఎల్‌లో జట్టును కొనసాగించేందుకు అయిష్టత చూపిస్తున్నారు. అందుకే.. ఆర్సీబీని అమ్మేయమని మందిని సంస్థ ఆలోచిస్తోంది. అయితే.. చిన్నస్వామి తొక్కిసలాట, పోలీస్ కేసు తదనంతర పరిణామాల నేపథ్యంలో కొత్తవాళ్లకు జట్టును అప్పగించేందుకు ఆర్సీబీ యాజమాన్యం సిద్ధపడుతోంది. విరాట్ కోహ్లీ వంటి స్టార్ ఆటగాడు ఉన్న ఆర్సీబీ మార్కెట్ విలువ భారీగానే ఉంది. 'ఐపిఎల్ విజేత' అనే ట్యాగ్ ఉండడంతో రూ.1.75లక్ష కోట్లకు ఫ్రాంచైజీని అమ్మాలని డియాగియో గ్రేట్ బ్రిటన్ కంపెనీ పావులు కదుపుతోంది. వావ్హా.. అంత రేటా? అని ఆశ్చర్యపోతున్నారంతా. అయినా సరే ఆర్సీబీని కొనేందుకు ఆరు సంస్థల ఆసక్తి చూపిస్తున్నాయి. భారతకు చెందిన నాలుగు కంపెనీలతో పాటు అమెరికాకు సంబంధించిన రెండు సంస్థలు కూడా డియాగియో యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 'అదార్ పూనావాలా' (సీరమ్ ఇనిస్టిట్యూట్), జేఎస్‌డబ్ల్యూ (గ్రూప్ అధినేత పార్థ్ జిందాల్, అదానీ గ్రూప్ యాజమాన్యం రేసులో ఉన్నాయని తెలుస్తోంది. ఐపిఎల్ జట్టును హస్తగతం చేసుకోవాలని పూనావాలా ఫ్యామిలీకి ఎప్పటినుంచో ఉంది. 2010లో ఆదార్ తండ్రి సైరస్ జట్టును కొనేందుకు ఇన్విటేషన్ టు టెండర్ కూడా వేశారు. కానీ, సహారా గ్రూప్, రెండెజెవస్ స్పోర్ట్స్ బిడ్స్ దక్కించుకున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలో సగం వాటా కలిగిన పార్థ్ జిందాల్ సొంతగా ఒక జట్టుకు బాస్ అవ్వాలనుకుంటున్నారు. అందుకే.. ఆయన ఆర్సీబీని కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నాడు. అదానీ గ్రూప్ కూడా తమకు ఒక ఐపీఎల్ టీమ్ ఉండాలని అనుకుంటోంది. 2022లో బిసిసిఐ కొత్తగా గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ అనే రెండు ఫ్రాంచైజీలను ప్రకటించింది. అప్పుడు అదానీ గ్రూప్ టైటాన్స్‌ను దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నమే చేసింది.

## వారిని తప్పించం

### అలాఅనీ వరల్డ్ కప్ ఆడుతారనే భరోసా ఇవ్వలేను!

### చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్



భారత దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు తమ కెరియర్లోనే కఠిన సవాల్ ఎదుర్కొంటున్నారు. టన్నుల కొద్దీ పరుగులు, ఆస్ట్రేలియాపై తిరుగులేని రికార్డు ఉన్నా సరే.. మరోసారి తమ సత్తాను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది ఇద్దరికీ. అందుకు కారణం.. వన్డే వరల్డ్ కప్‌లో చోటు దక్కడంపై నెలకొన్న సందిగ్ధత. విశ్వ సమరానికి మరో రెండేళ్లు ఉన్నందున ఆసీస్ పర్యటనలో రెచ్చిపోవాలని అనుకుంటున్నారిద్దరూ. మరోవైపు ఈ సిరీస్‌తోనే విరాట్, హిట్‌మ్యాన్ భవితవ్యం తేలిపోనుందనే చర్చ జోరందుకుంది. ఈ నేపథ్యంలో వెటరన్ ప్లేయర్ల గురించి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్క సైతం కీలక వ్యాఖ్యలు చేశాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం తొలి వన్డేలో భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి. ఈ మ్యాచ్ కోసం నెట్స్‌లో తీవ్రంగా శ్రమించిన రోహిత్, విరాట్ కోహ్లీలపైనే అందరి కళ్లు నిలిచాయి. అయితే.. ఈ సిరీస్‌లో మూడేసి సెంచరీలు బాదినా సరే వరల్డ్ కప్ ఛాన్స్‌పై స్పష్టత ఇవ్వలేనని అగార్కర్ అన్నాడు. 'కోహ్లీ, హిట్‌మ్యాన్ ఇద్దరూ వరల్డ్ క్లాస్ ఆటగాళ్లు. వాళ్లను ప్రతిసారి పరీక్షించడం సరికాదు. ఒకసారి రోహిత్, విరాట్ మైదానంలోకి దిగి ఆడడం మొదలెట్టాక.. వాళ్ల ఆటను విశ్లేషిస్తాం. అంతేతప్ప వాళ్లను జట్టులో కొనసాగించాలా? వద్దా? అనే అంశంపై ఇప్పుడే నిర్ణయం తీసుకోం. ఒకవేళ ఆస్ట్రేలియాపై పరుగులు సాధించకున్నా సరే రోకోపై వేటు వేయం. అదే సమయంలో వీరు వరుసగా మూడు సెంచరీలు బాదినా సరే వరల్డ్ కప్ స్క్వాడ్‌లో ఉంటారనేది చెప్పలేను. కోహ్లీ, రోహిత్‌కు తమ బాధ్యతలు తెలుసు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇద్దరూ ప్రాక్టీస్ చేశారు. పెర్త్ వన్డేకు ముందు నెట్స్‌లో ఇరువురు చక్కని షాట్లు ఆడారు. ఫిట్‌నెస్ పరంగానూ చాలా మెరుగ్గా ఉన్నారు' అని మాజీ పేసర్ వెల్లడించాడు.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. ఆ ఇద్దరు మేటి బ్యాటర్లు అంతర్జాతీయ క్రికెట్ ఆడి ఏడు నెలలు అవుతోంది. ఐపీఎల్ ఆడి అయిదు నెలలు అవుతోంది. ఇప్పుడు ఆ స్టార్స్ ఇద్దరూ మళ్లీ గ్రౌండ్‌లోకి దిగుతున్నారు. ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగే తొలి వన్డే కోసం ఫుల్ ప్రిపేరయ్యారు. తమకు ఇష్టమైన వన్డే ఫార్మాట్‌లో చెలరేగేందుకు నెట్స్‌లో జోరుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. క్రికెట్ ప్రేమికులను మళ్లీ కనువిందు చేసేందుకు ఆ ఇద్దరూ ప్రాక్టీస్ చేస్తున్న విజువల్స్‌ను బిసిసిఐ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. బ్యాక్ ఇన్ బ్లూస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. కోహ్లీ సుమారు 40 నిమిషాల పాటు నెట్స్‌లో గడిపాడు. రాణా, అర్షదీప్‌తో పాటు లోకల్ బౌలర్లను ఎదుర్కొన్నాడు.


### రో-కో షోకు సిద్ధం కండి: బిసిసిఐ




టీమ్‌మేట్ రోహిత్ కూడా నెట్స్‌లో తీవ్రంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేవాడు. కోహ్లీ ఆడుతుంటే బంతి సౌండ్ మారుమోగింది. కానీ టైమింగ్ కోసం రోహిత్ కష్టపడినట్లు తెలుస్తోంది. చాలాసేపటి తర్వాత నెట్స్‌లోకి భారీ షాట్స్ కొట్టాడు రోహిత్. ఆదివారం రెండు జట్ల మధ్య తొలి వన్డే జరగనున్నది. ఆ మ్యాచ్‌లో రోకో పర్ఫార్మెన్స్ కోసం జనం ఎదురు చూస్తున్నారు.

కోహ్లీ, రోహిత్ ఇద్దరు కలిసి సుమారు 600 వన్డేలు ఆడారు. ఈ సిరీస్‌తో వన్డే క్రికెట్‌కు ఆ ఇద్దరు స్టార్స్ వీడ్కోలు పలుకుతారేమో అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇది ఫేర్‌వెల్ సిరీస్ అని కొందరంటున్నారు.

# ఫోకస్ సైన్స్


## కాంతి వేగంతో వ్యోమ నౌక!



ఒక వస్తువు ప్రయాణించే వేగానికి సంబంధించి ఎన్నో సిద్ధాంతాలు ఉన్నాయి. కాంతి కంటే వేగంగా ప్రయాణించడం సాధ్యమేనన్న ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. అయితే, అలాంటి పరిస్థితిలో సదరు వస్తువు ఎన్నో అసాధారణ ప్రభావాలకు లోనవుతుంది. మెక్సికో శాస్త్రవేత్త మిగ్వేల్ అల్కుబియెర్ 1994లో చేసిన ప్రతిపాదనను అనుసరించి, వస్తువు కాంతి వేగంతో ప్రయాణించడం అసాధ్యం కాదు. ఈ ఆలోచన ఆధునిక భౌతిక శాస్త్రంలో అత్యంత నూతన భావనకు ప్రతీక. 'అల్కుబియెర్ డ్రైవ్'గా పేర్కొనే అతని సిద్ధాంతం ప్రకారం, ఐన్‌స్టీన్ ప్రతిపాదనలను, అభిప్రాయాలను ఉల్లంఘించకుండా, వ్యోమనౌక లోపల ఒక స్థిరమైన బుడగను సృష్టించవచ్చు. దారి చుట్టూ ఉన్న స్థలాన్ని ముందుకు కుదిస్తారు. వెనుకవైపు విస్తరిస్తారు. దీనితో వ్యోమ నౌక చాలా త్వరగా మన గెలాక్సీని కూడా దాటి ప్రయాణిస్తుంది. నౌక నిజంగా కాంతి కంటే వేగంగా ప్రయాణించదని, కానీ, బబుల్‌ను సృష్టించడం వల్ల స్థలం, కాలంలో వక్రీకరణ జరిగిఏ కాంతి వేగాన్ని ఒక కణం రూపంలో అధిగమించే వీలు ఉంటుందని ఈ సిద్ధంతం సూచిస్తుంది. ఇది సాపేక్ష సిద్ధాంతానికి పొడిగింపుగా ఉంటుంది. అందుకే, భౌతిక శాస్త్రంలో అల్కుబియెర్ డ్రైవ్‌కు స్థానం లభించింది. కాగా, వార్ప్ బబుల్‌ను సృష్టించడానికి ప్రతికూల శక్తి (నెగెటివ్ ఎనర్జీ) అవసరం. ప్రస్తుతం మనకు తెలిసిన విశ్వంలో ఇలాంటి నెగెటివ్ ఎనర్జీ ఉనికి దాదాపు లేదు. అందుకే, ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో సాధ్యం కానిదిగా కొంత మంది పేర్కొంటారు. ఏదిఏమైనా, వ్యోమనౌకలో దాదాపుగా ఒక శూన్యాన్ని సృష్టించడం, తద్వారా కాంతి వేగాన్ని అధిగమించడం వంటి ఆలోచనలు, కొత్త పరిశోధనలకు ఊతమిచ్చేవిగా ఉన్నాయి. అందుకే, ఈ కోణంలో పరిశోధనలు వేగవంతమయ్యాయి.



## డార్క్ మ్యాటర్ ఓ మాయ!

రాజేంద్ర గుప్తా నేతృత్వంలో యూనివర్సిటీ ఆఫ్ ఒటావా శాస్త్రవేత్తల బృందం విడుదల చేసిన పరిశోధనా పత్రం భౌతిక సిద్ధాంతం ఖగోళ పరిశోధకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. విశ్వంలోని 95 శాతం భాగాన్ని కనబడని పదార్థం (డార్క్ మ్యాటర్), తెలియని శక్తి (డార్క్ ఎనర్జీ)తో నిండి ఉందనేది ఇప్పటి వరకూ అందరూ నమ్ముతున్న, విస్తృతంగా అంగీకరించిన సిద్ధాంతం. అయితే, అవి అసలు ఉండకపోవచ్చని అంటున్నారు. కొత్త సిద్ధాంతం ప్రకారం, మనం చూడలేని శక్తులు వాస్తవానికి లేవు. అవి విశ్వంలో గురుత్వాకర్షణ, కాంతి ప్రవర్తనను మనం అర్థం చేసుకునే విధానంలో ఉత్పన్నమయ్యే గణిత మాయలు కావచ్చు. గత కొన్ని దశాబ్దాలుగా, నక్షత్ర గాలాక్షీలు అంత వేగంగా తిరగడానికి కనిపించే పదార్థం సరిపోకపోతే, దానికి సమాధానంగా 'డార్క్ మ్యాటర్' అంశాన్ని ప్రతిపాదించారు. అదే విధంగా, విశ్వం వేగంగా విస్తరిస్తుండడాన్ని వివరించటానికి డార్క్ ఎనర్జీ అనే భావనను ఖరారు చేశారు. కానీ మన గణనలలో, సమీకరణాలలో ఏదో మౌలికమైన అంశం లేనందువల్ల లేదా గురుత్వాకర్షణ నమూనా అసంపూర్ణంగా ఉండటం వల్ల అలా కనిపిస్తోందని కొత్త అధ్యయనం పేర్కొంటున్నది. ఈ మార్పుచేర్పు చేసిన నమూనా, ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతాన్ని అంతరిక్ష స్థాయిలో ప్రశ్నిస్తోంది. లోకల్ స్కేల్‌లో పని చేసే గురుత్వాకర్షణ, విశ్వ సుదూర విశాలతల్లో వేరేలా ప్రవర్తించవచ్చని ఈ వాదన నిలదీస్తున్నది. ఈ సత్యం నిజమైతే, గెలాక్సీలు ఎలా ఏర్పడతాయి, విశ్వానికి చివరికి ఏమవుతుంది, అన్నదంతా మళ్లీ పునరాలోచన చేయాల్సి వస్తుంది. అయితే, కొత్త సిద్ధాంతం పట్ల జాగ్రత్త అవసరమని విమర్శకులుహెచ్చరిస్తున్నారు. ప్రత్యక్షంగా కనిపించకపోయినా, డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీ ఉన్నాయనడానికి విస్తృతమైన పరోక్ష ఆధారాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. మద్దతుదారులు మాత్రం, విజ్ఞానం అనేది అత్యంత పవిత్రమైన అంచనాలను కూడా ప్రశ్నించటమే అభివృద్ధికి మార్గమని మరోసారి గుర్తు చేస్తున్నారు. మొత్తానికి విశ్వంలో కనిపించని పదార్థం, తెలియని శక్తి లేవు అని తేలితే, మనం ఇంతకాలం ఒక మిథ్యావాదనను నిజమని భ్రమిస్తున్నామని స్పష్టమవుతుంది. అంతేగాక, విశ్వంపై మనకు ఉన్న అవగాహనలో విప్లవాత్మక మార్పులు తెస్తుంది.

## పట్టుపురుగుల్లో జన్యుమార్పుడి!



చైనాలోని శాస్త్రవేత్తలు ఒక జన్యు మార్పిడి చేసిన పట్టు పురుగును సృష్టించారు. వివిధ సోషల్ మీడియా వేదికల్లో చక్కర్లు కొడుతున్న సమాచారం ప్రకారం, ఈ జన్యుమార్పిడి జరిగిన పట్టుపురుల ద్వారా ఉత్పత్తయ్యే పట్టు కెవ్లార్ కంటే బలంగా ఉంటుంది. కెవ్లార్ అనేది బులెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఉపయోగించే బలమైన పదార్థం. చైనా శాస్త్రవేత్తల సరికొత్త ప్రయోగం, అంతకంటే బలమైన లేదా దృఢమైన పట్టును ఉత్పత్తి చేస్తుంది. ఈ శాస్త్రవేత్తలు పట్టు పురుగుల్లోని పట్టు ఉత్పత్తి వ్యవస్థను నిర్దిష్టంగా మార్పు చేసి, మెరుగైన బలాన్ని కలిగిన పట్టు ఉత్పత్తి చేయగలిగారు. ఆ కొత్త పట్టు, చాలా బలంగా ఉండటం వల్ల, రక్షణ వంటి అవసరాలకు ఉపయోగపడుతుంది. దీనిని ఉపయోగించి బులెట్‌ప్రూఫ్ జాకెట్లు, తొందరగా చిరిగిపోని కవర్లు, ప్రత్యేక ఫైబర్ పదార్థాలను తయారు చేయడం సాధ్యమవుతుంది. ఇది అత్యంత కఠిన వాతావరణ పరిస్థితులను కూడా తట్టుకుంటుందని అంటున్నారు. జీన్ల మార్పు టెక్నాలజీ ద్వారా మరింత శక్తివంతమైన పదార్థాలను అభివృద్ధి చేయవచ్చనే వాదనకు ఈ పరిశోధన బలాన్నిస్తున్నది. ఈ ఆవిష్కరణతో పట్టు పురుగు ద్వారా అత్యధిక బలం కలిగిన ఫైబర్ ఉత్పత్తి సాధ్యమై, భద్రతా రంగంలోను, ఇతర ఉన్నత పరిశ్రమల్లోను విప్లవాత్మక మార్పులు వచ్చే అవకాశం ఉంది.

## ప్రభుత్వ ఉద్యోగులుగా మున్సిపల్ కార్మికులను గుర్తించాలి

### సంఘం రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/వేములవాడ :** మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి. జైపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ప్రథమ జిల్లా మహాసభ పట్టణంలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిధిగా జైపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు సుప్రీంకోర్టు చెప్పిన విధంగా సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పిస్తూ, ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు అధ్యక్షతన సభ నిర్వహించగా, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, కెవి అనసూర్య, పండుగ పోచమల్లు హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారుడిగా అజ్జ. వేణు, గౌరవ అధ్యక్షుడిగా కడారి రాములు, అధ్యక్షుడు సుంకపాక పర్సరాములు, ఉపాధ్యక్షులు పెంట నరేష్, గాజుల వజ్రవ్వ, తాండ్ర. రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా పందుల మల్లేశం, సహాయ కార్యదర్శిగా పిట్టల రాజశేఖర్, కార్యదర్శులుగా ముప్పిడి తిరుపతి, నామాల వేణు, తాండ్ర నర్సవ్వ, పెంట రాజవ్వ, కోశాధికారి పెంట భారతమ్మ, స భ్యులుగా వాల్మీకి ఊర్మిల, ఎదురుగట్ల దుర్గయ్య, బండ లక్ష్మ న్, పెరుమని నాగరాజు, గాజుల చంద్రయ్య, సుంకపాక నరేష్, గుడిసె రాజయ్య, గద్దపాక మహేష్, కుమ్మరి రాజేష్, కుమ్మరి నారాయణ, సంగెపు రాజు, కుంటాల హరీష్, నమిలికొండ రఘు, పెంట గట్టవ్వ, ఎడ్ల భాబు ఎన్నికయ్యారు.

## జిజిహెచ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిజిహెచ్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. జిల్లా కేంద్ర జిజిహెచ్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచి సానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ సిబ్బందిని పెంచటంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మికులకు పెండింగ్‌లోని వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు స్వరూప, భారతి, సాయికిరణ్, వెంకట్, సానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## రిజర్వేషన్లకు అడ్డంకులు సృష్టిస్తున్న కేంద్రం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాజకీయ పరమైన వక్రబుద్ధితోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లు అమలులో అడ్డంకులు సృష్టిస్తోందని, దీనిని తెలంగాణ సమాజం తిప్పికొట్టి కేంద్రానికి బుద్ధి చెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. రాష్ట్ర బిసి జెఎసి పిలుపు మేరకు శనివారం జరగనున్న బంద్‌ను విజయవంతం చేయాలని రాజకీయ పక్షాలు, బిసి, సమాజిక, జర్నలిస్టులు, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేండ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరైన మాట్లాడారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ బిసి వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే వారికి సముచిత న్యాయం జరుగుతుందని, దీనిపై రాష్ట్రసభల్లో ఆమోదం చేసి పంపితే బిల్లుకు ఆమోదం తెలపకుండా కేంద్ర కుట్ర చేస్తోందని విమర్శించారు. తెలంగాణ చట్టసభలు, రాష్ట్ర ప్రజలు సంపూర్ణంగా మద్దతు తెలుపుతుంటే కేంద్రానికి వచ్చిన ఇబ్బందేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిసి వర్గాల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ వారికి సమాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాతనిధ్యంలో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షలను మనోభావాలను కేంద్రం గుర్తించకుండా బిసి వర్గాల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం పైన ఉన్నదని స్పష్టం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జిఒతో పాటు స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణ మీద ఉన్న హైకోర్టుస్టే విధించడంతో రిజర్వేషన్ల అమలు స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిసిల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి ఆప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించి బిల్లుకు ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని, లేదం టే ఉద్యమాల ద్వారా కేంద్రానికి కునుకు లేకుం డా చేస్తామని హెచ్చరించారు. శనివారం జరిగే బంద్, నిరసన ఉద్యమాల ద్వారా కేంద్రానికి తెలంగాణ ప్రజల ఐఖ్యత, పోరాట సత్తాను చవిచూపించాలని పిలుపునిచ్చారు. ధీటి లక్ష్మి పతి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో పార్టీలు, బిసి మైనార్టీ సమాజిక, జర్నలిస్టు సంఘాల నాయకులు కంచర్ల జమలయ్య, గొల్లపల్లి దయానంద్, రజాక్, అనుదీప్, కాసుల వెంకట్, వంగ వెంకట్, మద్దెల శివకుమార్, జక్కుల రాములు, యూసుఫ్ అబీద్, కురుమెళ్ల శంకర్, భూపతి శ్రీను, కోడి లింగయ్య, డి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## బిసి బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి

### ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపిలు బిసి బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి చేయాలని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల సాధనకు వివిధ బసి సంఘాలతో ఏర్పడిన బిసి ఐక్య కార్యాచరణ కమిటీ బంద్ ఫర్ జస్టిస్ పేరుతో 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. శుక్రవారం పట్టణంలో జరిగిన రాష్ట్ర బంద్ సమాయత్తం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏమాత్రం తగదన్నారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాల ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికీ దాటిపోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరిమితిలోగా ఆమోదం లభించకపోతే నోటిపై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ఉండడంతోనే రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలన్నారు.



## టైం స్కేల్ కార్మికుల కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఉద్యాన కళాశాల ఖాళీ సంబంధిత పోస్టులలో ప్రభుత్వ జిఒ ప్రకారం టైం స్కేల్ కార్మికుల కుటుంబాలకు అవకాశం కల్పించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారధిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. టైంస్కేల్ కార్మికుల కుటుంబాలకు అవకాశం కల్పించకుండా ఇష్టారీతిన జరిగిన నియామకాలను నిరసిస్తూ టైమ్ స్కేల్ ఉద్యోగులు, కార్మికులు జిల్లా కేంద్రంలోని ఉద్యాన కళాశాల ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈసందర్భంగా అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లుగా పనిచేస్తున్న టైం స్కేల్ కార్మికులను వదిలి ప్రభుత్వ జిఒకు వ్యతిరేకంగా పోస్టులను భర్తీ చేయడం తగదన్నారు. టైం స్కేల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వయోపరిమితి 61సంవత్సరాల వరకు వర్తింపజేయాలని, సహజ మరణం పొందిన వారికి పది లక్షల రూపాయలు అందజేయాలని, గ్రాట్యూటీ రూ.మూడు లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆందోళనలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, నాయకులు వెలుగు శ్రావణ్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, బానోతు లింగ్యానాయక్, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, శ్రీరాములు, ఇమామ్, హుస్సేన్, షరీఫ్, వెంకన్న, ఎల్లయ్య, సూరయ్య, మెహబూబి, ఐలమ్మ, ఎల్లమ్మ, యాకమ్మ, కతీజ, కళమ్మ, వేణు, ఉపేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## వాడవాడలా శతాబ్ది ఉత్సవాల ప్రచారం

### భారీ బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలి

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభకు సంబంధించి పార్టీ క్యాడర్‌ను సిద్ధం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ఖమ్మం నగరంలోని ప్రతి ఇంటికి శతాబ్ది ఉత్సవాల సందేశాన్ని అందించాలన్నారు. సిపిఐ నగర సమితి సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో అనేక పోరాట విజయాలు ఉన్నాయని వాటన్నింటిని నేటి తరానికి తెలియజేయాల్సి ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో మహోత్తర పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ వేదికగా నిలిచిందని నాటి సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటం నుంచి నిన్న మొన్నటి తెలంగాణ ఉద్యమం ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం వరకు కమ్యూనిసు పార్టీ ప్రజల పక్షాన నిలిచిందన్నారు. ఖమ్మం జిల్లాలో గ్రామ గ్రామాన సిపిఐ పోరాట గుర్తులు ఉన్నాయని యావత్ చరిత్రను నేటితరానికి తెలియజేసే లక్ష్యంతో శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, సైదా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 26 సభ చరిత్రలో నిలిచిపోవాలి

**చింతకాని :** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం చింతకాని మండల సిపిఐ మండల సమితి సమావేశం చాట్ల రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని ఈసభకు వచ్చే విధంగా ఉత్తేజపరచాలన్నారు. కవాతు దళాలను, మహిళలను, రెడ్ షర్ట్ వలంటీర్లను చింతకాని మండలం నుంచి భారీగా తరలించాలన్నారు. పార్టీ వందేళ్ల పండుగను ప్రతి ఇంటి పండుగగా భావించే విధంగా గ్రామల్లో వాల్‌రైటింగ్, ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, కూచిపుడి రవి, దూసరి శ్రీరాములు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు దొబ్బల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## సిపిఐ సీనియర్ నాయకులు ఎల్లు రామయ్య మృతి

**ప్రజాపక్షం/మణుగూరు:** మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు ఎల్లు రామయ్య (60) శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు మండల, పట్టణ కార్యదర్శి జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, ఎడారి రమేష్, ఎస్ కె సర్వర్, ఆధర్ల రాములు, పులి గల రమేష్, నోముల రవి, శాఖ కార్యదర్శి లక్ష్మి రెడ్డి, యాకూబ్, కొత్తపల్లి సీతారాములు తదితరులు హాజరై రామయ్య పార్థివదేహంపై ఎర్ర జెండా కప్పి పూలమాలవేసి, రామయ్య అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



## ఎల్ఓసి చెక్కు అందించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థినికి వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసి చెక్కును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు. శుక్రవారం వీడియోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని శ్లోకకు లక్ష రూపాయల ఎల్‌వోసి చెక్కును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు. ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని పి.శ్లోక ఐదేండ్లుగా ఎముకలకు వచ్చిన ట్యూమర్ కారణంగా ఇబ్బందులు పడుతుంది. ఇప్పటికే ఎడమ చేయి తొలగించగా వెన్నెముక సర్జరీ కూడా జరిగింది. ప్రస్తుతం ఊపిరితిత్తుల్లో కూడా ట్యూమర్ ఏర్పడింది. తండ్రి కూడా లేని శ్లోకకు ఆర్థిక సాయం చేయాలంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శ్లోక కుటుంబ సభ్యులు కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లక్ష రూపాయల ఎల్‌వోసి చెక్కును మంజూరు చేయించారు. కృత్రిమ చేయి ఏర్పాటుతో పాటు శ్లోక పై చదువుల విషయంలో కూడా సాయం అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ప్రస్తుతం శ్లోక ఖమ్మంలోని సాహితి కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ బిసిలకు 42% రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చిన నేపధ్యంలో వైరా రింగు రోడ్డు సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మనుద గ్ధం చేశారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట ప్రభుత్వం రాష్టలో కుల గణన చేసి 57%గా ఉన్న బిసిలకు 42% రిజర్వేషన్లు ఉండాలని తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి గవర్నర్ ఆమోదంకు జీవో నెంబర్ 9ని పంపించి మూడు నెలల కాలం అవుతున్న కాలయాపన చేస్తున్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు మచ్చా మణి, డివిజన్ కమిటీ సభ్యులు తూము సుధాకర్, తోట నాగేశ్వరరావు, వైరా రూరల్ మండల నాయకులు బాజోజి రమణ, పట్టణ నాయకులు కొంగర సుధాకర్,సాంబశివరావు,కృష్ణారావు, మల్లెంపాటి రామారావు, కామినేని రవి, నర్సింహారావు, మురళి పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కపాస్ కిసాన్ యాప్‌పై పత్తి రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిధిలోని రాంక్యాతండా గ్రామంలో పత్తి పంటలను ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి విక్రయానికి సంబంధించి రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్ బుకింగ్ ఆధారంగా ఆ తేదీన సమీపంలోని జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆధార్, ఫోన్ నెంబర్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. మొక్కజొన్న పండించే రైతులు రిజిస్టర్ కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలను తీసుకోవాలని సూచించారు. విత్తనాలు తీసుకునే ముందు కంపెనీ ద్వారా బాండ్ తీసుకోవాలన్నారు. నకిలీ కంపెనీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వి. సాయివేదవ్యాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బిసి రిజర్వేషన్ 42 శాతం అమలు చేయాలని కోరుతూ నేడు తలపెట్టిన బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వరక అజిత్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంద్‌లో జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందంగా పాల్గొంటారని చెప్పారు. బిసి రిజర్వేషన్ సాధనకు తెలంగాణ ఉధ్యమ తరహాలో ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలన్నారు. రిజర్వేషన్ అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.బిజేపి కులతత్వ మనువాద పార్టీ అయినందున కుల వ్యవస్థలో అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుతుందని ఆరోపించారు. బిసిల పట్ల బిజేపికి చిత్తశుద్ధి ఉంటే 9వషెడ్యూల్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఇనపల్లి పవన్ సాయి నాయకులు మంజుల, కవిత, లాస్య, మహేష్, నవీన్, దేవేందర్ పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలన ద్వారా మెరుగైన జీవితం

### జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్

**ప్రజాపక్షం/పాల్వంచ :** పేదరిక నిర్మూలన ద్వారా మెరుగైన సమాజ స్థాపన జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం రాజేందర్ అన్నారు. శుక్రవారం పాల్వంచ మండలంలోని కుంటి నాగుల గూడెంలో జరిగిన నాయ్య అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యాతిధిగా పాల్గొన్నారు. నిరుద్యోగం, చదువు కోవాల్సిన వయస్సులో పనులకు వెళ్లడం వాంటి ప్రధాన కారణాలు పేదరికంను సూచిస్తాయని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించడం ద్వారా పేదరిక తగ్గించవచ్చని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరాలు, గ్రామాల్లో బాల్య వివాహాలు నిషేదించాలని కోరారు. పేదరిక తగ్గించడం కోసం మహిళలు డ్రాక్వా గ్రూపుల్లో చేరడంతో స్వయం సహాయక ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని తెలిపారు. న్యావాది మల్లేశ్వరరావు, పాల్వంచ టౌన్ ఎస్ఐ జీవన్ రాజ్, పారా లీగల్ వాలంటీర్స్ బాడీషా, భిక్షమయ్య, జానకిరామ్, వీరభద్రం, నాగమణి, గ్రామ పెద్దలు దశరాజు, రమేష్, మహిళలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### ఖమ్మంను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నగరంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్‌లో రూ. 3కోట్లతో నిర్మించనున్న బిసి బాలుర వసతి గృహ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ బిసి వసతి గృహ నూతన భవనం కోసం మూడు కోట్లు మంజూరు చేశామన్నారు. ఖమ్మం నగరంలో కూలిపోయే స్థితిలో ఉన్న మూడు సంక్షేమ హాస్టల్స్ నిర్మాణానికి ప్రభుత్వం తొమ్మిది కోట్లు మంజూరు చేసిందన్నారు. వసతి గృహ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి భవిష్యత్తులో పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు రా కుండా చూడాలన్నారు. ప్రజలు అంగీకరిస్తే బోనకల్ రోడ్డు వెడల్పు చేస్తామన్నారు. రోడ్డు విస్తరణతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఖమ్మం నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, చెత్తను డ్రైనేజీల్లో, రోడ్లపై వేయవద్దని సూచించారు. ఇంటి పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే రోగాల భారీనపడే అవకాశం ఉందని దీనితో అనవసరంగా ఆసుపత్రులకు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఖమ్మం నగరంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి శుద్ధి చేసిన త్రాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం రూ. 220 కోట్లు మంజూరు చేస్తామన్నారు. మనం కష్టపడి సంపాదించిన డబ్బు పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టాలని అనవసరంగా ఆసుపత్రుల పాలు చేయవద్దన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు, స్వామినారాయణ్ స్కూల్ కూడా త్వరలో ఖమ్మంలో రాబోతుందన్నారు. పేద విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ముఖ్యమంత్రి గురుకులాల డైట్ ఛార్జీలను, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడం జరిగిందన్నారు. నగరంలో రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలన్నారు. పావల నష్టపోతే ప్రజలకు రూపాయి వరకు పరిహారం అందిస్తూ ఆదుకుంటున్నామన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డివిజన్లలో విస్తరించాల్సిన రోడ్ల వివరాలను కార్పొరేటర్లు అందించాలన్నారు. భగవంతుని దయ ప్రజల ఆశీర్వాదంతో ఖమ్మం జిల్లాలో జరిగే అభివృద్ధి తనకు భాగస్వామ్యం వహించే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్ రోజ్‌లీనా, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఈఈలు రంజిత్, కృష్ణలాల్, సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ నెంబర్ వన్

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** దేశంలోనే ఆయిల్‌ఫామ్ సాగులో తెలంగాణను నెంబర్ స్థానంలో నిలుపుతానని, రాష్ట్రమంత ఆయిల్‌ఫామ్‌కు యోగ్యమైన భూములు 20లక్షల పైగా ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నారవారిగూడెంలోని ఆయిల్ ఫామ్ నర్సరీలో మొక్కల పెంపకంపై రైతులతో ముఖాముఖీ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జ్ఞానోడర్మా పామాయిల్ రైతులను తీవ్రం భాదిస్తుందని, 45లక్షల ఎకరాల పత్తి పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, మొక్కజొన్న రైతాంగం కూడా ఆశించిన లాభాలు పొందలేదని తెలిపారు. తెలంగాణలో 20లక్షల ఎకరాల పామాయిల్ సాగుకు అవకాశం ఉందని, కనీసం 10లక్షల ఎకరాల సాగు మా లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో మొత్తం పండించిన పామాయిల్ పంటని క్రషింగ్ చేసే సామార్ధ్యం సిద్ధిపేట ఫ్యాక్టరీకి ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు పామాయిల్ ఫ్యాక్టరీలు తెచ్చి ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేస్తామన్నారు. అశ్వారావుపేట హర్టికల్చర్‌లో ఉన్న 250 ఎకరాల్లో అన్ని రకాల పంటలు వేసి రైతులకు శాస్త్రీయ విధానాలు తెలియచేసే ఏర్పాటు చేయాలన్నారు. పామాయిల్ పెరిగే విధంగా ఇక్కడ మలేషియా వాతావరణం వచ్చిందని, భారతదేశం మొత్తం అశ్వారావుపేట వైపు చూసే రోజులు వస్తాయన్నారు. భవిష్యత్‌లో హైబ్రీడ్ పొట్టి విత్తనాలు, నాణ్యమైన విత్తనాలు అశ్వారావుపేట నర్సరీ నుండి బయటకు రావాలని, హర్టికల్చర్ విద్యార్థులను కూడా మలేషియా తీసుకెళ్లి అక్కడి వ్యవసాయ పద్ధతులను చూపించడం జరుగుతుందని తెలిపారు. అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ సాగుని ఇతర జిల్లాల రైతులు ఎలా చూస్తున్నారో రాబోయే రోజుల్లో తెలంగాణాన్ని ప్రపంచదేశాలు చూస్తాయని అన్నారు. పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ రాఘవ రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ వాసం రాధ, కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు, బండి భాస్కర్‌రావు, సుదర్శన్‌రావు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యా సంస్థలు బంద్

### వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిసి జెఎసి సంఘాల ఆధ్వర్యంలో బంద్ ఫర్ జస్టిస్ పేరుతో నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. బంద్‌కు మద్దతుగా నేడు విద్యా సంస్థల బంద్‌కు కూడా పిలుపునిస్తున్నాయని యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించాలని వారు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, జార్జిరెడ్డి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మందా సురేష్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని దానిని గవర్నర్, రాష్ట్రపతికి పంపిన ఆరు నెలలు గడుస్తున్నా ఆమోదించడం లేదన్నారు. 42 శాతం బిసి బిల్లు జీవోని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. ఎన్నికల్లో న్యాయం జరుగుతుందని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శివ, రాజు, అజయ్, గోపి, ఉపేందర్ పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యతనివ్వండి

### సమీక్షా సమావేశంలో భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని భవిష్యత్తులో మరింత వేగంగా సోలార్ ఉత్పత్తిని విస్తరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం, వరంగల్, ఉమ్మడి జిల్లాల విద్యుత్ శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన చర్యలు తీసుకునేందుకు ప్రతి సలహాను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అవసరమైన చోట సబ్ స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పెరుగుతున్న పారిశ్రామిక అవసరాల దృష్ట్యా 400 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. కొత్త పారిశ్రామిక పార్కులకు ప్రాధాన్యత నివ్వాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ప్రసారంలో అంతరాయాలను అరికట్టాలని, పొలంబాట కార్యక్రమం క్రింద క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పట్ల సానుకూలత కనబర్చాలని అధికారులకు సూచించారు. రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యం నెరవేరాలంటే విద్యుత్ శాఖ అత్యంత కీలకమైందని ఏ రంగం అభివృద్ధి చెందాలన్న ఇప్పుడు విద్యుత్‌తోనే ముడిపడి ఉందన్నారు. అత్యంత బాధ్యతతో పని చేయాల్సిన అవసరం ఉందని అలాగే విద్యుత్ అంబులెన్స్‌లను ట్రాన్స్‌ఫార్మర్ సహా అవసరమైన సామగ్రిని తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 1912 నెంబర్‌కు డయల్ చేసి విద్యుత్ సమస్యలు తెలియజేయవచ్చునని ఈ నెంబర్‌ను విరివిగా ప్రచారం చేయాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలకు సాగునీరు అందించేందుకు సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేయాలన్నారు.

## శాస్త్రీయ విద్యా విధానమే అంతిమ లక్ష్యం



**ప్రజాపక్షం/మణుగూరు:** శాస్త్రీయ విద్యా విధానమే అంతిమ లక్ష్యం అని, విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా విద్యార్థుల ఐక్యం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ పిలుపునిచ్చారు. 1936 ఆగస్టు 12 ఉత్తరప్రదేశ్‌లోని లక్నో బెనారస్ విశ్వవిద్యాలయంలో పొత్తిళ్ళలో పిడికిలి బిగించి దేశ స్వతంత్రం కోసం ఆనాడు విద్యార్థులను, యువకులను ఏకం చేస్తూ నేటి వరకు 90 వసంతాలను పూర్తి చేసుకున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)విద్యార్థి సంఘంలో విద్యార్థులు అందరూ భాగస్వాములై విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చదువుకునే ప్రతి ఒక విద్యార్థి ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాలు స్వాతంత్ర్యం నాటి నుండి ఇప్పటివరకు చేసిన పోరాటా త్యాగల స్ఫూర్తితోటి రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం విద్యార్థులు వారి పాత్ర పోషించాలని లక్ష్యం తోటి ఏఐఎస్ఎఫ్ రాజకీయ లక్ష్యాలను విద్యార్థులకు చూపిస్తుందని అన్నారు. కార్పొరేట్ ప్రైవేటీకరణ మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వి ద్యా వ్యతిరేక విధానాల పై విద్యార్థులు సంఘటితం కావాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం తీసుకోవడం అంటే ఈ జిల్లాలో, ఈ రాష్ట్రంలో, దేశంలో ఒక ప్రధానమైన పాత్ర విద్యార్థులు పోషించే విధంగా ఏఐఎస్ఎఫ్ చేసే పోరాటాలను విద్యార్థులే హక్కును చేర్చుకోవాలని శాస్త్రీయ విద్యా విధానానికై కృషి చేయాలని అన్నారు.

## సాయిరాంకు ఉత్తమ ఆసుపత్రి అవార్డు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని సాయిరాం ఆసుపత్రికి ఉత్తమ ఆసుపత్రిగా అవార్డు లభించింది. ప్రముఖ మీడియా సంస్థ హైబిజ్ టివి హైదరాబాద్ వారు నిర్వహించిన ఐదవ ఎడిషన్ హెల్త్ కేర్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో ఖమ్మం సాయిరాం ఆసుపత్రిని బెస్ట్ ఎమర్జింగ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అవార్డుతో సత్కరించారు. సాయిరాం ఆసుపత్రి అత్యుత్తమ వైద్య సేవలతో పాటు క్లిష్టతరమైన వైద్య సేవలు కూడా అందించడంతో పాటు అత్యాధునీక సౌకర్యాలతో రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డును అందజేశారు. హైదరాబాద్ హెచ్ఐసిసి నోవటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా సాయిరాం ఆసుపత్రి ఛైర్‌పర్సన్, డయాబెటిక్ స్పెషలిస్ట్ డాక్టర్ స్వాతి జంగాల, మేనేజింగ్ డైరెక్టర్ గోల్డ్ మెడలిస్ట్, ప్రముఖ వైద్యులు సునీల్ కుమార్ జంగాల అందుకున్నారు. గత 15 సంవత్సరాలుగా ఖమ్మం పరిసర జిల్లాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. సాయిరాం ఆసుపత్రి విశిష్ట గుర్తింపు పొందిందన్నారు.

## విత్తన మొక్కజొన్న రైతులు జాగ్రత్తగా ఉండాలి

### వ్యవసాయ అధికారి నయాన్ మంజుఖాన్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం ఖానాపురం గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు విత్తన మొక్కజొన్న సాగు చేయు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నయాన్ మంజుఖాన్ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు ఆయా ఏజెంట్ల నుండి రకరకాల కంపెనీల నిర్వాహకులు గ్రామాలకు వచ్చి మా విత్తనాలు తీసుకొని చెబుతారు. అలాంటి సందర్భంలో విత్తనాలు తీసుకునే రైతులు ఇచ్చే కంపెకనీల నుండి అగ్రిమెంట్ పత్రం తీసుకోవాలని తెలిపారు. లోకల్‌లో తెలిసిన వారని విత్తనాలు తీసుకొని మోసపోవద్దని తెలిపారు. విత్తన కొట్టుకు వెళ్లినప్పుడు కూడా విత్తనాలకు బిల్లు తీసుకోవాలని అన్నారు. కిసాన్ రైతు యాప్‌ను పత్తి సాగు చేసే రైతులు ఉపయోగించుకొని అవగాహన కల్పించుకోవాలి. సిసిఐ పత్తి అమ్మకాలకు కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని, పంటల సర్వే నిర్వహించినప్పుడు ఇచ్చిన మొబైల్ నెంబర్‌ను వాడుకలో ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు.

## ఆకట్టుకుంటున్న ప్రో కబడ్డీ

### పాత బాటలోనే తెలుగు టైటాన్స్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రో కబడ్డీ సీజన్ అభిమానులను బాగా ఆకట్టుకుంది. గతానికి భిన్నంగా జట్లు హోరాహోరీ పోరాడుతున్నాయి. ఏ జట్టు ఓటమిని అంత తేలికగా అంగీకరించకుండా ఆఖరి సెకను వరకు పోరాడుతున్నాయి. కొం దరు జూనియర్ ఆటగాళ్లు అసమాన ప్రతిభ చూపుతున్నారు. రైడింగ్‌లోనూ, డిఫెన్స్‌లోనూ అన్ని జట్లు అదరగొడుతున్నాయి. భారతదేశపు గ్రామీణ క్రీడగా పేరొంది మరుగున పడిపోతున్న దశలో కబడ్డీకి ప్రో కబడ్డీ లీగ్ మళ్లీ ప్రాణం పోసింది. ప్రోకబడ్డీ టివిలు, ఇతర ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా ద్వారా బాగా ప్రాచుర్యం పొందింది. ప్రోకబడ్డీ ప్రసార వేళకు కబడ్డీ అభిమానులు టివిలకు అతుక్కుపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు తొలి ఆరు స్థానాల్లో వరుసగా పుణేరి పల్టాన్, దబాగ్ దిల్లీ, తెలుగు టైటాన్స్, బెంగళూరు బుల్స్, హర్యానా స్టీలర్స్, యు ముంబా జట్లు ఉన్నాయి. టాప్ రైడర్‌గా బెంగాల్ వారియర్స్ ఆటగాడు దేవాంగ్ దలాల్ ఉన్నారు. దేవాంగ్ దలాల్ అద్భుత ఆటతీరు కనబరుస్తున్న ఆ జట్టు తొలి ఆరు స్థానాల్లో స్థానం దక్కించుకోలేకపోయింది. కొందరు డిఫెండర్లు మ్యాచ్ ఫలితాలు శాసిస్తున్నారు. తెలుగు ఆటగాళ్లు లేకపోయినా తెలుగు టైటాన్స్ అన్న పేరుతోనే తెలుగు ప్రేక్షకుల అభిమాన జట్టుగా మారింది. గత 11 సీజన్లలో ఒక్కసారి కూడా ఫైనల్ వరకు చేరలేదు. ప్రతిభ కలిగిన అనేక మంది ఆటగాళ్లు ఉన్న సమిష్టిగా రాణించడంలో విఫలమయ్యారు. ప్రో కబడ్డీతో స్టార్‌డమ్ సంపాదించుకున్న రా హుల్ చౌదరి తెలుగు టైటాన్స్‌కు ప్రాతినిథ్యంవహించిన వాడే. పవన్ షెరావత్ కూడా తెలుగు టై టాన్స్‌కు ప్రాతినిథ్యం వహించిన ఆశించిన ఫలి తం దక్కలేదు. వరుసగా ఐదు విజయాలు అందుకోవడం విజయ్‌మాలిక్, భరత్ హుడా రైడింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ పాయింట్లు సాధిస్తుండడంతో టైటాన్స్‌పై అంచనాలు పెరిగాయి. కానీ చివరి రెండు మ్యాచులలో టైటాన్స్ ఆటతీ రు చూసిన తర్వాత పాత కథే పునరావృతం అవుతుందా అన్న భావన కలుగక మానదు. బెంగాల్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చేతిలోకి వచ్చిన మ్యాచ్‌ను చేజార్చుకుని ట్రైబేకార్ దాకా తీసుకువచ్చుకున్నారు. అక్కడ ఓటమి తప్పలేదు. ఒక్కసారి అత్యుత్తమ డిఫెన్స్ జట్టుగా కనిపించే టైటాన్స్ ఒక్కోసారి చిన్నపిల్లల మాదిరి పోయే రైడర్‌కు పాయింట్లు ఇచ్చి పంపుతున్నారు. ఆ డిఫెడింగ్ వైఫల్యాలే జట్టు ఓటమికి కారణమవుతుంది. గురువారం రాత్రి యుముంబా తో జరిగిన మ్యాచ్‌లో రైడర్లు, డిఫెండర్లు వైఫల్యం కావడంతో మరో ఓటమి తప్పలేదు. భరత్‌హుడా వెళ్లిన ప్రతిసారి యు ముంబా డిఫెండర్లు సునాయాసంగా పట్టుకుని భరత్‌ను నిలువరించారు. విజయ్‌మాలిక్‌ది సైతం అదే పరిస్థితి. స మిష్టితత్వం గడిచిన రెండు మ్యాచులలో కొరవడింది. ఇదే ఆటతీరు కనబరిస్తే ఇప్పుడు ఉన్న మూడో స్థానం నుంచి ఏకబాకడం కాదు కదా పడిపోయే అవకాశం కూడా ఉంది. తస్మాత్ జాగ్రత్త.

## వైద్య ఆరోగ్యశాఖలో శ్రమ దోపిడీ

### కలెక్టరేట్ వద్ద ఆందోళన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వైద్య ఆరోగ్య శాఖ, కు టుంబ సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించి శ్రమ దోపిడీ పెరిగిపోతుందని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తెలిపారు. నిర్బంధ పనిని నే రంగా పరిగణించాల్సి వస్తుందని అధికార యం త్రాంగం ప్రజాప్రతినిధులు గుర్తించాలని ఆయన కోరారు. శుక్రవారం ఏఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్‌సిడిని రద్దు చేయాలని దీని కారణంగా ఏఎన్ఎం లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నా రు. రక రకాల మొబైల్ అప్లికేషన్స్‌ను తీసుకు వచ్చారని ఇందులో కొన్ని అర్ధరాత్రి సమయంలో మాత్రమే పని చేస్తున్నాయని అప్పుడు అప్‌లోడ్ చేయడం తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆ రోగ్య పరిస్థితులను తెలుసుకోవడానికి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడం, మెరుగైన ఆరోగ్య సూచనలు అందించడానికి, చిన్న పిల్లలకు టీకాలు వేయడానికి ఏఎన్ఎంలను నియమించారన్నారు. కానీ మారుతున్న ప రిస్థితుల రీత్యా కొంత కాలంగా వారు చేస్తున్న పనులకు సంబంధించి ఆన్‌లైన్ విధానాన్ని తీసు కు వచ్చారని రెండు యాప్‌లతో ప్రారంభమైన ఆన్‌లైన్ పద్ధతి ఇప్పుడు 14 మొబైల్ అప్లికేషన్స్‌ను పూర్తి చేయాల్సి రావడం ఇబ్బందికరంగా మారిందన్నారు. మానసిక ఒత్తిడిలో ఏఎన్ఎంలు అనారోగ్యానికి గురవుతున్నారని ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచన చేసి ఈ ఆన్‌లైన్ యాప్‌ల విధానానికి స్వస్తి పలకాలన్నారు. ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి, నాగమణి, సరస్వతి, రచ్చా సీత, విజయశ్రీ, దివ్య, ఫాతిమా, సంధ్య, రత్నమాల, మమత, లక్ష్మి, రెండవ ఏఎన్ఎంలు జయమ్మ, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, శోభ, సుగుణ, మంగమ్మ, మరియమ్మ, అరుణ, భవాని, మాణిక్యమ్మ, ఆదిలక్ష్మి, స్నేహ, మేరీ, గీత, వసంత పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్



## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిల ఆదేశానుసారం శుక్రవారం మండలంలోని అయ్యంగారిపల్లి, కోతుల బాద, దుబ్బ తండ (ఎస్సీ) లక్ష్మీ నారాయణ పురం, మైలారం, ముత్తారం గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మంజుల, భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐకెపి సిబ్బంది, నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు విద్యా ఉద్యోగ స్థానిక సంస్థలలో కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం జరుపుతున్న రాష్ట్ర బందును వ్యాపార వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ చేసి విజయవంతం చేయాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బిసి జెఎసి వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ చైర్మన్ వడ్డకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు బత్తిని సదానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో బంద్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన 42 శాతం బిసి రిజర్వేషన్ జీవోను రాష్ట్ర గవర్నర్ పెండింగ్ లో పెట్టడం బిసిలకు అన్యాయం చేయడం అన్నారు. ఈ సమావేశంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, రాష్ట్ర బిసి సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ బొనగాని యాదగిరి గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి, సిపిఐ జిల్లా నాయకులు బొట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భర్తను చీరతో ఉరివేసి చంపిన భార్యకు రిమాండ్

నలుగురు పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగింత



**ప్రజాపక్షం/ధర్మసాగర్:** హనుమకోండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని పెద్ద పెండ్యాల గ్రామంలో గురువారం విషాద సంఘటన చోటుచేసుకుంది భర్తను భర్తను చీరతో ఉరివేసి చంపిన భార్యను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. పోలీసులు తెలిపిన వివారాల ప్రకారం పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన రాజారపు ఆశోక్35భార్య యాదలక్ష్మి దంపతులకు తరచూ కుటుంబ కలహాలు జరుగుతుండేవి ఈక్రమంలో ఇటీవల జరిగిన వాగ్వాదంలో ఆవేశానికి లోనైన యాదలక్ష్మి తన భర్తను ఉరివేసి చంపినట్లు పోలీస్‌లు తెలిపారు. సమాచారం అందుకున్న ధర్మసాగర్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నిందితురాలు యాదలక్ష్మిని శుక్రవారం రిమాండ్‌కు తరలించి నలుగు చిన్న పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటికి అప్పగించారని తెలిపారు. కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,భార్యభర్తల మధ్య విభేదాలు రావడం సహజం కాని హింస సమస్యకు పరిష్కారం కాదు అని ఇలాంటి దారుణ సంఘటనలు కుటుంభాలను చిద్రము చేస్తున్నాయని అన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సబ్బండ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం రోజున హన్మకొండ డిసిసి భవన్ లో హన్మకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల తో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిలుగా ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్, టిపిసిసి అబ్జర్వర్ సునీత, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలోకి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పారదర్శకంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పార్టీ కోసం నిజాయితీగా కష్టపడి పనిచేసిన అర్హులకు అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు.. ఈ సందర్భంగా టిపిసిసి అబ్జర్వర్ సునీత మాట్లాడుతూ ప్రజలలోనుండి ప్రజానాయకులను ఎంపిక చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన ల క్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్ష ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, మండల, పట్టణ డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఫ్రంటల్ ఆర్గనైజర్స్ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసి, మాజీ కౌన్సిలర్లు,వార్డు, గ్రామ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం చెక్ పోస్ట్ వద్ద పోలీసుల విస్తృత తనిఖీలు

**ప్రజాపక్షం/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం కాటారం డిఎస్పి సూర్య నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక విస్తృత తనిఖీలు చేపట్టారు. తెలంగాణామహారాష్ట్ర ప్రాంతాల నుండి రాకపోకలు కొనసాగించే వాహనాలను పరిశీలించి సరియైన ధృవ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్ఐ తమాషా రెడ్డి, కాళేశ్వరం ఎస్ఐ 2 భగవత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఆరోగ్య తెలంగాణ' ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఆరోగ్య తెలంగాణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాస ముగింపు ఉత్సవాలలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. తల్లి ఆరోగ్యమే బిడ్డకు శ్రేష్టమైనదని, పోషణ మాసంలో రాష్ట్ర స్థాయిలో మన జిల్లాకు 4వ స్థానం లభించడం పట్ల మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బందిని అభినందించారు. చిన్నారుల వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే బాధ్యత అంగన్వాడీ సిబ్బందిపై ఉందని తెలిపారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి అత్యంత శ్రేయస్కరమని, ఆహార అలవాట్లపై మహిళల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. గర్భిణీలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు తగిన ఆహారం, పోషకాహారం గురించి విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. సంక్షేమ కార్యక్రమాల్లో భూపాలపల్లి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు నెల రోజుల పాటు నిర్వహించిన పోషణ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించి, వారిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇలాంటి పిల్లల ఆరోగ్య పరిరక్షణపై అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ క్రమంలో చిన్నారులకు బాలామృతం, న్యూట్రిషన్ కిట్లను అందించడంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల అభివృద్ధి కేంద్రాలుగా, ప్రీ స్కూల్ల తరహాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డిఇఓ రాజేందర్, మెప్మా పిడి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంపై ఒత్తిడి చేద్దాం.. రిజర్వేషన్లు సాధించుకుందాం?

వామపక్ష నేతలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి రిజర్వేషన్లు సాధించుకుందామని వామపక్ష నేతలు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, గౌని ఐలయ్య, చిన్నచంద్రన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా సిపిఐ కార్యాలయంలో శుక్రవారం వామపక్ష పార్టీలు, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు మాట్లాడుతూ శనివారం జరిగే బంద్ లో బిసి బిడ్డలంతా పాల్గొని బిజెపి ప్రభుత్వాన్ని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బిసి రిజర్వేషన్ల బిల్లు సాధించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు మోడీ వద్దకు వెళ్ళే ధైర్యం లేక బిసిలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తీర్మానం చేసి పంపినా ఆర్టికల్ 9లో పెట్టి బిసిలకు 42శాతం రిజర్వేషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానం చేసి పంపిన ఆర్టికల్ 9లో పెట్టి బిసిలకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. శనివారం జరిగే బంద్ లో బిసి బిడ్డలంతా ముక్తకంఠంతో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. మానుకోట జిల్లా కేంద్రంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా బంద్ కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వామపక్షాల నేతలు బి అజయ్‌సారథిరెడ్డి, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, దుడ్డెల రామ్మూర్తి, సూర్యం, వరిపెట్టి వెంకన్న, గుజ్జు దేవేందర్,నందగిరి వెంకటేశ్వర్లు, చైతన్య, మధు పాల్గొన్నారు.

## కెజిబివిని తనిఖీ చేసిన కలెక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ఖానాపూర్:**వరంగల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కెజిబివి)లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్, వంట గది, స్టోర్ రూమ్ భోజనానికి వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భోజన నాణ్యతను పరిశీలించి, కూరల రుచిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూను ఖచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరపై ఆరా తీశారు. కెజిబివిలో విద్యార్థుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించడంలో భాగంగా ఏర్పాటు చేసిన తలుపులు, ఇనుప గ్రిల్స్, టాయిలెట్ల మరమ్మత్తులను, ఆరో ప్లాంట్, కిచెన్ రూఫ్ తదితర పూర్తయిన పనులను కలె కలెక్టర్ పరిశీలించారు. కోతులు వస్తున్నాయని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కోతులు రాకుండా వెంటనే మెష్ ఏర్పాటు చేయాలని డిఈను ఆదేశించారు. వారంలో ఒక రోజు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ డేగా నిర్ణయించి ఆ రోజు పిల్లలతో అదే భాష రోజు మొత్తం మాట్లాడించాలని దీనితో వారి వకాబులరీ పెరుగుతుందన్నారు. విద్యార్థులతో ముచ్చటించి వారి పఠన సామర్థ్యాన్ని తె లుసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులకు ఏమన్నా సమస్యలు ఉంటే ఏర్పాటుచేసిన కంప్లైంట్ బాక్స్ లో వేయాలన్నారు. క్రీడల కొరకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో కోర్టులు కావాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దారు రమేష్, టిఈడబ్ల్యుఐడిసి డిఈ అశోక్, జిఈసిఓ ఫ్లోరెన్స్, ఎంఈఓ శ్రీ దేవి, స్పెషల్ ఆఫీసర్ మేనక, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం /జనగామ:** పోషక ఆహార నియమాలు పాటించి ఆరోగ్యకరమైన జీవనశైలికి అలవాటు పడాలని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం జనగామలోని ఎన్ఎంఆర్ గార్డెన్‌లో పోషణ మాసం ముగింపు సమావేశాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సంర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుండి ప్రసవం వరకు, ఆ తరువాత వైద్య పరంగానే కాకుండా పోషణ పరంగా ప్రభుత్వం శ్రద్ధ చూపుతుందన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో ప్రతిరోజు కోడిగుడ్లు పాలు, ఇస్తున్నారని, వాటి ద్వారా కడుపులో బిడ్డలకు పోషకాహారం అందిస్తున్నారన్నారు. ప్రతి బిడ్డకు కనీసం మూడు సంవత్సరాల వ్యత్యాసం ఉండాలని, గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలోని పాలు, గుడ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, మహిళలు, కిషోర బాలికలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోషణ మాసం నిర్వయిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్య జీవనానికి కావాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మహిళలు, గర్భిణీల శిశువుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఈ విషయంలో హెల్త్ జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. రక్తహీన లేకుండా చూడడంలో మరింత దృష్టి పెట్టాలని, గర్భిణీలకు ఇస్తున్న ఆహారాన్ని వారు మాత్రమే తినాలని, ఇతురులు వినియోగం చేసుకోవద్దని, నిర్ణీత గడువలోపు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న చిన్న పిల్లలను చూసుకోవడంలో అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి గర్భిణీలకు శ్రీమంతం నిర్వయించారు. ఐరన్, కాల్షియం, టాబ్లెట్స్ పంపిణీ చేశారు. అనంతరం స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ గోపిరాం, జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మల్లికార్జున్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, పోషన అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యశాఖ కార్యాలయంలో ఎసిబి దాడులు

రూ. 50వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన డిఎఫ్ఒ, ఫీల్డ్ ఆఫీసర్



**ప్రజాపక్షం/హన్మకొండ:** హనుమకొండ జిల్లాలోని మత్స్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ఎసిబి అధికారులు రైడ్ చేసారు. ఓ సొసైటీ నుంచి 50 వేలు లంచం తీసుకుంటూ ఫీల్డ్ ఆఫీసర్ హరీష్ ఎసిబి అధికారులకు చిక్కాడు.జిల్లా అధికారిణి, డిఎఫ్ఓ నాగమణి ఆదేశాల మేరకు లంచం డిమాండ్ చేసినట్లు హరీష్ ఒప్పుకున్నాడు. దీంతో ఇద్దరిని శనివారం ఎసిబి కోర్ట్ లో హాజరు పరచనున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎసిబి డిఎస్పి సాంబయ్య మాట్లాడుతూ నూతన సభ్యుల నియామకం కోసం ఓ సొసైటీ నుండి మత్స్యశాఖ జిల్లా అధికారిణి ఆదేశాల మేరకు ఫీల్డ్ ఆఫీసర్ హరీష్ డబ్బులు తీసుకున్నట్లు ఒప్పుకున్నాడని, వారి నుండి రూ. 50 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే ఇద్దరినీ తాము అదుపులోకి తీసికున్నామని, వారిని ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.ఈ తనిఖీలలో ఎసిబి సిఐలు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. ఎవరైనాఅధికారులు, ప్రభుత్వఉద్యోగులు పనికి లంచం డిమాండ్ చేస్తే తమకుసమాచారము అందించాలని సూచించారు. బాధితుల కోసం తమ ఎసిబి ఆఫీసు నిరంతరము పని చేస్తుందని తెలిపారు.

## హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సిపి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం హసన్ పర్తి పోలీస్ స్టేషన్ ను తొలి సారిగా సందర్శించారు. ఈ సందర్బంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, హసన్ పర్తి ఇన్స్ స్పెక్టర్ చేరాలు పోలీస్ కమిషనర్ కు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ పరిధిలో లోని గ్రామాలు, ఎలాంటి ఫిర్యాదులు అధికంగా నమోదవుతాయి. నేరాల నేరాల నియంత్రణకై తీసుకుంటున్న చర్యలు, రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తుల వివరాలతో పాటు స్టేషన్ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై సీపీ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు, హన్మకొండ కరీంనగర్ ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకై తీసుకుంటున్న చర్యలపై సీపీ ఆరా తీశారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బాధితులకు పారదర్శకంగా న్యాయం అందించాలని, నీతి, నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలు అభిమానాన్ని పొందాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

# కేంద్రంపై ఒత్తిడి చేసి రిజర్వేషన్లు సాధించుకుందాం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్




**ప్రజాపక్షం/ నర్సంపేట :** బిసి రిజర్వేషన్ సాధనకు నేడు జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని సిపిఎం ఆఫీసులో సిపిఎం మండల కార్యదర్శి కోరబోయిన కుమార స్వామి అధ్యక్షతన సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, బిసి సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 42శాతం రిజర్వేషన్ సాధన కోసం రేపు జరిగే బంద్‌లో ప్రజలు వ్యాపారవర్గాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బిసిలకు తీసుకువచ్చిన 42శాతం రిజర్వేషన్ చట్టాన్ని రాష్ట్రపతి ఆమోదించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుపడుతూ బిసిలకు రావాల్సిన న్యాయమైన వాటలకు అన్యాయం కల్పిస్తుందన్నారు. ఈ బంద్ ద్వారా బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు ద్యాగల శ్రీనివాస్, సిపిఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నర్సంపేట మండల అధ్యక్షులు కత్తి కిరణ్‌కుమార్, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు చింతకింద కుమార స్వామి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గజ్జి రాజు, సిపిఎం నాయకులు బాలకృష్ణ, పాత్కల సుధాకర్, జినుకల సుదర్శన్, నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు.

**బిసి రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో...**

42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ నేడు జరగబోయే తెలంగాణ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక వరంగల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ అన్నారు. బంద్‌లో ప్రతి ఒక్కరు స్వచ్ఛంద పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకృష్ణ, మహిళా నాయకురాలు ములుక ఇందిరా, వరంగల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొక్కు అశోక్ ముదిరాజ్, గుల్లపెల్లి సుధాకర్, పెంచాలా యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల సాధనకు పోరు

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** బిసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఆధిపత్య కులాల కుట్రలను నిరసిస్తూ (నేడు)శనివారం జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు చైతన్యవంతులై సకల రంగాలలో మేమెంతో మాకంతా నాదంతో పోరాటాలు చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం స్థానిక సంస్థలలో విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపిస్తే మోదీ ప్రభుత్వం ఆమోదించకపోవడం బిసిలను అవమాన పరచడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ జీవో నంబర్ 9 పై ఆధిపత్య కులాలవారు హైకోర్టులో పిటిషన్ వేసి అడ్డుకోవడం దుర్మార్గమని, ఇంకెంతో కాలం వారి కుట్రలు సాగవని హెచ్చరించారు. బిసి బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చకుండా కేంద్ర ప్రభుత్వం బిసిలకు ద్రోహం తలపెట్టిందన్నారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లు బిజెపి బలపరుస్తూ కేంద్రంలో వ్యతిరేకించడం బిసిలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల, బిసి సంఘాల ప్రతినిధులతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విఫలమైందన్నారు. బిసి రిజర్వేషన్ సాధనకై బిసిలు ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడి పోరాడతారని, శనివారం జరిగే బంద్ ఆరంభం మాత్రమే, హక్కులు సాధించేదాకా బిసిల పోరాటాలు ఉధృతంగా సాగుతాయని హెచ్చరించారు. వ్యాపార వాణిజ్య విద్యా సంస్థలు విద్యార్థి యువకులు మేధావులు అన్ని వర్గాల ప్రజలు బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

## సామాజిక చైతన్యం కాంక్షతో పేర్వారం రచనలు

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సమాజ చైతన్యాన్ని కాంక్షించి సమాజంలోని అనేక రుగ్మతలపై సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన గొప్ప మానవతావాది ఆచార్య పేర్వారం జగన్నాథం అని కేం ద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. గురువారం సాయంత్రం 6 గం,,లకు పి.ఆర్. రెడ్డి భవన్ లో పేర్వారం జగన్నాథం ఫౌండేషన్ కన్వీనర్ ఆచార్య బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన పేర్వారం జగన్నాథం 91వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా పేర్వారం జగన్నాథం స్మారక పురస్కారాలు అందజేశారు. 2023 సంవత్సరానికి డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, 2024 సంవత్సరానికి డాక్టర్ పెద్ది వెంకటయ్య, 2025 సంవత్సరానికి కవి పొట్లపల్లి శ్రీనివాసరావు గార్లకు శాలువా,సైటేషన్, పూలమాల తో పాటు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించారు.అనంతరం అంపశయ్య నవీన్ సంస్కారవంతమైన హృదయం నుంచే అద్భుతమైన సాహిత్యం ఉద్భవిస్తుందని అన్నారు.కవులు, రచయితలు సాహిత్య సమావేశాలు నిర్వహించుకోవడానికి కాళోజీ కళాక్షేత్రంలో మినీ హాల్ నిర్మించి కాళోజీ ఫౌండేషన్ కు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు.సమాజ పురోగమనానికి ఉపయోగపడే రచనలు అందించాలని కవులకు, రచయితలకు పిలుపునిచ్చారు. అనంతరం గౌరవ అతిథిగా హాజరైన ఇ.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి అత్యాధునిక సమాజంలో విలువలతో కూడిన జీవితాన్ని, మానవాత కాంక్ష ను ప్రతిబింబించే విధంగా సాహిత్యాన్ని సృజించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.విద్యార్థి, పేర్వారం శంకర్రావు, శ్రీనాథ్, లంకా శివరామ ప్రసాద్, గట్టు రాధికా, నిధి, అస్నాల శ్రీనివాస్, డాక్టర్ ఆగపాటి రాజ్ కుమార్, తదితరులు 100 మంది కవులు, రచయితలు పాల్గొన్నారు.

# రీల్

## తిలక్ వర్మను సన్మానించిన చిరు




ఇండియ టీం క్రికెటర్ తిలక్ వర్మను మెగాస్టార్ చిరంజీవి ఘనంగా సన్మానించారు. మన శంకర వరప్రసాద్ షూటింగ్ జరుపుకుంటున్న సెట్ లోకి తిలక్ వర్మను ఆహ్వానించారు. ఇటీవల జరిగిన ఇండియా పాకిస్తాన్ చాంపియన్ ట్రోఫీలో పాకిస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు తిలక్ వర్మ. ఇండియా టీం విజయానికి కారణమైన తిలక్ వర్మను చిరంజీవి తో పాటు టీం అందరూ అభినందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఇలాంటి ఆటగాడు మన గడ్డపై పుట్టడం గర్వకారణమని చిరంజీవి కొనియాడారు. తిలక్ వర్మ ప్రతిభను చిరంజీవి మెచ్చుకున్నారు. ఎంతో మంది యువతకు తిలక్ వర్మ ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.




## యాభై రోజుల్లో అఖండ తాండవం

నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న అఖండ సినిమా సీక్వెల్ అఖండ 2 తాండవం ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధం అవుతోంది. అఖండ సూపర్ హిట్ తరువాత బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న అఖండ 2 తాండవం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సరిగ్గా యాభై రోజుల తరువాత డిసెంబర్ 5వ తేదీన ఈ సినిమా జనం ముందుకు రానుంది. బాలయ్య సరసన ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో బాలకృష్ణ పూర్తిగా భక్తి పారవశ్యంతో కూడిన పాత్ర పోషిస్తున్నారు. అయితే ధర్మాన్ని కాపాడేందుకు బయలు దేరిన ఓ ముని ఏం చేశారు ఆనేది ఈ సినిమా కథ. ఫోర్టీన్ రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాను నందమూరి తేజస్విని సమర్పిస్తున్నారు. బోయపాటి, బాలకృష్ణ కాంబినేషన్‌లో ఇప్పటి వరకు వచ్చిన సినిమా ల్లో ఈ సినిమా భారీ బడ్జెట్ తో నిర్మించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం నమోదు చేసుకుంటుందని నిర్మాతలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

## 31న బాహుబలి ఎపిక్ విడుదల




ప్రభాస్ హీరోగా, రాజ మౌళి దర్శకత్వంలో వచ్చిన బాహుబలి సినిమా తెలుగు సినిమా రికార్డులను తిరగరాసింది. తెలుగు తెరపై బాహుబలి కొత్త చరిత్రను సృష్టించింది. బాహుబలికి ముందు, బాహుబలి తరువాత అనే స్థాయిలో తెలుగు సినిమా ఎదిగింది. ఈ సినిమాతో ప్రభాస్, రాజ మౌళి ఇద్దరికి కూడా ప్రపంచ వ్యాప్తంగా పేరు వచ్చింది. రెండు భాగాలుగా విడుదల అయిన బాహుబలి సినిమాను ఇప్పుడు ఒకే భాగం చేసి బాహుబలి ఎపిక్ పేరుతో విడుదల చేయనున్నారు. ఈనెల 31 తేదీన ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేస్తున్నారు. మూడు గంటల నలభై అయిదు నిమిషాల నివిడితో రూపొందించారు. సెన్సార్ పనులు కూడా పూర్తయ్యాయి. యు/ఏ సర్టిఫికెట్ వచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికాలో ప్రీమియం షోస్ వేస్తున్నారు. 107 షోలు వేస్తున్నారు. ప్రభాస్ సరసన తమన్నా హీరోయిన్ గా నటించిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, నాజర్ అత్యంత కీలకమైన పాత్రలను పోషించారు. ఇందులో రాణా దగ్గుబాటి విలన్ పాత్రలో కనిపిస్తారు. కట్టప్ప పాత్ర ఈ సినిమాలో ఎంతటి ఆసక్తిని పెంచిన విషయం తెలిసిందే. బాహుబలి సినిమా విడుదలై పదేళ్ళు అవుతున్న సందర్భంగా బాహుబలి ఎపిక్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాకు ఎం ఎం కీరవాణి సంగీతం అందించారు.

## 'ట్రెండ్ సెట్ చెయ్' పాట విడుదల



సుధీర్ బాబు హీరోగా నిర్మిస్తున్న ఫాంటసీ యాక్షన్ మూవీ జటాధర నుంచి ప్రమోషనల్ సాంగ్ 'ట్రెండ్ సెట్ చెయ్' రిలీజ్ అయింది. ఎంటర్‌టైనింగ్ బీట్స్, కలర్ఫుల్ విజువల్స్, సుధీర్ బాబు ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో పాట మంచి వైబ్ క్రియేట్ చేస్తోంది. రీస్ అండ్ జైన్ సామ్ కంపోజ్ చేసిన ఈ సాంగ్ యూత్‌ఫుల్ ఎనర్జీతో అదిరిపోయింది. పాట రచయిత శ్రీమణి తెలుగుతో ఇంగ్లీష్ మిక్స్ చేస్తూ, ఆకట్టుకునే వర్డ్ ప్లేతో సాంగ్‌ను ట్రెండీగా రాశారు. జితేందర్ ,రాజీవ్ రాజ్ వోకల్స్‌తో పాటకు మరింత ఎనర్జీ ఇచ్చారు స్టైలిష్ పబ్ సెట్‌లో తెరకెక్కిన వీడియోలో సుధీర్ బాబు, శ్రేయా శర్మతో కలసి స్టైలిష్ మూవ్ మెంట్ వేస్తూ అదరగొట్టారు. స్మార్ట్ కొరియోగ్రఫీ, కూల్ వైబ్‌తో ట్రేండ సెట్ చెయ్య నిజంగానే టైటిల్‌కి తగ్గట్టే కొత్త ట్రెండ్ సెట్ చేసింది. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మిస్తున్న ఈ మిథాలజికల్ స్పెక్టాకిల్‌లో బాలీవుడ్ స్టార్ సోనాక్షి సిన్హా తొలిసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా నవంబర్ 7న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.








## మద్యం షాపులకు ఊపందుకున్న దరఖాస్తులు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మద్యం దుకాణాల కోసం శుక్రవారం రాత్రి వరకు ఎక్సైజ్ శాఖకు రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులకు శనివారం ఒక్కరోజే మిగిలి ఉండడంతో లక్ష వరకు దరఖాస్తుల సంఖ్య దాటే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 2620 మద్యం షాపులకు శుక్రవారం ఒక్కరోజే 25 వేల దరఖాస్తులు వచ్చాయి. గురువారం వరకు 25 వేల దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. చివరి రోజున 50 వేల దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఇక హైదరాబాద్ డివిజన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రాంతాల్లో 11 ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ఎక్సైజ్ స్టేషన్ల కింద 179 మద్యం షాపులకు శుక్రవారం సాయంత్రం వరకు 1809 దరఖాస్తులు వచ్చాయి. శనివారం మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ కావడంతో భారీగా దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నట్లు హైదరాబాద్ డిప్యూటి కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని మద్యం షాపులకు దరఖాస్తులు వేయడానికి వచ్చె వారి వాహనాలు ఎగ్జిబిషన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రంగారెడ్డి డివిజన్‌లో పది వేల దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు పేర్కోన్నారు. తెలంగాణ వ్యాప్తంగా కూడ దరఖాస్తుల వెల్లువ కొనసాగుతుంది. శక్రవారం సాయంత్రం 3 గంటల వరకు భారీగా 15వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. సాయంత్రం వరకు 20వేల నుంచి 25వేల వరకు దరఖాస్తులు వచ్చే అంచనాలు ఉన్నాయి.














## పాలన గాలికి వదిలి వ్యక్తిగత వివాదాలు

### మాజీ మంత్రి హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మంత్రివర్గంలో మంత్రులు అరడజన్ వర్గాలుగా చీలిపోయారని, ఒకరంటే మరొకరికి పడతలేదని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. సిఎం, మంత్రులు రాష్ట్ర పాలనను గాలికి వదిలి వ్యక్తిగత వివాదాలు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ మంత్రులు కమీషన్ల కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం మరొకరు, వాటాలు, కబ్జాలు ఇలా మంత్రివర్గం ఒక దండుపాళ్యం ముఠాగా మారిందని ఎద్దేవా చేశారు. పారిశ్రామిక వేత్తలను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను, సినిమా హీరోలను, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతున్నప్పటికీ బిజెపి ఎందుకు మౌనంగా ఉన్నదని, ముఖ్యమంత్రే తుపాకీ పంపించారంటే ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. దీనిపైన కేంద్ర ప్రభుత్వం వెంటనే స్వతంత్ర జ్యుడిషియల్ కమిషన్‌తో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ 23 నెలల పాలనలో ఏం చేశారని, ఏం సాధించారన్నారు. ఏం సాధించారని రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవాలను నిర్వహిస్తుందని మండిపడ్డారు. మంత్రివర్గంలో దీపావళి కానుకగా ప్రజలకు ఏదైనా తీపి వార్త చెబుతరేమో అని తాము బావించామని, కానీ ప్రజలకు తీవ్ర నిరాశను మిగిలించారన్నారు. ప్రజలకు కష్టం వస్తే బిఆర్ఎస్ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని హరీశ్ రావు తెలిపారు.












Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com